ఆదివారం గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 157 పేజీలు: 12 వెల: 6.50

ప్రశ్న రావణ్‌కు 18 దాకా రిమాండ్ 3లో
రాజ్యసభ మూడు సీట్లకు నోటిఫికేషన్ 9లో

# 3 రీజియన్లలో క్రీడా సిటీలు



## రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ చేయాలి
### 51.88 చ.కిమీ విస్తీర్ణంలో వైజాగ్ బే సిటీ
### ప్రతి జిల్లాకు ఎకనమిక్ ప్రొఫైల్
### 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్
### మూడు ప్రాంతాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యానవన పంటల సాగుతో తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డ్ సృష్టించిన కడప జిల్లా లింగాలం మండలం స్ఫూర్తితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పురోగతికి హార్టికల్చర్ గ్రోత్ ఇంజిన్ అవు తుందని, 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలన్నారు. ఈ ప్రాంత స్థితిగతులు మార్చే శక్తి హార్టికల్చర్‌కు ఉందని...తిరుపతి ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌లో రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. పూర్వోదయ పథకం కింద రూ.40,000 కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో వచ్చే మరో రూ.60,000 కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని అధికారులకు సీఎం చెప్పారు. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల కన్నా సీమలోని ఓ మండలంలో ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉండటాన్ని అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో ప్రజలు రూ. 7.30 లక్షలు తలసరి ఆదాయం కలిగి ఉండడం హార్టికల్చర్ పంటల సాగు వల్ల కలిగే లాభాలకు నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. హార్టికల్చర్ కు అత్యంత అనువైన రాయలసీమలో ఆ దిశగా ప్రజలను మరింత ప్రోత్సహించాలన్నారు. సీమలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను తీసుకువస్తే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతాయని సిఎం అన్నారు. ఆ దిశగా జిల్లా అధికారుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. సచివాలయంలో సోమవారం రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ రీజియన్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణపై పలు మార్గదర్శకాలను సూచించారు. ఇప్పటికే విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఆవిష్కరించగా...6 నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యాక ముసా యిదాను ప్రజలు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏ రంగాల్లో తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అమరావతి, తిరుపతి, విశాఖలో అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారు >>2



సోమవారం ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటో

## యుద్ధవిమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం
### అత్యున్నత గౌరవం ప్రదర్శించిన ఇండొనేసియా ప్రభుత్వం
### జకార్తాలో స్వయంగా స్వాగతించిన అధ్యక్షుడు సుబియాంటో

**జకార్తా,జులై 6:** మూడుదేశాల పర్యటనలో భాగంగా తొలి దేశంగా ప్రధాని మోడీ ఇండోనేషియాలోకి ప్రవేశించగానే యుద్ధ >>2

## భారత్ ఎఐ రాజధానిగా ఎపి
### ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం
### రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లు
### సియోల్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్



సోమవారం సియోల్‌లో 'షూ ఆల్స్' కంపెనీ చైర్మన్ లీ చియాంగ్‌గెన్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్

**విజయవాడ,జూలై6,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడమే తమ ధ్యేయం ఏపీ మానవ వనరులశాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ( ఆర్ టి ఐ హెచ్ ) ద్వారా "వన్ ఫ్యామిలీ,వన్ ఎంటర్ ప్రెన్యూర్ల నినాదంతో ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ టెక్ స్టార్టప్ లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ అమరా వతిలో ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఆర్ టీఐహెచ్ విశా ఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనం తపురం ప్రాంతీయ శాఖలతో పనిచేస్తోందన్నారు. టాటా, ఎల్ టీ, జీఎంఆర్, గ్రీన్‌కో, అదానీ, జేఎస్‌డబ్ల్యూ వంటి ప్రఖ్యాత సంస్థల సహకారంతో దీనిని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆర్ టీఐహెచ్ ఫుల్ లైఫ్ సైకిల్ ప్రోగ్రామ్స్ అయిన స్పార్క్ (ఆలోచనల రూప కల్పన), క్యాటలిస్ట్ (18 వారాల ఇంక్యుబేషన్), వెలాసిటీ ల్యాబ్ లలోకి కొరియన్ స్టార్టప్‌లను ఆహ్వానం పలుకుతు న్నామన్నారు. ఈ వేదిక ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్ లకు మద్దతునిచ్చింది, 5,200కు పైగా ఎంటర్ ప్రెన్యూర్ లను భాగస్వాములను చేసింది. ఏపీ ఇన్నోవేషన్ స్టార్టప్ పాలసీ 2024-29లో భాగంగా ప్రోటోటైపింగ్, డీప్‌టెక్ గ్రాంట్ల కింద 22 కోట్ల ఆర్.టి. ఐ హెచ్ .ఐ డి బి ఐ సీడ్ ఫండ్, 20 కోట్ల వరకు టి.సీ సీడ్ ఈక్విటీ, క్రెడిట్‌గ్యారెంటీ వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాం. 160కి పైగా విసి /ఏం జెల్ సిండికేషన్ నెట్‌వర్క్ కలిగిన ఆర్ టీఐహెచ్ ఇప్పుడు ఏఐ, క్వాంటం, అధునాతన తయారీ కోసం ఎస్ ఐ డి బి ఐ భాగస్వామ్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన డీప్‌టెక్ ఏం జెల్ ఫండ్‌తో ఇప్పుడు మరింతగా విస్తరించినట్లు తెలిపారు. స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దాం: ఆర్‌టీఐహెచ్‌ను కేంద్రంగా చేసుకుని ఇండియాకొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటు కోసం కలిసి పనిచేద్దామని కొరియన్ సంస్థలను ఆహ్వానిస్తున్నాం. ఒక ప్రత్యేక కొరియా డెస్క్, సాఫ్ట్‌ల్యాండింగ్ "విసి బే", కొరియన్ ఏజెన్సీలతో (కోట్రా/కె స్టార్టప్) సహఇంక్యుబేషన్ ఏర్పాటుచేస్తాం. దీనిద్వారా రెండువైపులా మార్కెట్ ప్రవేశం లభిస్తుంది. కొరియన్ స్టార్టప్‌లు భారతదేశంలోని టైర్ 2-3 మార్కెట్లలోకి, ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లు కొరియాలోకి రావడం సులభ తరమవుతుంది. భారతదేశ ఆక్వాకల్చర్‌లో ఆంధ్రప్రదేశ్ సుమారు 40 వాటాను కలిగి ఉంది, 1,053 >>2

## ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదలీలపై 13 నుంచి నిషేధం అమలు

**విజయవాడ,జూలై6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటా యింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వంతాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థికశాఖ (హెచ్‌ఆర్‌ప్లానింగ్‌పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీచేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టతఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సిన ప్రక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించింది. స్థానిక కేడర్ల పంపిణీ పూర్తయ్యే వరకు పరిపాలనా చర్యలపై పరిమితులు ఉంటాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.



అవ్వకు స్వయంగా ప్రసాదం అందిస్తున్న టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర

## ఈ జన్మకు ఇది చాలు స్వామీ!
### విఐపి బ్రేక్ దర్శనంతో పులకించిన 116యేళ్ల అవ్వ
### అంతటి వృద్ధాప్యంలోను కాలినడకన తిరుమలపైకి

**తిరుమల,జులై 6ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా రాజ్యాంగహోదాలోని ప్రముఖులకు లభించే విఐపి ప్రోటోకాల్ బ్రేక్ దర్శనం తరహాలో ఎలాంటి ఆర్భాటంలేకుండా 116ఏళ్ళ అవ్వకు ఆమె కుటుంబానికి దక్కడం సాక్షాత్తు ఆ దేవదేవుడు ఇచ్చిన అరుదైన అవకాశం. శతాధిక వయస్సు దాటినా ఆ అవ్వకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై అచంచలమైన భక్తివిశ్వాసాలు కలిగి ఉండటమే ఇందుకు నిదర్శనం. 116 ఏళ్ల వయస్సులోనూ మూడురోజుల క్రిందట అలిపిరి మెట్లదారిలో కాలినడకన తమిళనాడుకు చెందిన నవనీతమ్మ సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆ స్వామిని ప్రత్యేక దర్శనం చేసుకుని పులకించిపోయింది. ఈ జన్మకు ఇది చాలుస్వామీ అంటూ అవ్వ మనస్సులోనే ఉత్సాహం చూపింది. నవనీతమ్మ కాలినడకన తిరుమలకు రావడం, ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ >>2



## ఇంకా అన్వేషణే
### గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
### మరో ఘటనలోని 20 మంది సురక్షితం
### కర్రి చిన్నను జాగ్రత్తగా తీసుకు వస్తున్నాం: విశాఖ రేంజి ఐజి గోపీనాథ్ జెట్టి

**విశాఖపట్నం, జులై 6 ప్రభాత వార్త:** విశాఖ సముద్ర తీరానికి సమీపంలో గల్లంతైన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులోని ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరాయంగా కొనసాగుతుందని విశాఖ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గోపీనాథ్ జెట్టి తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన గాలింపు చర్యల వివరాలను వెల్లడించారు. జూలై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పడవ జూలై 4న తిరిగి చేరుకోవాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా ప్రమాదానికి గురై గల్లంతైందన్నారు. పడవలో మొత్తం ఏడుగురు మత్స్యకారులు ఉండగా, వారిలో కర్రి చిన్నను పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని తెలిపారు. మిగిలిన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. జూలై 4 అర్ధరాత్రి సమయంలో సమాచారం అందిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు భారత తీర రక్షక దళం, భారత నౌకాదళాన్ని అప్రమత్తం చేసి సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత తీర రక్షక దళానికి చెందిన రెండు నౌకలు, భారత నౌకాదళానికి చెందిన రెండు నౌకలు ప్రమాదం జరిగిన ప్రాంతంలో నిరంతర గాలింపు నిర్వహిస్తున్నాయన్నారు. అదేవిధంగా నౌకాదళం, తీర రక్షక దళానికి చెందిన డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్లు సముద్రంపై వైమానిక గాలింపు కొనసాగిస్తున్నాయని చెప్పారు. విశాఖపట్నంలోని ప్రాంతీయ ఆపరేషన్స్ స్టేషన్ (రోస్ ) ద్వారా ఎలక్ట్రానిక్ నిఘా కూడా నిరంతరం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం సముద్రంలో నాలుగు మీటర్ల వరకు ఎత్తైన అలలు, గంటకు సుమారు 50 నాటికల్ మైళ్ల వేగంతో వీస్తున్న గాలుల కారణంగా గాలింపు, రక్షణ చర్యలకు తీవ్ర >>2



సోమవారం ముగ్గురు అదనపు న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్

## ముగ్గురు జడ్జిల ప్రమాణ స్వీకారం

**విజయవాడ,జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులుగా సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురషోత్తమ్ కుమార్ చింతలపూడిలచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనియామకాలతో ఏపీ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29నుంచి 32కు చేరింది. ఈకార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులురిజిస్ట్రార్లు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు కొన్ని చోట్ల ఈదురుగాలులతో వానలు

**విజయవాడ,జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీరం దాటినట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన ఆరు గంటలలో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయువ్యదిశగా కదిలిన వాయుగుండం.. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటినట్లు సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాయుగుండం రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేనట్లు తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసేనట్లు పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు, మంగళవారం ఈ పరిస్దితి ఉండవచ్చుని, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వర్షం కురిసే సమయంలో కల్వర్టులు, కాలువల సమీపంలోకి వెళ్లవద్దని సూచించింది. ఎల్‌నినో ప్రభావం ఖరీఫ్ సీజన్ మీద పడుతోంది. ఎల్‌నినో కారణంగా అడపాదడపా వానలు పడుతున్నా.. సాగుకు అనుకూల వాతావరణం ఉండటం లేదు. అలాగే కృష్ణా పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలలోనూ జూన్ నెలలో ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు.



ముంబయిలో భారీ వర్షాలకు కాలువలా కనిస్తున్న ఓ రహదారి

### ముంబయి నుంచి కాశ్మీర్ దాకా
## వరద ముంపు
### ఉగ్రరూపంతో ప్రవహిస్తున్న నదులు
### కొండచరియలు విరిగిపడి పలువురు దుర్మరణం
### వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
### మహారాష్ట్రలో భారీ వర్షాలకు 10మంది మృతి

**శ్రీనగర్,జులై 6:** జమ్మూకశ్మీర్‌లో అటు ప్రకృతి విపత్తు ఒక విలయంగా మారింది. దోడాకిశ్త్‌వాడ్ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా చీనాబ్ నది ఉగ్రరూపం దాల్చింది. రాంబన్ జిల్లాలోని బగ్లిహార్ డ్యామ్ ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అధికారులు సోమవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లను ఎత్తివేసి నీటిని కిందకు విడుదల చేశారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, మునుపెన్నడూ లేని విధంగా డ్యామ్ గేట్లను తెరవడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ ప్రాంతంలో ఒక్కసారిగా మేఘ విస్ఫోటం సంభవించడంతో ఊహించని రీతిలో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడటంతో రహదారులన్నీ బురదమయంగా మారాయి. ఈ ప్రకృతి ప్రకోపానికి కిశ్త్‌వాడ్‌లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు సైట్ తీవ్రంగా దెబ్బతింది. కొండల నుంచి దూసుకొచ్చిన భారీ రాళ్లు, మట్టి పెళ్లల కింద ప్రాజెక్టుకు చెందిన అనేక వాహనాలు, మిల్లులు, ఇతర యంత్రాలు పూర్తిగా కూరుకుపోయాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. భారీ యంత్రాల సహాయంతో బురదను తొలగించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. బాధితులకు, పర్యాటకులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది ఈ వరద విపత్తుల నడుమ సింధు జలాల ఒప్పందం పై భారత్ తన కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్తాన్ శాశ్వతంగా, నమ్మదగిన రీతిలో స్వస్తి పలికే వరకు 1960 నాటి ఈ ఒప్పందం సస్పెన్షన్ లోనే ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ >>2

7-7pg2exHMNWJQE_7-7pg2exHMNWJQE.qxd 06/Jul/26 11:58 PM Page 1





సోమవారం జకార్తాలో ప్రధాని మోడీతో ముచ్చటిస్తున్న ప్రవాస భారతీయులు

## యుద్ధవిమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం

>> విమానాలతో స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ప్రధాని మోడీ విమానం నుంచి వీక్షించారు. ప్రస్తుతం ఈజెట్ రక్షణగా వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.రాజధాని జకార్తాకు చేరుకున్న మోడీకి ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా స్వాగతం పలికారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరోసారి చాటిచెప్పారు. మోడీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన క్షణం నుంచి ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ప్రత్యేక ఎస్కార్ట్‌ను అందించాయి. భారత ప్రధాని విమానాన్ని జకార్తా వరకు భద్రతా పరిరక్షణతో వెంట తీసుకెళ్లడం ద్వారా ఇండోనేషియా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ప్రదర్శించింది. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, దౌత్య ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా భారత్‌ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, సముద్ర భద్రత, ఇండోపసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా భారత్‌ఇండోనేషియా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోడీ పర్యటనలో పలు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశమున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి.

# ఇంకా అన్వేషణే

>> ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ అందుబాటులో ఉన్న అన్ని వనరులతో 72 గంటల ప్రామాణిక సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మరొక 24 గంటల పాటు తొలి విడత రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని, తాజా సమాచారం అందిన వెంటనే వెల్లడిస్తామని గోపీనాథ్ జెట్టి తెలిపారు. బాధిత కుటుంబాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాత్రికే ఒడ్డుకు చిన్నను తీసుకొస్తాంమెర్చంట్ వెసెల్‌లో సురక్షితంగా ఉన్న కర్రి చిన్నను తీరానికి తీసుకురావడానికి కోస్ట్ గార్డ్, నౌకాదళం ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మరో నౌకకు మార్పిడి చేయడం లేదా హెలికాప్టర్ ద్వారా తరలించడం ప్రమాదకరంగా ఉండటంతో ఆపరేషన్‌ను జాగ్రత్తగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో విశాఖ పోర్టు అధికారులతో చర్చించి సంబంధిత వాణిజ్య నౌకకు ముందుగానే బెర్తింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇదే క్రమంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ మత్స్యకారులంతా వేటకు వెళ్లేటప్పుడు తప్పకుండా బోటుకున్న ట్రాన్స్ పాండర్ ను తప్పకుండా ఆన్ చేసి ఉంచాలని విజ్ఞప్తి చేశారు.మరొక ఘటనలో 20 మందిని సురక్షితంగా రక్షించారు. ఇదిలా ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇంజిన్ దెబ్బతిని సముద్రంలో చిక్కుకుపోయిన మరొక మత్స్యకార పడవలోని 20 మంది మత్స్యకారులను కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, భారత తీర రక్షక దళం, ఒడిశా మెరైన్ పోలీసు సంయుక్తంగా సురక్షితంగా రక్షించారని తెలిపారు. **ఆరు గంటల పాటు తిరగబడిన బోటుపైనే ఉన్నారు : ఎమ్మెల్యేవంశీ** "నేను కర్రి చిన్నాతో మాట్లాడాను. ఆయన చెప్పిన దాని ప్రకారం. నాలుగో తేదీ సాయంత్రం 3.00 గంటల ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న బోటు సాంకేతిక సమస్యల వల్ల తిరగబడిపోయింది. ఆ సమయంలోనే కర్రి చిన్న వాళ్ల అన్నయ్య బోటు కిందకు పోయారు. మిగిలిన వారంతా తిరగబడిన బోటుపైనే రాత్రి 9.00 గంటల వరకు ఉన్నారు. ఆ బోటు క్రమేపీ మునిగిపోయింది. తెడ్డు ఆధారంగా వారంతా కొంత దూరం ఈదుకుంటూ వచ్చారు. వస్తూ వస్తూ ఉండగా ఒకిద్దరు మధ్యలో ఆగిపోయారు. నలుగురు కొంతవరకు వచ్చి ఆగిపోయారు. చిన్న ఒక్కడే ఈదుకుంటూ వచ్చి అక్కడికి దగ్గరలో లంగరు వేసి ఉన్న పనామా జెండాతో ఉన్న షిప్‌ను పట్టుకున్నడు. గట్టిగా అరవటంతో అందులో ఉన్న సిబ్బంది చూసి లైఫ్ జాకెట్ ఇచ్చి చిన్నాను రక్షించారు" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వివరించారు.

## పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం,అలసత్వం ఉండకూడదని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఆయా ప్రభుత్వ శాఖల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కార్యచరణ చేపట్టాలన్నారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పారదర్శకంగా వ్యవహరిం చాలన్నారు.రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని ఆయన స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలి. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. 5 రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని... గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. కార్పోరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

## నాగరాజు కస్టడీ షరతుల సవరణపై నేడు హైకోర్టు తీర్పు

**విజయవాడ.జూలై6,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులోనిందితుడిగా ఉన్న సస్పెండైన సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు షరతులు విధించింది. ఈ షరతులను సవరించాలని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు పూర్తికాగా, హైకోర్టు తన తీర్పును రేపటికి రిజర్వ్ చేసింది.చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక వాదనలు వినిపించారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తు ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిందితుడిని ప్రశ్నించే విధానంలో విధించిన పరిమితులు దర్యాప్తు సమర్థతను ప్రభావితం నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే ఆడియో రికార్డింగ్ చేయడం వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టుకు వివరించారు.నిందితుడు నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించడం వల్ల ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు అవసరాల దృష్ట్యా ఈ విధానం సముచితమని పేర్కొన్నారు.నాగరాజు తరఫు న్యాయవాది భిన్న వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని పొంచి ఉందని, భద్రతాపరమైన కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించకూడదని హైకోర్టును అభ్యర్థించారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న హైకోర్టు, ఈ అంశంపై మంగళవారం ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది.

## పలువురు ఐపిఎస్ అధికారుల బదలీ

**విజయవాడ.జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాలకు ఓఎస్డీలను, అదనపు ఎస్పీలను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా మార్కాపూర్ జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి (రాజమండ్రి) అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు.అలాగే మండా జావలి అల్ఫోన్స్‌ను పోలవరం జిల్లా ఓఎస్డీగా నియమించారు.అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా (ఏఎస్పీ) సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# 3 రీజియన్లలో క్రీడా సిటీలు

>> లకు సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో మూడు ప్రాంతాల్లోనూ స్పోర్ట్స్ సిటీలు అభివృద్ధి జరగాలన్నారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంలో సూర్య లంక సహా వివిధ ప్రాంతాల్లోని బీచ్ ఫ్రంట్ లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లోని 51.88 చదరపు కి.మీ. విస్తీర్ణంలో వైజాగ్ బే సిటీ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేలా ప్రముఖ సంస్థల్ని ఆహ్వానించాలన్నారు. బే సిటీలో 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యత ఉందని గుర్తించినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే విశాఖ ఎకనామిక్ రీజియన్లో ఇప్పటికే మొత్తం 49 ప్రాజెక్టులు రాగా...వీటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని, మరో 12 త్వరలో గ్రౌండ్ కానున్నాయని అధికారులు వివరించారు. మరో 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయని చెప్పారు. అయితే వీటితో పాటు వచ్చే 3 నెలల్లో లక్ష చదరపు అడుగుల్లో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అరకు పాడేరువిశాఖను పర్యాటక సర్క్యూట్‌గా రూపొందించి ప్రత్యేక ఆకర్షణ తీసుకురావాలన్నారు. పోర్టులు, షిప్పింగ్ హార్బర్లతో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉంటున్నారు. వెల్నెస్ సెంటర్లకు ప్రత్యేకంగా భూ కేటాయింపులు జరపాలన్నారు. రాష్ట్ర జనాభాలో 32 శాతం అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో నివసిస్తున్నారని, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. భౌగోళికంగా రాష్ట్రానికి మధ్యలో ఉండటం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండటం ఏఈఆర్‌కు అనుకూలించే అంశమని అన్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం...మొత్తం 9 జిల్లాలు అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఉండగా వీటిలో అన్నింటికన్నా కృష్ణా జిల్లా తలసరి ఆదాయంలో ముందుందని అధికారులు చెప్పారు. జిల్లాల వారీగా రీజియన్ అభివృద్ధి జరిగేలా వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు, కొల్లేరుసరస్సును రీజియన్ అభివృద్ధి కోసం వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు.

**వీటీఆర్, ఏఈఆర్‌లో పోటీపడేలా టీఈఆర్:** ఖనిజ సంపద నుంచి హార్టికల్చర్ వరకు...పుణ్యక్షేత్రాల నుంచి పర్యాటక ప్రాంతాల వరకు రాయలసీమకు ఉన్న అనుకూలతలను మార్కెటింగ్ చేసుకోవాలని సీఎం అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తే పెద్దఎత్తున పెట్టుబడులు... తద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీ పడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి జరగాలన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఐఐటీ వంటి విద్యా సంస్థలు, గోల్డ్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరులు రాయలసీమ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గండికోట, హార్సిలీహిల్స్, తలకోన వంటి పర్యాటక ప్రాంతాలను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. శ్రీసిటీ దేశంలోనే నెంబర్ వన్ ఇండస్ట్రియల్ పార్క్‌గా నిలుస్తోందని, అలాగే ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్... ఇలా అన్ని రంగాల్లోనూ పెట్టుబడులకు తిరుపతి రీజియన్ అనుకూలమన్నారు. ఇచ్ఛాపురం నుంచి చెన్నయ్ వరకు నాలుగు వరుసల రైల్వే లైన్ వస్తోందని... మౌలిక వసతులను వినియోగించుకుని టీఈఆర్‌ను మరింతగా ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచన చేయాలన్నారు.

**0.90 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా టీఈఆర్:** స్వర్ణాంధ్ర 2047 విజన్ మేరకు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా ..తిరుపతి ఎకనమిక్ రీజియన్ వాటాగా 0.90 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యం పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. టీఈఆర్ ప్రణాళికల కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య...మొత్తం 9 జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రతీ 2 నెలలకు ఒకసారి 3 ఎకనామిక్ రీజియన్లపై సమీక్ష నిర్వహిస్తామని సీఎం అన్నారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈ మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్,

## డి.సిఎం పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు

**గన్నవరం(కృష్ణా), జులై 6, ప్రభాతవార్త :** ఎన్నికలకు ముందు తన కుమార్తె మరణానికి కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన జనసేనాని పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత కేసును నీరుగార్చేవిధంగా మాట్లాడుతూ తమన మోసం చేసారని సుగాలి ప్రీతీ తల్లి పార్వతి సోమవారం కృష్ణాజిల్లా గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసారు. గత ఎన్నికల సమయంలో సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి అంశాన్ని తరచు ఎన్నికల సభలలో ప్రస్తావించిన పవన్ కళ్యాణ్ తాము అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా ప్రీతి కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాద్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పార్వతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రీతి కేసులో సాక్ష్యాలు లేవంటూ నిందితులకు మేలు చేకూర్చేలా మాట్లాడుతూ తమ కుటుంబాన్ని మోసం చేసారని ఆమె ఆరోపించారు. తమను మోసం చేసిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పార్వతి ఫిర్యాదుపై విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని గన్నవరం సిఐ శివప్రసాద్ తెలిపారు. కాగా ఈకేసులో నేరానికి సంబంధించిన అంశాలు లేనందున కేసు నమోదు చేసే అవకాశాలు లేవనే చెప్పాలి. ఈఉదతంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోలీసు కేసులు పెట్టడం సాధ్యమా కాదా అన్న అంశం తీవ్ర చర్చనీయంశంగా మారింది.

## లిక్కర్ రవాణా స్కామ్ కేసులో రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్

**విజయవాడ.జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ రవాణా స్కామ్ కేసులో రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసారు..రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని నాంపల్లి కోర్టులో ఏ2 రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌లో కోరారు..ఈ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 13కు వాయిదా నాంపల్లి కోర్టు వేసింది.ఈ క్రమంలో ఇదే కేసులో .నిందితులు వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, కారుమూరి సునీల్‌ను వారం రోజులు కస్టడీ కోరుతూ పిటిషన్ ఈడీ దాఖలు చేసారు. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది.

## అయోధ్య ట్రస్టు తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణమోహన్

**అయోధ్య,జులై 6:** అయోధ్య రామమందిర్ విరాళాల చోరీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. విరాళాలు కాజేసిన నిందితులు పట్టుబడేంత వరకు పదవిలో కొనసాగబోనని జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, కోశాధికారి అనిల్ మిశ్రాలు సమర్పించిన రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. అనంతరం ట్రస్టీ సభ్యుల్లో ఒకరైన మధ్యంతర కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. త్వరలోనే సంస్థాగత సమీక్ష అనంతరం తాత్కాలిక కోశాధికారి పేరును కూడా వెల్లడిస్తామని ట్రస్టీ తెలిపింది. ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామ జన్మభూమి కాంప్లెక్స్‌లో సోమవారం శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ మూడుగంటలకు పైగా సమవేశమైంది. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాలను ఆమోదించిన ట్రస్టీ తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. అనంతరం ట్రస్ట్ కోశాధికారి స్వామీ గోవింద్ దేవ్ గిరి మీడియాతో మాట్లాడుతూ రామ మందిర్ విరాళాల చోరీ ఘటన తమ సంఘాన్ని తీవ్రంగా బాధించిందని చెప్పారు. రామమందిర్ విరాళాల చోరీ మమ్మల్ని చాలా బాధించింది. పెద్దమొత్తం కాజేశారా చిన్న మొత్తమా అనేది రెండో విషయం. అంతకంటే ముఖ్యంగా అలాంటి పవిత్రమైన చోట విరాళాల చోరీ జరగడం మమ్మల్ని క్షోభకు గురి చేస్తోందని గోవిద్ దేవ్ గిరి ఆవేదన వ్యక్తం చేశారు. విరాళాల చోరీకి బాధ్యులైన వారిని పట్టుకునేంతవరకు తాను కార్యదర్శిగా కొనసాగడం సమంజసం కాదని చంపత్ రాయ్ రాజీనామా చేశారని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామాను అంగీకరించడం లేదా తిరస్కరించం వంటివి ఎక్కువ రోజులు మా చేతుల్లో ఉండవు. రాజీనామాను వెంటనే ఆమోదిస్తాం. మాకు వేరే దారి లేదని గోవింద్ దేవ్ గిరి తెలిపారు. జూలై 22వ తేదీన మరోసారి సమావేశం అవుతామని ట్రస్ట్ వెల్లడించింది. ఈ సమావేశంలో ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్పించిన తుది నివేదికను సమీక్షిస్తామని, ఆ తర్వాత కొత్త సభ్యులను, కార్యవర్గాన్ని నియమిస్తాని తెలిపింది.



ముంబై ప్రాంతంలో భారీ వర్షాలకు విరిగిపడిన వృక్షాలు

# భారత్ ఎఐ రాజధానిగా ఎపి

>> డీప్‌టెక్, ఫ్రాంటియర్ టెక్, అధునాతన తయారీ హబ్ లలో పెట్టుబడులు కొరియన్ సంస్థలకు లాభసాటి కాగలవని మంత్రి లోకేష్ చెప్పారు.

**అమరావతిలో తొలి క్వాంటంఏఐ యూనివర్సిటీ:** ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం మాధ్యేయం. ఇందులో భాగంగా గూగుల్ ఏఐ హబ్ (ఏప్రిల్ 2026లో శంకుస్థాపన చేశాం. రిలయన్స్, సిఫీ, కంట్రోల్‌ఎస్ తదితర సంస్థలు ఏపీలో 10 గిగావాట్ల డేటాసెంటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాయి. తద్వారా స్టార్టప్‌లకు సరసమైన ధరలకు పెద్ద ఎత్తున కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. భారతదేశపు మొట్టమొదటి క్వాంటం, ఏ ఐ విశ్వవిద్యాలయం అమరావతి క్వాంటం వ్యాలీలో ఆవిష్కృతమవుతోంది. దీనిద్వారా భారతదేశపు అత్యంత అధునాతన 133క్యూబిట్ ఐబీఎం క్వాంటం సిస్టమ్ టూల్, ఐబిఎం – టిసిఎస్ క్వాంటం క్లౌడ్ సర్వీసెస్, ఒక క్వాంటం హార్డ్‌వేర్ పార్క్ అందుబాటులోకి రానున్నాయి. కొరియన్ డీప్‌టెక్ స్టార్టప్‌ల పరిశోధన, సహఅభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయండి:** దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ సీఈవో లీ చియాంగ్‌గెన్ తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... షూఆల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఎంవోయూ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రూ.300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆర్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేసి, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా మార్చాలని కోరారు. షూఆల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్ మాట్లాడుతూ... మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్సార్ప్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బాక్టీరియల్ మెటీరియల్స్ ఏకీకరణతో ఎం ఎఫ్ డి ఎస్ సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్ తయారీలో తమ సంస్థ ప్రత్యేకతకలిగి ఉందని చెప్పారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి ఏఐ స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్ అన్నారు.

# ఒప్పందమా! యుద్ధమా?

### ఇప్పటికీ చర్చల ద్వారానే పరిష్కారం ఆశిస్తున్నా

### 9.1కోట్లమంది ఇరాన్‌ప్రజలకు హానిచేయకూడదనే భావిస్తున్నా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్,జులై 6:** అమెరికాతో ఇరాన్ ఒప్పందం చేసుకోకపోతే మిషన్ పూర్తి చేస్తామంటూ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేసారు. ఓపక్క ఇరాన్‌లో దివంగత సుప్రీం లీడర్ అయొతుల్లా ఖొమైనీ అంత్యక్రియల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్‌కు ఆగ్రహాన్ని రప్పించాయి. అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న వేళ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. అయితే తాను ఇప్పటికీ చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నానని కూడా వెల్లడించారు. ట్రంప్ మాట్లాడుతూ ఒప్పందం జరిగినా, జరగకపోయినా చివరికి గెలిచేది అమెరికానే అని అన్నారు. అయితే 9.1 కోట్ల మంది ఇరాన్ ప్రజలకు ఎలాంటి హాని జరగకూడదనే ఉద్దేశంతో తాను ఒప్పందానికే ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. ఇరాన్ ఇప్పటికే కొన్ని అంశాల్లో అమెరికాకు హామీలు ఇచ్చిందని, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే చర్చల ప్రక్రియలో భాగంగా ఇరాన్ వద్ద ఉన్న అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియాన్ని కూడా అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల ఇరాన్‌పై చేపట్టిన చర్యల ఫలితంగానే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గాయని ట్రంప్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా చూపిన కఠిన వైఖరి కారణంగా చమురు ధరలు ఉద్రిక్తతలకు ముందున్న స్థాయికంటే కూడా తగ్గాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావాలన్న ఉద్దేశం తమకు లేదని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చల ద్వారా పరస్పర అంగీకారంతో శాంతియుత పరిష్కారం సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని మరోసారి వెల్లడించారు.

# ఈ జన్మకు ఇది చాలు స్వామీ!

>> కావడంతో ఆమె భక్తికి పలువురు ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సోషియల్ మీడియా ఖాతాల్లో భక్తికి వయస్సు అడ్డురాలేదని, శ్రీవారిపై భక్తులకు ఉన్న విశ్వాసానికి ఈ వృద్ధురాలే నిదర్శనమని పోస్ట్ చేశారు. ఈ క్రమంలో వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా ఆదివారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ సూచనలతో టిటిడి విజిలెన్స్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, తమిళనాడు చెన్నైకు చెందిన నవనీతమ్మ తిరుపతిలో ఉన్నట్లు కనుగొన్నారు. ఛైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నవనీతమ్మతోపాటు ఆమె కుటుంబ సభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించారు. ఛైర్మన్ కార్యాలయం సిబ్బంది స్వయంగా ఆమెను బయోమెట్రిక్ కేంద్రం నుండి ఆనందనిలయం వరకు వెంట ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శతాధిక వృద్ధ భక్తురాలికి వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం నవనీతమ్మ మనవడు దిక్పతి మాట్లాడుతూ ఆ దేవదేవునిపై అచంచల భక్తివిశ్వాసాలే శ్రీవారి రూపంలో టిటిడి అధికారులు తమ అమ్మమ్మతో పాటు కుటుంబ సభ్యులకు ఎంతో గొప్ప దర్శనభాగ్యాన్ని కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయం వెలుపల టిటిడి సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన తరువాత 116ఏళ్ల అవ్వ తిరుమలలో భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

## ముంబయి నుంచి కాశ్మీర్ దాకా వరద ముంపు

>> శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు.

**ముంబయి,థాణె,రాయ్‌గఢ్‌ప్రాంతాల్లో జల విలయం**

**ముంబయి,జులై 6:**భారీ వర్షాలు మహారాష్ట్రను కుదిపేస్తున్నాయి. ముంబై, పుణె, థానే, రాయగడ్ ప్రాంతాలు వానలకు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలకు సోమవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఒకరు గల్లంతయ్యారు. ఎడతెరిపి లేని వానలతో పుణె జిల్లా మావల్ తహసీల్‌లోని పటాన్‌లో ఈరోజు తెల్లవారుజామున 4:25 గంటలకు పలు ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 30 నుంచి 35 మంది గ్రామస్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ కొండచరియలు విరిగిపడ్డాయని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనతో ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపుణె హైవేపైభారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని ఆయన వెల్లడించారు. సుమారు 100 టన్నుల శిథిలాలు ఒక్కసారిగా ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేపై పడ్డాయని పేర్కొ న్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని.. ఇప్పటివరకు దాదాపు 70 శాతం శిథిలాలను తొలగించినట్లు సీఎం వివరించారు.



పూణే ప్రాంతంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్

పుణె నుంచి ముంబైకి వెళ్లే ట్రాఫిక్ కోసం ఒక లేన్‌ను తిరిగి తెరిచామని, రాబోయే కొన్ని గంటల్లో ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిస్థాయిలోపనిచేస్తుందని ఆయన వెల్లడించారు. 16 రైళ్లను రద్దు చేయగా మరికొన్నింటిని దారి మళ్లించారు. భద్రతా కారణాల దృష్ట్యాముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపూణే హైవేపై రాకపోకలను కూడా తాత్కాలికంగా నిలిపి వేశారు. అత్యసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

## వారం - వర్జ్యం

07-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
సప్తమి మ.1.20
ఉత్తరాభాద్ర సా.4.19
వర్జ్యం : తె.4.07–తె.5.41,
దు.ఉ.8.17–ఉ.9.09, 2)రా11.59–రా.12.51
శుభసమయం : ఉ.9.30–10.15
రాహుకాలం – మ.3.00–4.30

## వార్తాఫలం

**మేషం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. వస్త్రలాభం కలదు.

**వృషభం:** భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కొన్ని ఆర్థిక కారణాల వల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. పెట్టుబడుల విషయాలలో నిదానం అవసరం.

**కర్కాటకం:**కళలు, రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్త్రలాభం.

**సింహం:**ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. కొత్త పెట్టుబడులకు అనుకూలం. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** విద్యావరంగా పురోభివృద్ధి బాగుంటుంది. నూతన వైద్య, విధానములు అనుకూల ఫలితములను ఇస్తాయి.

**తుల :**వృత్తి సంబంధమైన వ్యవహారాలలో ఒత్తిడి అధికం అవడం వల్ల శరీరం అలసటకు గురౌతుంది. బంధువుల కలయిక.

**వృశ్చికం:** బ్యూటీపార్లర్లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. ఎదుటి వారి విషయాలలో జోక్యం చేసుకోవద్దు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఈ రోజు మరిన్ని అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**మకరం:** అవసరమైన సమచారము కొరకు ధనమును, పాత పరిచయములను ఉపయోగిస్తారు. వాహనాలు కొనుగోలు.

**కుంభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. కాని దైవాను గ్రహం వలన మీ ఊహ వాస్తవికతకు దూరం అవుతుంది.

**మీనం:** ఆర్థిక వ్యవహారాలలో పురోగతిని సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణకు ప్రభుత్వ ఆదేశాలు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా ఉపాధిలో కీలకమైన స్థానిక కేడర్ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యక్ష నియామకాల నియంత్రణకు సంబంధించి పలు ఆదేశాలు ఇచ్చింది. కేడర్ బలాన్ని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది బలాన్ని నిర్ధారించడం, పంపిణీ చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులు- 2025 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణకు ప్రభుత్వం ఈ ఆదేశాలిచ్చింది. కేడర్ బలం నిర్ధారణ, పంపిణీకి మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుత ఉద్యోగుల లోకల్ కేడర్‌ను ఆయా విభాగాధిపతులు నిర్ధారిస్తారు. ఈ విభజన భవిష్యత్తు ప్రత్యక్ష నియామకాలపై ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 26 జిల్లాలకు లోకల్ కేడర్ నిర్ధారిస్తారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలు ఈ పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ జిల్లాలకు ఉద్యోగులను తాత్కాలికంగా కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.

# రావణ్‌కు 18వరకు రిమాండ్

## రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై నమోదైన కేసులో కోర్టు అతనికి రిమాండ్ విధించింది. బచ్చులకూరి జోసెఫ్‌పై గన్నవరానికి చెందిన జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ బిఎన్ఎస్‌లోని 152 సహా పలు సెక్షన్లు, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)లోని సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలు మోపారు. రావణ్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 18 వరకు రిమాండ్ విధించారు. యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చులకూరి జోసెఫ్) రిమాండ్ రిపోర్టులో గన్నవరం పోలీసులు కీలక అంశాలు పేర్కొన్నారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. “యువత, విద్యార్థులను రావణ్ రెచ్చగొడుతున్నాడని, అతడిపై తెలుగు రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి. రావణ్ నిషేధిత మావోయిస్టు సంస్థ వైపు యువతను ఆకర్షించేలా ప్రకటనలు చేస్తున్నారు. రావణ్‌పై రాష్ట్ర వ్యాప్తంగా 9 కేసులు నమోదయ్యాయి. మతపరమైన విభేదాలు రెచ్చగొట్టేలా రావణ్ తీరు కనిపిస్తుంది. రాష్ట్రంలో అశాంతిని సృష్టించి యుద్ధం చేయాలనే ఉద్దేశం రావణ్‌లో ఉంది. ఇటీవల ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో రావణ్ రెచ్చగొట్టేలా మాట్లాడారు. రావణ్ అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. పదవుల్లో ఉన్న వారిని రావణ్ దూషించారు. రావణ్, వ్యవస్థలపై ప్రజల్లో ద్వేషం, వైషమ్యాలు సృష్టిస్తున్నారు. మావోయిస్ట్ హిడ్మాను కీర్తిస్తూ రావణ్ ప్రసంగాలు చేశారు. మావోయిస్టు భావజాలాన్ని రావణ్ ఫోన్‌లో గుర్తించాం. దేవుళ్లను అవమానించడం, కించపరచడమే లక్ష్యంగా రావణ్ పని చేస్తున్నారు. రావణ్ పేరు పెట్టుకోవడం కూడా అందులో భాగమే. రావణ్‌కు సహకరిస్తున్న వ్యక్తులు ఎవరో తేల్చాల్సి ఉంది. నిందితుడు రావణ్ విచారణకు సహకరించటం లేదు” అని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

# విదేశీ పెట్టుబడుల కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌ల నియామకం

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశీ పెట్టుబడుల కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో పెట్టుబడుల కోసం ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువని ప్రభుత్వం నియమించింది. పశ్చిమాసియా, ఇతర దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావిని నియమించింది. యూరప్‌కు ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమించింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లపోతు నియమించింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సమన్వయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. జీఓ ఆర్టీ నంబర్ 1333 ద్వారా ఈ నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ అనుసంధానంపై ఎపి ప్రభుత్వం దృష్టి సారించింది.

# ధైర్యంగా ఉండండి

- గాలింపు చర్యలు ముమ్మరం చేశారు
- గల్లంతైన మత్స్యకార కుటుంబాలకు బిజెపి చీఫ్ మాధవ్ పరామర్శ
- చేపల వేటకు వెళ్లే వారికి బీమా తప్పనిసరిగా చేయాలని వినతి



**విశాఖపట్నం, జులై 6 ప్రభాతవార్త:** విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతు కావడం అత్యంత దురదృష్టకరమని, వారిని క్షేమంగా తీసుకురావడానికి ప్రభుత్వ యంత్రాంగాలు అన్నీ సమన్వయంతో పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. సోమవారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్న ఆయన గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, కేంద్ర సంస్థలు బాధిత కుటుంబాలకు అండగా ఉంటాయని భరోసా కల్పించారు. అనంతరం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో ఘటనపై సమీక్ష నిర్వహించి గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ నౌకలు, ఇతర రక్షణ బృందాలతో గాలింపును మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వేటకు వెళ్ళే మత్స్యకారులకు ప్రమాద బీమా తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా లైఫ్ జాకెట్లు కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయాలని ఆవిధంగా చేస్తే వారి ఆచూకీ తెలుసు కోవడానికి మార్గం సులభంగా ఉంటుందని అన్నారు. మెకనైజ్డ్ బోట్లుకు జిపిఎస్ అందుబాటు లోకి తీసుకు రావడంతో రక్షణ చర్యలు పర్యవేక్షణ పెంచాలని, మత్స్యకారులు వేటకు వెళ్ళే మెకనైజ్డ్ బోట్లు కోస్టు గార్డ్ కార్యాలయానికి జిపిఎస్ విధానం అనుసంధానం చేయాలని మాధవ్ సూచించారు. ప్రతి క్షణం విలువైనదేనని, గాలింపు చర్యల్లో ఎలాంటి అలసత్వం లేకుండా యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని ఆయన అధికారులను కోరారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో విద్యుత్ పరికరాల తయారీ యూనిట్ పెట్టండి

- హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పోరేషన్ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో మంత్రి లోకేష్ భేటీ
- ఎపిలో మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయండి
- సాఫ్ట్-ఇపిఐ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్‌కు మంత్రి వినతి
- సియోల్ సెమీ కండక్టర్స్ డిస్ ప్లే ఫ్యాబ్ నెలకొల్పండి
- సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో లోకేష్



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పోరేషన్ పవర్ సిస్టమ్స్ పియు ప్రెసిడెంట్ యోకోటా తకేషితో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లోని హ్యోసంగ్ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం రూ.8వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ నెట్‌వర్క్ కలిగి ఉందని చెప్పారు. 2034నాటికి 15గిగావాట్ల ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌తో, 160 జి డబ్ల్యు క్లీన్ ఎనర్జీ సాధన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 7,248 ఎండబ్ల్యూ కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటన్నింటికీ భారీ స్థాయిలో 765/800 కె.వి ట్రాన్స్‌ఫార్మర్లు, జిఐఎస్, స్టేట్ కామ్ పరికరాలు అవసరం అవుతాయన్నారు. వీటితోపాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ నేపథ్యంలో, విద్యుత్ పరికరాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాలు తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పోరేషన్ పవర్ సిస్టమ్స్ పి యు ప్రెసిడెంట్ యోకోటా తకేషి మాట్లాడుతూ హో సాంగ్ టీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. (పుణె, ఖేడ్ సిటీ) 2006 నుండి భారత్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది చెప్పారు. భారతదేశంలో 66-800 కె.వి జిఐఎస్ పరికరాలను తయారు చేసే ఏకైక సంస్థ హ్యోసంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మాత్రమేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని యోకోటా తకేషి చెప్పారు.

**జిజన్ ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఈడీ, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ అధికారులతో లోకేష్ భేటీ:** దక్షిణ కొరియాకు చెందిన జిజన్ ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఇడి, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ స్టాప్ ఇపిఐ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్‌సుంగ్ చోలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని. డిస్‌ప్లే తయారీదారుల కోసం ఎపిలో మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటుచేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఐఐటీ సహకారంతో ఒక అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్, ఎపిటాక్సీ, ఏమో సివిడి, మైక్రో ఎల్ఇడిలలో ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే సాఫ్ట్‌ఇపిఐ అకాడమీని ఎపి ప్రభుత్వంతో కలిసి ఏర్పాటుచేయాలని కోరారు. సాఫ్ట్ ఈపీఐ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్ మాట్లాడుతూ తమ సంస్థ దక్షిణ కొరియాలో జన్ ఎపివేఫర్లు, మైక్రో ఎల్ఇడి ఉత్పత్తులను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తుందని చెప్పారు. భారత్‌లో ప్రస్తుతానికి ప్రత్యక్ష తయారీ, కార్యకలాపాలు లేవని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు.

**సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో మంత్రి లోకేష్ భేటీ:** సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ 2026లో భారతదేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25శాతం, గత 24నెలల్లో 240 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని చెప్పారు. పరిశ్రమ అవసరాలను గుర్తించి, నైపుణ్యాలను అందించడానికి నైపుణ్యం, కౌసలం పథకాలను ప్రారంభించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కియా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఎల్‌జీ కెమ్, ఎంసీఎన్ఎక్స్ (కెమెరా మాడ్యూల్స్), సోలమ్ (ఏసీ విడిభాగాలు), హ్వాసంగ్ (పాదరక్షలు) వంటి 40కి పైగా కొరియన్ కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉందని, బుల్లెట్ రైళ్లు, రేర్ ఎర్త్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నగరాన్ని నిర్మించడంలో కేంద్రం మద్దతుతో ఏపీ ముందుకెళుతోందన్నారు. ఇటీవల ఇండియా సెమీ కండక్టర్స్ మిషన్ ఆమోదించిన ప్రాజెక్ట్ ఎఎస్ఐపీ, ఏపీఏసీ లిమిటెడ్ కొరియన్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిని శ్రీసిటీ లేదా దాని పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ తమ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీ మాట్లాడుతూ భారత్‌లో తమ సంస్థ ప్రస్తుతం సేల్స్, డిస్ట్రిబ్యూషన్ కార్యాలయానికి మాత్రమే పరిమితమైనట్లు తెలిపారు. భారత్‌లో నేరుగా లేదా జాయింట్ వెంచర్ ద్వారా పెట్టుబడి ప్రణాళికలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ

# వారిది అజమాయిషీ... మాది అభివృద్ధి: కేంద్ర మంత్రి రామ్మోహన్



**శ్రీకాకుళం, జులై 6 ప్రభాతవార్త:** గత ప్రభుత్వ పాలన సమయంలో సమస్యలపై, ప్రజలపై అజమాయిషీ ఉండేది కానీ.. పరిష్కారం, ప్రయోజనాలు ఉండేవి కావని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం నాడు జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. తొలుత హిరమండలం మండలంలోని ధనుపురం గ్రామం వద్ద 29 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను ప్రారంభించారు. అనంతరం పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ నాయుడుకు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్డు నుండి మెళియాపుట్టి వరకు 3.40 కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. పాతపట్నం కేజీబీవిలో 2.55 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన అదనపు వసతి గృహాలను ప్రారంభోత్సవం చేశారు. లోపల గదులను పరిశీలించి సూచనలు చేశారు. పాతపట్నం మండలం కోడూరు వద్ద 2.30 కోట్ల రూపాయలతో నిర్మించిన పీఎం జన్మాన్ హాస్టల్ భవనాలను ప్రారంభించారు. పాతపట్నం మండలం సీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 36 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో ప్రహరీ గోడ, కొత్తూరు మండలం నివగాం నుండి గొట్ట వరకు 2.80 కోట్ల నాబార్డ్ నిధులతో బిటి రోడ్డు, నివగాం నుండి పాతపాడు వరకు 1.50 కోట్ల ఏపీఆర్.ఆర్.పీ నిధులతో నిర్మించిన బిటి రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఎల్.ఎన్.పేట మండలం తాయిమాంబపురం వద్ద బొతాడసింగి వద్ద 2.37 కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సీదిలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు తన కుటుంబంతో పాతపట్నం నియోజకవర్గంకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తామెప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతంలో వేరే పార్లమెంట్ పరిధిలో ఉన్న పాతపట్నం నియోజకవర్గం తన తండ్రి దివంగత ఎర్రంనాయుడు చొరవతో శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో చేరిన వైనాన్ని వివరించారు. రాష్ట్రంలో ప్రజలపై అజమాయిషీ చెయ్యాలని వైసీపీ సర్కారు ప్రయత్నిస్తే మనసారా కోరుకుని కూటమి సర్కారుకు పట్టం కట్టి బరువైన బాధ్యతను అప్పజెప్పారని రామ్మోహన్ నాయుడు అన్నారు. పాతపట్నం నుండి కుప్పం వరకు, అనంతపురం నుండి నెల్లూరు వరకు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టే బాధ్యతను అప్పజెప్పారని అప్పుల ఊబి నుండి అభివృద్ధి వైపు బలమైన అడుగులు వేస్తున్నామని రామ్మోహన్ నాయుడు అన్నారు. అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా ప్రజలకు చేరువ చేశామని రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలను అమలుపరిచి ప్రజమోదాన్ని సంపాదించామని స్పష్టం చేశారు. ఇల్లు, ఫించనులు బాధ్యతగా అందిస్తామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, అధికారులు స్థానికులు పెద్దఎత్తున భాగస్వామ్యం అయ్యారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ఇంకా డోలీ మోతలే!

- కారుమానుకొండలో బాలిక పాము కాటు
- 7 కిలోమీటర్లు డోలి మోతతో వైద్యశాలకు తరలింపు



**పోలవరం, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం జిల్లాలోని కూనవరం మండలం కారుమానుకొండ గ్రామానికి చెందిన చందా సమ్మక్క ప్రియా అనే యువతి పాము కాటుకు గురైంది. దాంతో పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు కొండలపై నుంచి సుమారు 7 కిలోమీటర్ల పాటు ఆ యువతని డోలిలో పెట్టుకొని కాలినడకన సోమవారం ఉదయం కూటూరు ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తెలంగాణలోని భద్రాచలం తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఎత్తైన కొండలపై అనేక కొండారెడ్డి గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు నేటికీ సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో కొండలపై నుంచి ఎక్కటం, దిగటం అనేది ఒక్క కాలినడక మాత్రమే మార్గం ఉంది. రహదారి సౌకర్యం లేని కార్మానుకొండ గ్రామంలో కొండరెడ్డి కుటుంబానికి చెందిన చంద్ర లక్ష్మయ్య కుమార్తె సమ్మక్క ప్రియ. ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. నిద్రమత్తులో ఉన్నప్పుడు తనను ఏదో పురుగు కుట్టిందని భ్రమించిన ఆ యువతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. పాముకాటుకు గురైనట్లు పసిగట్టిన కుటుంబ సభ్యులు ఆ యువతీ నడవలేని స్థితిలో ఉండటంతో డోలి ఏర్పాటు చేసుకొని ఏడు కిలోమీటర్ల పాటు కొండలపై నుంచి దిగి నడుచుకుంటూ సోమవారం ఉదయం కూటూరు పి.హెచ్.సికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా బాలిక పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉంచి వైద్యులు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బాలికను రక్త పింజర పాము కాటుకు గురైనట్టు వైద్యులు గుర్తించారు. ఇప్పటికే రెండు యూనిట్లు ప్లాస్మా ఎక్కించినట్లు వైద్యులు తెలిపారు.



# బిసిల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ లక్ష్యం

- మూడు బడ్జెట్లలో రూ.1.37 లక్షల కోట్ల కేటాయింపుతో చరిత్ర
- బిసి విద్య, గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి భారీ ప్రాధాన్యం: మంత్రి సవిత




**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసిల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో బిసిలకు మరోసారి మంచి రోజులు ప్రారంభమయ్యాయని అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బిసి సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ సాధికారత, రాయలసీమ అభివృద్ధి, గత ప్రభుత్వ వైఖరిపై విస్తృతంగా మాట్లాడారు. సమాజంలో సగానికి పైగా ఉన్న బిసిల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. మూడు బడ్జెట్లలో కలిపి రూ.1.37 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించడం చరిత్రలోనే తొలిసారని, బిసిల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, భోజనం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా సాంకేతిక విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో బిసి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మంత్రి తెలిపారు. బిసి విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు శ్రీసత్యసాయి జిల్లా టేకులోడు, విశాఖ జిల్లా సింహాచలంలో రెండు ఎక్స్‌లెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కొత్త పరిశ్రమను కూడా రాష్ట్రానికి తీసుకురాలేదని మంత్రి విమర్శించారు. 'జె ట్యాక్స్' పేరుతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలను కూడా రాష్ట్రం నుంచి వెళ్లగొట్టిందని ఆరోపించారు. రాయలసీమ అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకమైన అభిమానం ఉందని మంత్రి తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, ఐటి, డిఫెన్స్, విద్య, పర్యాటకం, హార్టికల్చర్ వంటి అన్ని రంగాల్లో రాయలసీమకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలు నేడు పెట్టుబడుల గమ్యస్థానాలుగా మారుతున్నాయంటే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వమే కారణమని మంత్రి సవిత పేర్కొన్నారు.

# ముగ్గురు పిల్లల్ని కంటే నగదు పురస్కారం

- కాన్పుల మధ్య విరామం.. తల్లీబిడ్డకు క్షేమం
- 11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ప్రచారం: మంత్రి సత్యకుమార్



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాన్ని అందచేయనున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో మూడు జంటల(మొత్తం 84 జంటలు)కు రూ.5 వేల చొప్పున నగదును అందచేస్తామని తెలికాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్లపాటు ఎడమ పాటించిన దంపతులకు కూడా నగదు పురస్కారాన్ని ఇస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఆరు ్నజటలకు పై విధంగానే రూ.5వేల చొప్పున నగదు అందచేస్తామని మంత్రి తెలిపారు. ఎక్కువ మంది ఉంటే లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్ల వరకు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని పాటిస్తే మాతృత్వ మరణాల్లో 30 శాతం, శిశు మరణాల్లో 10 శాతం వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం, అవాంఛిత గర్భధారణలను నివారించడం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జులై 11 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. “పిల్లల మధ్య ఎడం పాటిద్దాం.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం’ ’ అనే నినాదంతో ఈసారి ప్రచారం సాగనుంది. గర్భధారణకు సరైన సమయాన్ని ఎంచుకోవడం, కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు కలుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పంచాయతీరాజ్ సంస్థలు, పురపాలక సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మహిళా శిశు అభివృద్ధిశాఖ సిబ్బంది, ఇతర ప్రజా భాగస్వామ్య సంస్థలను ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ .చక్రధర్ బాబు తెలిపారు. ఉత్తమంగా పనిచేసిన వైద్యులు, సిబ్బందికి నగదు పురస్కారాలు ఇవ్వనున్నట్లు చక్రధర్ బాబు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కలిపి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.56 లక్షలను విడుదల చేశామని చెప్పారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Lakshmi Narasimha swamy Temple
Balasinganapalli(V), Chennuru(M), Kadapa District
e-Procurement Tender
NIT.No.P/COE/1027/2026, Date:20.05.2026
e-Tenders are invited through the e-Procurement portal for Construction of Compound wall and 3 Storied Rajagopuram. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee

7-7pg4_7-7pg4.qxd 06/Jul/26 11:07 PM Page 1



వార్త

అనేక విత్తనాలను విత్తడం ద్వారా ఏ విధంగా నేల సారవంతమౌతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

- జెఫర్‌సన్

# అడుగంటుతున్న భూగర్భజలాలు!

నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో భూగర్భమట్టాలు దిగజారిపోతున్నాయి. యేటేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో పెరిగిపోతున్న బోరుబావుల సంఖ్యనే ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం దాదాపు ఎనభైశాతం వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భజలాల భర్తీకి గట్టిప్రయత్నాలు జరగకపోవడంతో మట్టాలు భారీగా పడిపోతున్నాయి. ఈసారి పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో కారణంగా వాతావరణ సంక్షోభంతో భారత్‌లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఏర్పడబోతున్నట్లు వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్‌నినోగా మారడం అత్యంత ప్రమాదకరంగా అంచనాలు వేస్తున్నారు. దేశంలో నైరుతి రుతుపవనాలను అడ్డుకొని వర్షపాతాన్ని బాగా తగ్గించే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితులు వచ్చే యేడాదిలోనూ కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం బాగాపడిపోయే ప్రమాద సంకేతాలు అయితే వెలువడుతున్నాయి. భారతదేశం సాగులో యాభైరెండు శాతానికిపైగా వర్షాధారం మీదనే ఆధారపడి ఉంది. ఈ పరిస్థితుల్లో రుతుపవనాల ప్రభావం ఎల్‌నినోతో తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ రంగం ప్రమాదంలో పడుతుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి. భారత్‌లో 1951 నుంచి ఎల్‌నినో ఏర్పడిన సంవత్సరాల్లో దాదాపు అరవైశాతం లోటుతోనో లేక సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదై వ్యవసాయరంగంపై ప్రభావం చూపింది. ఈ యేడాది చివరినాటికి బలమైన ఎల్‌నినో ఏర్పడనున్నట్లు చెబుతున్నారు. 1950 నుంచి ఇప్పటి వరకు ప్రపంచంలో 1982, 1991, 1997, 2015లలో సూపర్ ఎల్‌నినోలు వచ్చాయి. నైరుతిలో భారత్ తక్కువ వర్షపాతం నెలకొంటుందని, తూర్పు, పడమర, గాలి వలయం తేమతో కూడిన గాలి పైకి వెళ్లకుండా అణచివేయడంతో అటు నైరుతి రుతుపవనాల ప్రభావం తగ్గి వర్షపాతం పడిపోతుందని చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిపెట్టాలని రైతులకు పాలకపెద్దలు సూచనలు ఇస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా దాదాపు మూడువందల కిలో ఘనపు మీటర్ల మేర భూగర్భజలాలను భారత్‌లో వినియోగించుకుంటున్నారు. దేశంలో ఆరువేల ఐదువందల డెబ్భైరెండు భూగర్భజలాల బ్లాకులుండగా వీటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలను తోడేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాక్‌ల పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉంది. భారత్‌లో బోరుబావుల సంఖ్య ఇప్పటికీ గత ఏడు దశాబ్దాల్లో 180 రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. వీటివల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే అయినా నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా నానాటికీ బోరుబావుల మీదనే అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలను వృధా చేయడం నానాటికీ పెరిగిపోతున్నది. పంజాబ్‌లో డెబ్భైశాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడుల్లో నలభైశాతం పైగా భూగర్భజలాలు వాడుతున్నారు. ముఖ్యంగావిద్యుత్ సబ్సిడీలు ఉచితంగా ఇస్తున్న రాష్ట్రాల్లో నీటి వినియోగం తారాస్థాయికి చేరుకున్నదనే చెప్పొచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశవనరుల్లో అరవైశాతానికిపైగా హరించుకుపోతాయని గతంలో ప్రపంచబ్యాంకు నివేదిక హెచ్చరించింది. దేశంలో అధిక శాతం జిల్లాలో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం అంగీకరించడం కలవరపరిచే పరిణామం. గతంలో పార్లమెంటులోనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం 254 జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షారత, 34 జిల్లాలోని భూగర్భజలాలల్లో పాషాణం స్థాయి అధిక శాతంలో ఉన్నదనే విషయం వెలుగుచూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పాషాణం లాంటిలోహాలను భూగర్భ జలాల నుంచి తొలగించడం కష్టంగా మారిందని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఇక కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతల పానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో కూడా వాడకం పెరిగిపోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపించిన కారణంగా భూగర్భజలాలసమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టి వేయలేం. సూపర్ ఎల్‌నినో కారణంగా భూగర్భ జలాల సమస్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషితనీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం.

# ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రయాణికుల భద్రత!

**ప్రభుత్వాల ఈ.విపాలసీ ఫలితంగా పరిశ్రమకూ, ఔత్సాహికులైన కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, రాయితీల నేపథ్యంలో భారీ మొత్తంలో ఇ.విలు రోడ్ల పైకి వస్తున్నాయి. ఐతే ఆశ్చర్యకరంగా వాటిని నిరంతరం ఉపయోగించడానికి అవసరమైన మేరకు రీచార్జ్ చేయడానికి కావలసిన సంఖ్య లో ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడం వాటి వినియోగానికి ప్రధాన అవరోధంగా మారుతున్నది. విద్యుచ్ఛక్తి వాహనాల కొనుగోలుకు ఆర్థిక సదుపాయాన్ని సమకూరుస్తున్న ప్రైవేట్ ఫైనాన్సర్‌లు కొనుగోలుదారులు వాయిదాలను చెల్లించనప్పుడు రిమోట్ ద్వారా బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి ఇ.విలను లాక్ చేస్తున్నారనే ఆరోపణ లు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అదే నిజమైతే ఇలాంటి సాంకేతికత ఉగ్రవాదులు, దేశద్రోహుల చేతుల్లోకి వెళ్తే ప్రయాణీకుల భద్రతతోపాటు దేశ భద్రతకు పెనుప్రమాదం వాటిల్లుతుందనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కొన్ని యాప్‌లను డిజిటల్ ప్లాట్ ఫాంల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.**



డాక్టర్ నీలం సంపత్

ఆధునిక మానవులు సాధిస్తున్న అద్భుతమైన సాంకేతిక ప్రగతి, ప్రతిఫలంగా అభివృద్ధిలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్న ఆటోమొబైల్ రంగ పరిశ్రమ, కోట్ల సంఖ్యలో రహదారులపై శరవేగంగా పరుగులు పెడుతున్న రకరకాల చిన్నా, పెద్ద వాహనాల మూలంగా కార్బన్ మోనాక్సైడ్ కాలుష్యంతో భూతాపం పెరుగుతోంది. సదరు వాహనాల వినియోగం కోసం సాంప్రదాయ శక్తి వనరులైన బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల నిల్వలు రోజు రోజూ అడుగంటి పోతున్నవి. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాంప్రదాయ శక్తి వనరుల కొరతతో ఆటోమొబైల్ రంగం అంతరించిపోయే ప్రమాదమున్నది. ఫలితంగా దేశ ఆర్థికాభివృద్ధికి ఇరుసుగా కొనసాగుతున్న ఉపరితల రవాణా రంగం పెను ప్రమాదంలో చిక్కుకోక తప్పదు. తదనంతర పరిణామాల నేపథ్యంలో దేశ ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విపత్తు నుండి దేశ ప్రజలను కాపాడడానికి ప్రభుత్వం శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగానికి ప్రత్యామ్నాయంగా సాంప్రదాయేతర శక్తి వనరులైన సోలార్, విండ్ పవర్, హైడల్ పవర్, టైడల్ పవర్‌లను, బయోగ్యాస్, బయోమాస్ తదితర పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించాలనే లక్ష్యంతో ఇంధన విధానాన్ని రూపొందించి ముందుకు సాగుతున్న వైనం అభినందనీయమే. ఆధునిక మానవాళి నడవడిక, దైనందిన వ్యవహార శైలి ఫలితంగా భారీ మొత్తంలో వాహనాల వినియోగం కారణంగా కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులతో భూతాపం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. తద్వార సౌకర్యవంతమైన ఆధునిక మానవ జీవనానికి ఊపిరులూదాల్సిన రవాణా రంగం పర్యావరణ విచ్ఛిత్తికి కారణంగా మారుతూ మాన వాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. ఈనేపథ్యం లో ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ కోసం 17 సుస్థిరతతో కూడిన అభివృద్ధి లక్ష్యాలను గుర్తించి వాటి సాధన ప్రపంచ దేశాల బాధ్యతగా నిర్దేశించిన వైనం బహిరంగ రహస్యమే. ఉపరితల రవాణా రంగంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, వ్యయ నియంత్రణ, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ లాంటి చతుర్ముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్న మన దేశం నేషనల్ ఎలక్ట్రికల్ బస్ కార్యక్రమాన్ని ప్రారంభించి అందులో భాగంగా వివిధ కార్పొరేట్ సంస్థల నుండి టెండర్లను ఆహ్వానించింది. సదరు కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా టెండర్‌ని దేశంలో కమర్షియల్ ఇ.విల తయారీలో దాదాపు గుత్తాధికారిగా కొనసాగుతున్న జై భారత్ మారుతి సంస్థ (జె.బి.యమ్) సంస్థ దక్కించుకుంది. అందులో భాగంగా సెప్టెంబర్ 2023 లోనే తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖకు పది సంవత్సరాల కాలపరిమితి తో 500 ఎలక్ట్రికల్ బస్సులను పంపడం గమనార్హం. సదరు బస్సులను టి.జి.యస్.ఆర్. టి.సి రాష్ట్రంలోని వివిధ బస్‌డిపోలకు పంపించడం గమనార్హం. ఆ క్రమంలో కరీంనగర్ రీజియన్‌కు 104 ఇ.వి.బస్సులు కేటాయించడం జరిగింది. ఒప్పందంలో భాగంగా ఇ.వి బస్సులను సమకూర్చడం, వాటికి డ్రైవర్లను నియామకం చేయడం, నిర్వహణలో అవసరాన్ని బట్టి తగు రిపేర్లు చేయించడం జె.బి.యమ్ సంస్థ బాధ్యతయే. ఇక తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కండక్టర్లను నియామకం చేసుకుని ప్రయాణికుల నుండి రోజువారీ రెవెన్యూని వసూలు చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కిలోమీటర్‌కి రూ.




39.80 ల చొప్పున జె.బి.యమ్ యాజమాన్యానికి చెల్లించాల్సిందే. ఎలక్ట్రిక్ వాహనాల పనితీరుని ప్రశ్నార్థకంగా మారుస్తూ వాహనాలలో ప్రయాణిస్తున్న వారిని ప్రమాదాలకు గురిచేస్తున్నది నాణ్యత లేని విదేశీ బ్యాటరీలేననేది నిపుణుల వాదన. వాహనాలు ప్రయాణాలు చేసేటప్పుడు మొరాయించడం, అగ్నికి ఆహుతవడం, భద్రతతో కూడిన ఛార్జింగ్ నియమ నిబంధనల పట్ల స్పష్టత లేకపోవడం, ఛార్జింగ్ సదుపాయాల కొరత, ఛార్జ్ చేసేటప్పుడు కనెక్టర్ల సమస్యలతో పేలి పోవడం లాంటి ప్రమాద ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిన్నటికి నిన్న కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఒకటి తిమ్మాపూర్ దగ్గర క్షణాలలో కాలి బూడిదయ్యింది. రెండు మూడు రోజుల వ్యవధిలో మరో బస్సు స్థానిక బస్‌డిపో ఆవరణలోనే ఛార్జ్ చేస్తున్న సమయంలో అగ్నికి ఆహుతైంది. పై రెండు ఘటనల్లో అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. ఈ దుర్ఘటనలు జరిగిన తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో జె.బి.యమ్ సంస్థ టి.జి.ఆర్.టి.సి కి సమకూర్చిన 500 ఇ.వి లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. మరో వైపు సదరు దురదృష్టకర సంఘటనలపై శాఖాపరమైన సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలను ఇస్తూనే చైనా బ్యాటరీ టెక్నికల్ టీమ్ నేతృత్వంలో టి.జి.యస్.ఆర్.టి.సి ఇంజనీర్లబృందం జతగా నిలిపివేసిన 500 ఇ.వి.లలో 150 బస్‌లను తనిఖీచేసి అవి లోపరహితంగా వంద శాతం ఫిట్‌గా ఉన్నాయని ప్రకటించి వాటిని వాడుకలోకి తీసుకురావడం జరిగింది. ఇక మిగతా 350 ఇ.వి.ల నాణ్యతాపరంగా ఫిట్‌గా ఉన్నాయని తేలిన తర్వాతనే వాటిని రవాణాశాఖ ఉపయోగిస్తుందేమో! ఒక వేల అవి కూడా నాణ్యత పరంగా ఫిట్‌గా ఉన్నాయని తేలితే ఇ.విలు దగ్ధం కావడానికి కారణాలేమిటో మరింతలోతుగా, మరో కోణంలో అధ్యయనం కొనసాగించక తప్పదు. అధ్యయనాలు, ఫలితాలు ఎలా ఉన్నా ప్రస్తుతం ప్రజల ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఇ.విలలో ప్రయాణాలు చేయక తప్పదు. రాష్ట్ర రహదారుల పై భారీ మొత్తంలో వాహనాలు విడుదల చేస్తున్న కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్న వారికి రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డిస్కౌంట్ మరిన్ని ప్రోత్సాహకాలు, వాయిదాల పద్ధతిలో ఋణ సదుపాయాల కల్పనలతోపాటు ధర ఎక్కువైనా సదరు వాహనాలు ఇస్తున్న మైలేజీ ఆర్థికంగా ఆకర్షణీయంగా ఉంటున్న నేపథ్యంలో వాటికి డిమాండ్ పెరుగుతోంది. డిమాండ్‌కి సరిపడా విద్యుచ్ఛక్తి వాహనాలనుఉత్పత్తి చేయడం కోసం బడా బడా ఆటోమొబైల్ పరిశ్రమలతోపాటు చిన్నచిన్న స్టార్టప్‌లకు సైతం ప్రభుత్వం అవసరమైనప్రోత్సాహకాలను, రాయితీలను అందిస్తున్న క్రమంలో కొంతమంది ఉత్పత్తి దారులు లాభాలకోసం ఇ.విల తయారీలో నాణ్యత లేని బ్యాటరీలను ఉపయోగిస్తున్న కారణంగా వారు ఉత్పత్తి చేస్తున్న ద్విచక్ర విద్యుత్ వాహనాలు ప్రమాదాల పాలిట బడుతున్నవనేది నిపుణుల నిశ్చితాభిప్రాయం. స్వదేశంలో బ్యాటరీల తయారీ అంతంత మాత్రంగానే జరుగుతుండడం వాటి తయారీకి సంబంధించి రీసెర్చ్ జరగక పోవడం, అధిక శాతం బ్యాటరీలను చైనా తదితర విదేశాలనుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఏదేమైనా ప్రభుత్వాల ఈ.విపాలసీ ఫలితంగా పరిశ్రమకూ, ఔత్సాహికులైన కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, రాయితీల నేపథ్యంలో భారీ మొత్తంలో ఇ.వి లు రోడ్ల పైకి వస్తున్నాయి. ఐతే ఆశ్చర్యకరంగా వాటిని నిరంతరం ఉపయోగించడానికి అవసరమైన మేరకు రీచార్జ్ చేయడానికి కావలసిన సంఖ్యలో ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడం వాటి వినియోగానికి ప్రధాన అవరోధంగా మారుతున్నది. విద్యుచ్ఛక్తి వాహనాల కొనుగోలుకు ఆర్థిక సదుపాయాన్ని సమకూరుస్తున్న ప్రైవేట్ ఫైనాన్సర్‌లు కొనుగోలు దారులు వాయిదాలను చెల్లించనప్పుడు రిమోట్ ద్వారా బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి ఇ.విలను లాక్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేల అదే నిజమైతే ఇలాంటి సాంకేతికత ఉగ్రవాదులు, దేశద్రోహుల చేతుల్లోకి వెళ్తే ప్రయాణీకుల భద్రతతోపాటు దేశ భద్రతకు పెనుప్రమాదంవాటిల్లుతుందనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కొన్ని యాప్‌లను డిజిటల్ ప్లాట్ ఫాంల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు

ఒరిమికి అపారమైన శక్తి ఉంది. దండించే అధికారం ఉన్నా దండించకపోవడం నిజమైన ఓర్మి.



ఎమ్.కె. గాంధీ

కృతజ్ఞత అన్నది గొప్పగా అలవర్చుకున్న గుణాల ఫలం. దీనిని మనం మోటు మనుషులలో చూడలేం. అంత నాజూకైంది.



శామ్యూల్ జాన్సన్

# ప్రజావాక్కు



## డిజిటల్ ట్రాకింగ్ అవసరం

నగరాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లలో తరచూ వెలుగుచూస్తున్న ఆహార భద్రతా ఉల్లంఘనలు ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలవినియోగం, అపరిశుభ్రమైన వంటగదులు, పురుగుల సమస్య, కృత్రిమ రంగుల వాడకం వంటి ఘటనలు వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. లాభాల కోసం ప్రాథమిక పరిశుభ్రత ప్రమాణాలను విస్మరించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఆహార నాణ్యతలో చిన్న నిర్లక్ష్యంకూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. అప్పుడప్పుడు నిర్వహించే ఆకస్మిక తనిఖీలతో మాత్రమే ఈసమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఆహార భద్రతాశాఖ నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ నమూనా పరీక్షలు, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ లను మరింత బలోపేతం చేయాలి. ప్రతి హోటల్, రెస్టా రెంట్ బయట పరిశుభ్రత రేటింగ్‌ను స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పెరిగిన ఫీజుల భారం

విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది. విద్య మన సమాజ అభివృద్ధికి పునాది. అయితే ఇటీవలికాలంలో పెరుగుతున్న ఫీజులు మధ్యతరగతి దిగువమధ్య తరగతి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో కుటుంబాలు తమ సామర్థ్యానికి మించి ఖర్చు చేయాల్సి వస్తోంది. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యాసంస్థలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలి. సామాజిక బాధ్యతలో భాగంగాకార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల భారం తగ్గించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్య హక్కుగా అందరికీ చేరేలా తగిన నియంత్రణలు, సహాయక చర్యలు అవసరం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## బెదరింపులు ఆపాలి

కొందరు రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల, రాజకీయ అండతో, పలుకుబడితో భూమి కబ్జాలు, రోడ్లు ఆక్రమించి, ప్రజలను బెదరించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా చేయడంవల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీరిపై పోలీస్ శాఖ ద్వారా కౌన్సిలింగ్ చేయాలి.

## సమన్వయంతో పనిచేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, యుద్ధ వాతావరణాలు నెలకొన్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలో స్థిరంగా ముందుకు సాగుతోందని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి పేర్కొనడం ఆశాజనక పరిణామం. వికసిత భారత్ లక్ష్య సాధనలో ఆర్థిక సంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, యువత సాధికారత, మహిళల భాగస్వామ్యం, సహకార సమాఖ్య వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశం ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబడగలదు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధే వికసిత భారత్‌కు పునాదిగా మారుతుందని ప్రధాని చెప్పిన మాటల్లో గొప్ప దూరదృష్టి కనిపిస్తోంది. వ్యవసాయం, వ్యాపారం, శాస్త్రసాంకేతిక రంగాలు, నవీన ఆవిష్కరణలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. మహిళ ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితే కుటుంబం బలపడుతుంది.

- ఎం.నారాయణస్వామి, మహబూబ్‌నగర్‌జిల్లా

## ప్రమాదకరంగా రోడ్డు ప్రయాణాలు

వాతావరణ మార్పులతో ఇటీవల కాలంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగామారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి ఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపై ఉన్న చెట్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖవారు విద్యుత్ వైర్లు తెగిన చోట ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మరమ్మత్తులుచేయాలి. వానాకాలంలో రోడ్లవెంట ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

## ఫోన్లలోనే..మానవ సంబంధాలు

నేడు సమాజంలో మనుషులు అవసరం ఉంటేనే ఫోన్లు చేస్తున్నారు. నేరుగా కలుస్తున్నారు. అవసరం లేకుంటే అర సంవత్సరం అయినా అర్సుకోరు ఎలాఉన్నారు. పరిస్థితులు ఏంటి అని. అంత సమయంలేని జీవితం గడుపుతున్నారు మరి సమాజం. కేవలం అవసరం ఉంటేనే గుర్తుకొస్తారా? కొంచెం సమయం కూడా కేటాయించలేకపోతున్నారు. భవిష్యత్తులో కేవలం మెసేజ్‌లు మాత్రమే చేస్తారేమో అని భయమేస్తుంది.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వ్యాధులు కాదు.. నిర్లక్ష్యమే అసలు వైరస్!

ఫిరోజ్ ఖాన్

ప్రతి వర్షాకాలం కేవలం పచ్చదనాన్నే కాదు.. ప్రజారోగ్యానికి ఒక హెచ్చరికను కూడా తీసుకొస్తుంది. మనల్ని అనారోగ్యానికి గురిచేస్తున్నది నిజంగా వైరస్‌లేనా? లేక వాటికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్న మన నిర్లక్ష్యమా? వర్షాలు సహజం, కానీ వాటి వెంట ప్రతి ఏడాది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, కలరా, టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి వ్యాధులు పునరావృతం కావడం కేవలం ప్రకృతి ప్రభావం మాత్రమే కాదు, ప్రజారోగ్య నిర్వహణ, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, పౌర బాధ్యత వంటి అంశాలతో ముడిపడి ఉన్న సంక్లిష్ట వాస్తవం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు చారిత్రాత్మక స్థాయికి చేరుకున్నాయి. భారత ప్రభుత్వ నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ గణాంకాలు కూడా ప్రతి వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా కేసులు గణనీయంగా పెరుగుతున్న ధోరణిని సూచిస్తున్నాయి ఇదే సమయంలో అంతర్జాతీయ వైద్య పరిశోధనా పత్రిక 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్'లో ప్రచురితమైన అధ్యయనాలు కూడా వాతావరణ మార్పులు వెక్టర్‌బోర్న్ వ్యాధుల భౌగోళిక విస్తరణను ప్రభావితం చేస్తున్నాయని సూచిస్తున్నాయి. కాబట్టి వ్యాధులను కేవలం వైద్య సమస్యగా కాకుండా, ప్రజారోగ్య నిర్వహణకు సంబంధించిన సామాజిక సవాలుగా చూడాల్సిన అవసరం ఉంది. సీజనల్ వ్యాధుల నివారణలో బాధ్యతను ఒకే వర్గంపై మోపడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు. స్థానిక సంస్థలు డ్రైనేజీ నిర్వహణ, చెత్తతొలగింపు, యాంటీ లార్వా చర్యలు, ఫాగింగ్, తాగునీటి భద్రత, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలను సకాలంలో అమలుచేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయి. మరోవైపు, ప్రతి కుటుంబం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకాకుండాచూడడం, కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, నీరు నిలిచే పాత్రలను తరచూ శుభ్రం చేయడం వంటి చర్యలు తీసుకోవడం కూడా అంతే అవసరం. భారత వైద్య పరిశోధనా మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ అధ్యయనాల ప్రకారం, డెంగ్యూ వ్యాప్తి చేసే 'ఈడిస్ ఈజిప్టి' జాతి దోమలు ఇంటి ఆవరణలో నిల్వ ఉండే స్వచ్ఛమైన నీటిలోనే ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. అందువల్ల ప్రభుత్వంచర్యలు తీసుకోవడం మాత్రమే సరిపోదు, ప్రజల భాగస్వామ్యం కూడా విజయానికి కీలకం. ప్రభుత్వం, ప్రజలు అనే భాగస్వామ్య దృక్పథమే ప్రజారోగ్యానికి బలమైన రక్షణ. సీజనల్ వ్యాధుల అసలు ప్రభావం ఆసుపత్రిగోడల వద్ద ఆగిపోదు. అది కుటుంబాల ఆదాయం, పిల్లల చదువు, ఉపాధి, జీవనోపాధిపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ప్రతివర్షాకాలం మనకు ఒకే పాఠాన్ని గుర్తు చేస్తుంది. వ్యాధులు ఒక్కసారిగా పుట్టవు. వాటికి అనుకూల పరిస్థితులు క్రమంగా ఏర్పడతాయి. అందువల్ల ప్రజారోగ్య విజయాన్ని ఆసుపత్రుల్లోని పడకల సంఖ్యతో కాకుండా, వ్యాధులు రాకముందే

# నూతన మార్పునకు నాంది పలికే సంస్కరణలు



నాదెండ్ల శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడింది అనడానికి ప్రభుత్వం ఇటీవల విద్యారంగంలో మార్పులు తీసుకురావడానికి చేపడుతున్న నిర్ణయాలే నిదర్శనం. 1,441 పాఠశాలలను మూసివేసి 2026-27 యూడైస్ లెక్కల నుండి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 640 పాఠశాలల్లో కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ఉండి, ఒక్కవిద్యార్థి కూడా లేకపోవడంతో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపించి వాటిని కూడా త్వరలో మూసివేయాలని నిర్ణయించింది. దీనితో ప్రభుత్వ విద్య పట్ల పాలక వర్గాలకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 2,081 జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు ఉన్నట్టు తేలగా, ప్రస్తుతానికి 1,441 స్కూళ్లను మూసివేయడంతో పాటు, మిగిలిన 640పాఠశాలలను మూసివేస్తే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 24వేలలోపే పరిమితం కానుంది. గ్రామాలలో పాఠశాలలు మూతపడటం వల్ల పేద, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదంఉంది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కంటే వాటిని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. తెలంగాణ సర్కార్ ఏడాదిన్నర క్రితం తెలంగాణ విద్యా కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ తన అధ్యయనంలో రాష్ట్రంలో విద్యా వెనుకబాటును స్పష్టంగా గుర్తిస్తూ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. అదే సమయంలో ప్రస్తుతం విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి విద్యారంగం వెనుకబాటు నుండి బాగు చేయడానికి వలు సిఫార్సులు కూడా చేసింది. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ రూపొందించిన నూతన విద్యా విధానం 2020లోని అశాస్త్రీయ విధానాలను తిరస్కరించాలని, ఉచిత నిర్బంధ విద్య బోధనను 18ఏళ్ల వరకు పెంచాలనే సిఫార్సులు వీటిలో అత్యంత అవసరమైనవి. బడి బయట ఉన్న పిల్లల నుండి అసలు బడి అంటే ఏంటో తెలియని వారి సంఖ్యను కూడా వాస్తవాల రూపంలో వెలుగులో తెచ్చింది. ఈవాస్తవాలే ఇప్పటి ప్రభుత్వానికి కంటగింపుగా మారాయి. 100 మంది విద్యార్థులలో 26 మంది మాత్రమే ప్రభుత్వ బడులలో చేరుతున్నారని సగానికి ఎక్కువ మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని, ప్రభుత్వ రంగంలో 36 శాతం ఏకోపాధ్యాయ బడులు కాగా, 86శాతం బడులలో అన్ని తరగతుల విద్యార్థులను ఒకేగదిలో కూర్చోబెట్టి విద్యాబోధన జరుపుతున్నారని పేర్కొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని, కనీస సౌకర్యాలు లేవని కూడా తేల్చింది. నాణ్యమైన విద్యా బోధనలో మన స్థానం 26 అని, మూడవ తరగతి విద్యార్థులకు వారి కింది తరగతి పుస్తకం కూడా చదవలేని వెనుకబాటు తనంఉందని, ఇంకా ఉన్నత విద్యా సంస్థలకు 77శాతం కళాశాలకు న్యాక్ గుర్తింపులేకపోవడం, యూనివర్సిటీల్లో 80శాతం ఖాళీలతో భ్రష్టు పట్టించిన విషయాన్ని కుండ బద్దలు కొట్టి తెలియజెప్పింది.




ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యమైన విద్య కోసం సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందించాలన్న తెలంగాణ విద్యా కమీషన్ లక్ష్యం విస్తృత ఆశయాన్నిప్రతిబింబించింది. దీనితో కొత్త ఆశలు రెక్కలు తొడిగాయి, విద్యా కమిషన్ చాలా శ్రమకోర్చి పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి ప్లస్ టు స్థాయివరకు శ్రేష్టమైన విద్యకోసం తీసుకురావాల్సిన మార్పులను సూచిస్తూ నివేదిక సమర్పించింది. ఫీజుల నియంత్రణకు సంబంధించి నివేదిక సమర్పించింది. అయిదేళ్ళ ప్రణాళికను ఖచ్చితమైన బడ్జెట్ అంచనాలతో నివేదికను రూపొందించింది. కానీ ప్రభుత్వం ఆ నివేదికతో సంబంధం లేకుండానే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించింది. విద్యాకమీషన్ ఇంకా ఉన్నత విద్య, ఒకేషనల్, టెక్నికల్ విద్యకు సంబంధించిన అంశాలపై చర్చలు, నివేదికలు పూర్తి చేయలేదు. అన్ని విషయాలతో సమగ్ర నివేదిక కూడా తయారుకాలేదు. ఈలోపే ప్రభుత్వం గత నెలలో తెలంగాణ విద్యా విధానం (టిఈపి) రూపొందించడానికి ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌ను రూపొందించారు. ఈప్రక్రియను అంతా పరిశీలిస్తే విద్యా కమిషన్‌లో నిర్మాణ సంబంధలోపాలు, విద్యావిధాన రూపకల్పన ప్రక్రియకు సంబంధించిన లోపాలు స్పష్టంగా కనబడుతున్నాయి. దీంతో ఈ సంస్కరణల లక్ష్యం నెరవేరు తుందా అనే అనుమానం కూడా కలుగుతుంది. నేటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదిక అమలుపై స్పష్టత ఇవ్వలేదు. ఇకపోతే తెలంగాణలో పాఠశాల విద్య అంటే ప్రైవేట్ విద్య మాత్రమే అనే భావన నెలకొని ఉంది. అందులోనూ ముఖ్యంగా తల్లి దండ్రులకు టక్కునగుర్తొచ్చేదినర్సరీ, ఎల్.కె.జి, యుకెజి బోధన, ఇంగ్లీష్ మీడియం బోధన చేసే ప్రైవేట్ పాఠశాలలే. ఈ రకమైన ప్రైవేట్ బోధన మాత్రమే నిజమైన, నాణ్యమైన చదువుగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి సందర్భం లో మురళి కమీషన్ ప్రభుత్వ రంగంలో కూడా నర్సరీ, ఎల్.కె.జి, యుకెజిలను బోధించే పూర్వ ప్రాథమిక విద్యను తీసుకురావాలని, నర్సరీ నుండి పి.జి వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్య బోధన జరపాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, సౌకర్యాలు కలిగినట్టి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో విస్తరించిప్రభుత్వ విద్యలో నాణ్యత పెంచాలని, ప్రతి తరగతికి ఒక గది నిర్మాణం చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, నిత్యం మానిటరింగ్ కోసం జిల్లాస్థాయి పర్యవేక్షణ బోర్డు ఏర్పాటుచేయాలనడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు చాలా ఉపయోగకరమే. పాఠశాల విద్యలో మరోసిఫార్సు ఆయా సొసైటీలుగా కొనసాగుతున్న గురుకుల విద్య సంస్థలను ఒకటిగా కలపడం. కుల వ్యవస్థను సుస్థిరం చేస్తున్న ఆయా కులాల గురుకులాలను కలిపి ఇంటిగ్రేటెడ్ గురుకులాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పౌరసమాజం నుంచి వచ్చినదే. ఇక ఇంటర్మీడియట్ విద్యలో చేసిన సిఫార్సులను పరిశీలిస్తే మెజారిటీ సిఫార్సులు ప్రైవేట్ కళాశాలల, కోచింగ్ సెంటర్ల దోపిడీని అరికట్టడానికి వచ్చినవే. ప్రైవేట్ పాఠశాలల జూనియర్ కళాశాలలో ఫీజుల నియంత్రణ చట్టం రూపొందించాలని సిఫార్సు చేయడం ఆహ్వానించదగినదే. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతంచేయాలి. బడుల్లో మెరుగైనమౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠశాలలను మూసివేయడం సమస్యకు ముగింపు కాదు. వాటికి పూర్వ వైభవం తీసుకురా

# మీ మార్ట్ నీది.. నాది.. మనందరిది.. పేరుతో మినీ మార్ట్‌ల ప్రారంభం

గుంటూరు, జూలై 6, ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు రేషన్ దుకాణాల ఆర్థిక స్వావలంబనను పెంపొందించే లక్ష్యంతో "మీ మార్ట్ (నీది.. నాది.. మనందరిది)" పేరుతో నూతన విధానంలో మినీ మార్ట్‌లను ప్రారంభించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.సోమవారం సాయంత్రం పత్తిపాడు నియోజకవర్గంలోని లాలాపురంలో స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులుతో కలిసి మినీ మార్ట్ ను మంత్రి మనోహర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఒకే చోట నాణ్యమైన నిత్యావసర వస్తువులను అందుబాటు ధరలకు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన



ఉద్దేశమన్నారు. సంప్రదాయ రేషన్ దుకాణాలను ప్రజలకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతూ, వాటిని బహుళ సేవలు అందించే కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. "మీ మార్ట్" ద్వారా ప్రజలకు నాణ్యమైన వినియోగ వస్తువులు సరసమైన ధరలకు లభించడంతో పాటు, రేషన్ డీలర్లకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించబడతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. రేషన్ దుకాణాల ఆధునికీకరణ, పారదర్శకత, సేవల నాణ్యత పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, "మీ మార్ట్ (నీది.. నాది..




మనందరిది)" కార్యక్రమం ఆ దిశగా ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 29,750 రేషన్ షాపులను ఆధునికరించేందుకు, పౌరసరఫరాల శాఖలో సంస్కరణలను తీసుకువచ్చేందుకు ఐదేళ్ల గుజరాత్ రాష్ట్రాన్ని సందర్శించామన్నారు. ఈ మినీ మార్ట్ లను 60 రకాల సరుకులతో ప్రారంభించి, రాబోయే రోజుల్లో 250 రకాల నాణ్యమైన సరుకులను ప్రజలకు అందిస్తామన్నారు. ఆహార సబ్సిడీలను డిజిటల్ రూపంలో అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వినూత్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు.స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నాణ్యమైన సరుకులను పేద ప్రజలకు తక్కువ ధరకు అందించాలన్న లక్ష్యంతో తలపెట్టిన మీ మార్ట్ లను రాష్ట్రంలోనే తొలిసారిగా పత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నూతన విధానాలను ఆలోచిస్తూ, రేషన్ దుకాణాలను బలోపేతం చేస్తూ ఇటువంటి మార్ట్ లను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, డైరెక్టర్ శ్రీవాస్ నుపూర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధ్యాపకులు బోధన నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలి..

**జేఎన్టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రజిని**

ప్రత్తిపాడు, జూలై 6, ప్రభాతవార్త : అధ్యాపకులు బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేసు కోవాలని కాకినాడ జేఎన్టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆలుగోండ రజిని, వివిఐటి డా. చంద్రన్ కుమార్ పండే పేర్కొన్నారు. మండలంలోని యనమదల గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ సెమీకండక్టర్ టెక్నాలజీ సీఎంఓఎస్ ఫ్యాబ్రికేషన్ టిసివిడి సిమ్యులేషన్ పిసిబి డిజైన్ పై జేఎన్టీయూకే సౌజన్యంతో ఐదు రోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్డిపి) సోమవారం



ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేఎన్టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ. రజిని, జేఎన్టీయూకే సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ సికె పండే హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు, ఫలితాధారిత విద్యాతత్వాన్ని పెంపొందించడానికి బోధన, అభ్యాసన వ్యవస్థ, మరియు ఇతర విద్య ప్రక్రియలలో అధ్యాపకులు తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కీలకమైన ప్రాథమిక, మరియు వృత్తిపరమైన నైపుణ్యాలతో అధ్యాపకులు ముందుండాలని, వృత్తిపరమైన సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, కొత్త అభ్యాసకులను తీర్చిదిద్దడానికి ఇలాంటి వేదికలు ఎంతో ముఖ్యమని ఉద్బోధించారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం అనేది ఆన్లైన్లోనైనా లేదా భౌతిక విధానములోనైనా దానిలో పాల్గొనే వారికి గరిష్ట అభ్యాసన ఫలితాన్ని అందించడానికి ఔచిత్యం, అనుసంధానం మరియు అనువర్తనీయత అనే అంశాలు నిర్ధారిస్తాయని చెప్పారు. ఎఫ్డిపి కోసం కీలక అవసరాలు అధ్యాపకులకు బోధనాంశాలు సంబంధితంగా ఉండేలా చూసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా బోధించే బోధనా పద్ధతులు, విధానాలు లేదా సూత్రాలు వారి అభ్యాసకుల సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని సులభంగా అర్థమయ్యేలా బోధించాలని తెలియజేశారు. ఆధునిక సాంకేతిక రంగాలలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ..నానో స్కేల్ పరికరాలు, విఎల్ఎస్ఐ డిజైన్ మరియు సిఐ ఫ్యాబ్రికేషన్లో విద్యాసంస్థల అనుసంధానం, పాఠ్య ప్రణాళికను సెమీకండక్టర్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్చడమే ఈ పిఎఫ్డి కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. భవిష్యత్ అవకాశాలు, పరిశోధన రంగాలలో వాటి వినియోగంపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ఎఫ్‌డీపీ కార్యక్రమానికి కోఆర్డినేటర్ గా డి. రాజేష్, డాక్టర్ కె.తిరుపతయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకోటయ్య, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు (జిఎస్ఆర్), ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ కె. ఆంజనేయులు, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లపాటు అనధికారికంగా గైర్హాజరులో ఉన్న ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ విధుల నుండి తొలగింపు

గుంటూరు విద్య జులై 6 ప్రభాతవార్త: డి శైలజా దేవి, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ , ఎస్.జి ఎన్ .కె పురపాలక ఉన్నత పాఠ శాల, గుంటూరు , 23 ఆగస్టు 2024 నుండి సుమారు 2 సంవత్స రములు పాటు విధులకు అనధికారికముగా గైర్హాజరు అవుతున్నారు. విధులకు ఎందుకు హాజరు అవ్వలేదో కారణములు తెలుపమని ఇప్పటికే పలుమార్లు షో కాస్ నోటీసు లు జారీ చేయడమైనది. వాటికి ఎటువంటి సమాధానము లు సమర్పించి ఉండలేదు . కాబట్టి సదరు ఉపాధ్యాయురాల నుంచి ఎటువంటి స్పందన లేని కారణంగా ఏపీ సి సి ఏ రూల్స్ 1991 మరియు అమలు లో ఉన్న ప్రభుత్వ నిబంధనలు ప్రకారము సంవత్సరం పైగా అనధికారికముగా విధులకు గైర్హాజరైనందున డి శైలజా దేవి, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ , ఎస్.జి ఎన్ .కె పురపాలక ఉన్నత పాఠ శాల, గుంటూరు ఉపాధ్యాయురాలును విధుల నుండి తొలగించుటకు నిర్ణయిచడమైనదనీ గుంటూరు జిల్లా విద్యా శాఖాధికారి ఒక ప్రకటన లో తెలియ చేసారు.

### శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పున: నిర్మాణానికి రూ 1,00116 విరాళం



గుంటూరు విద్య జులై 6 ప్రభాతవార్త : గుంటూరు పట్టణం లాలాపేట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పున:నిర్మాణం చేయుచున్నందున సోమవారం గుంటూరు ఆర్.అగ్రహారంవాస్తవ్యులు సీరం వెంకటేశ్వర రావు ధర్మపత్ని పార్వతిదేవి రూ.1,00,116/ లను చెక్ రూపంలో విరాళముగా దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వహణధికారి టి. సుభద్ర కి అందజేశారు.

# గుంటూరు వార్త



## కెఎల్ యులో ఘనంగా ముగిసిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఎన్ సిసి జాతీయ సమైక్యతా శిబిరం

తాడేపల్లి, జులై 6, ప్రభాతవార్త, జాతీయ సమైక్యత, సాంస్కృతిక సామరస్యం, నాయకత్వ స్ఫూర్తిని బలోపేతం చేయడానికి, దేశంలోని వివిధ ప్రాంతాల నుండి 600 మంది ఎన్ సిసి క్యాడెట్లను ఒకచోట చేర్చి, కెఎల్ యూనివర్శిటీలో 12 రోజుల పాటు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ జాతీయ సమైక్యతా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో ఉత్తర ప్రదేశ్ నుండి మొత్తం 150 మంది ఎన్ సిసి క్యాడెట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఎన్ సిసి గ్రూపుల నుండి 450 మంది ఎన్ సిసి క్యాడెట్లు పాల్గొన్నారని కెఎల్ యు ఎన్ సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వి.మోనిక సోమవారం నాడు తెలిపారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే ఆశయాన్ని స్వీకరిస్తూ, క్యాడెట్లు ఒకరితో ఒకరు మమేకమవ్వడానికి,




ఆలోచనలను పంచుకోవడానికి, ఒకరి సంప్రదాయాలను మరొకరు అర్థం చేసుకోవడానికి, జీవితకాల స్నేహాలను పెంపొందించుకోవడానికి ఈ శిబిరం ఒక అద్భుతమైన వేదికను అందించిందన్నారు.

శిబిరం అంతటా, క్యాడెట్లు వివిధ రకాల విద్యా, సాంస్కృతిక మరియు నాయకత్వ కార్యకలాపాలలో పాల్గొన్నారు. వారు సూర్యలంక వైమానిక దళ కేంద్రం, మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, సూర్యలంక బీచ్, టీటీడీ ఆలయం, చారిత్రాత్మక ఉండవల్లి గుహలను సందర్శించారు. ఈ సందర్శనలు క్యాడెట్లకు భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వం, చారిత్రక ప్రాముఖ్యత గురించి అవగాహన లక్పించడంతో పాటు భారత సాయుధ దళాల పనితీరుపై ఎన్ సిసి క్యాడెట్లకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో చర్చా పోటీలు, ఆశు ప్రసంగాలు, సమూహ చర్చలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. ఇవి క్యాడెట్లలో భావప్రసార నైపుణ్యాలు, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించాయని ఆమె పేర్కొన్నారు.

**శిబిరంలోని ప్రధాన ఆకర్షణలలో ఒకటి సాంస్కృతిక మార్పిడి కార్యక్రమం...**

ఇందులో ఆంధ్రప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల క్యాడెట్లు ఉత్సాహభరితమైన జానపద నృత్యాలు, సంగీతం మరియు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా తమ తమ సంప్రదాయాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం పాల్గొన్నవారిలో ఐక్యతా స్ఫూర్తిని, పరస్పర గౌరవాన్ని మరియు సాంస్కృతిక అవగాహనను బలపరిచిందన్నారు.

క్యాంప్ కమాండెంట్ కల్నల్ శుభంషు దుబే నాయకత్వంలో ఈ శిబిరం నిర్వహించబడింది. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఉదయ్ కుమార్ మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ పర్యవేక్షణలో శిబిర కార్యకలాపాలన్నీ సజావుగా జరిగాయి. కేఎల్ విశ్వవిద్యాలయం తరపున, డాక్టర్ లెఫ్టినెంట్ వి. మోనిక ఈ శిబిరాన్ని విజయవంతంగా సమన్వయపరిచి నిర్వహించారు. ఆమె అంకితభావంతో చేసిన కృషి వల్లే ఈ కార్యక్రమం మొత్తం సమర్థవంతంగా ప్రణాళిక చేయబడి, విజయవంతంగా నిర్వహించారు.

ముగింపు కార్యక్రమానికి కేఎల్ కళాశాల యాజమాన్యం హాజరై, ఈబీఎస్బీ జాతీయ సమైక్యతా శిబిరాన్ని ఘనవిజయంగా మలచడంలో కృషి చేసిన ఎన్‌సిసి అధికారులు, క్యాంప్ నిర్వాహకులు, అధ్యాపక బృందం మరియు క్యాడెట్‌లను అభినందించింది. పన్నెండు రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో పాల్గొన్న వారందరూ ప్రదర్శించిన క్రమశిక్షణ, ఉత్సాహం, నాయకత్వం మరియు నిబద్ధతకు యాజమాన్యం అభినందనలు తెలిపింది.

కేఎల్ కళాశాలలో ఈబీఎస్బీ జాతీయ సమైక్యతా శిబిరం విజయవంతంగా పూర్తి కావడం, దేశ యువతలో జాతీయ సమైక్యత, నాయకత్వ అభివృద్ధి, క్రమశిక్షణ, సాంస్కృతిక మార్పిడి మరియు ఖిఖిభిన్నత్వంలో ఏకత్వంఖిఖి అనే స్ఫూర్తిని ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేకర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్ధి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, ఎన్ సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వి.మోనిక తదితరులు పాల్గొన్నారు.

## కుంచనపల్లిలో ఎస్ఐఆర్ కార్యక్రమం పరిశీలన


తాడేపల్లి, జూలై6, ప్రభాతవార్త: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి మండలం కుంచనపల్లి 72వ బూత్‌లో కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ పరిధిలో ఓటరు జాబితా నమోదు సవరణల తీరును ఆయన స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం అక్కడి బూత్



లెవెల్ ఆఫీసర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశమై ఓటరు జాబితా ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వేమారెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా చూడాలని, ఎలాంటి లోపాలు లేకుండా నిష్పక్షపాతంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు , పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, దొంతిరెడ్డి రామకృష్ణా రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, నియోజకవర్గ బూత్ అధ్యక్షులు దర్శి రమేష్, గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు, కమ్మిశెట్టి శివనాగేస్వరావు, కూరపాటి సాంబిరెడ్డి, మురళి, గడ్డం తాతయ్య, బొంతు సుబ్బారెడ్డి, సాంబిరెడ్డి తో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జివన్ రామ్ వర్ధంతి

తాడేపల్లి, జూలై 6, ప్రభాతవార్త : భారత మాజీ ఉప ప్రధాని, హరిత విప్లవ రథసారథి బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ వైయస్ఆర్ సిపి సమన్వయకర్త దొంతిరెడ్డి



వేమారెడ్డి బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ మంత్రిగా, వ్యవసాయ మంత్రిగా ఉప ప్రధానిగా దేశ ప్రగతికి బాబు జగజ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దళితులు, శ్రామికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులముడి డేవిడ్ రాజు, గుంటూరు జిల్లా ఆక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధా రాణి, కట్టెపోగు భూషణం, రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ నూతక్కి జోష్, రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త సెక్రటరీ మల్లవరపు చిన్ని, వూట్ల పాల శ్రీనివాసరావు, జిల్లా దివ్యాంగుల విభాగ ప్రధాన కార్యదర్శి నూతక్కి కిరణ్, జిల్లా చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి నాగమయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు షేక్ గౌస్, నియోజకవర్గ బూత్ అధ్యక్షులు దర్శి రమేష్, తాడిబోయిన సుబ్బారావు, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, పట్టణ యూత్ అధ్యక్షులు మదాల గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాబూజీకి ఘన నివాళులర్పించారు.

## టీడీపీ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి కార్యక్రమం

మంగళగిరి, జూలై 6, ప్రభాతవార్త స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధానమంత్రి, భారత పార్లమెంటులో నాలుగు దశాబ్దాల పాటు ప్రజాసేవ చేసిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డా.



ఎంఎస్ఎస్ భవన్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. అనంతరం మంగళగిరి కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. కేవలం 33 ఏళ్ల వయస్సులోనే కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న తొలి నాయకుడిగా ఆయన చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. దాదాపు 30 సంవత్సరాల పాటు కేంద్ర మంత్రిగా, 40 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యునిగా ప్రజలకు సేవలందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, రాష్ట్ర ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ళ చిరంజీవి, భైరబోయిన శ్రీనివాసరావు, బట్టు చిదానంద శాస్త్రి, సంకా బాలాజీ గుప్తా, కట్టేపోగు ఉదయభాస్కర్, తదితరులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## జగ్జీవన్‌రామ్ ఆశయాలను అలవర్చుకోవాలి

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై6, ప్రభాతవార్త: కఠోరశ్రమ, సమగ్రత, నిజాయితీ, సమయస్ఫూర్తిగా నిర్ణయాలు తీసుకోవడంతో జగ్జీవన్‌రామ్ ప్రత్యేక లక్షణాలు కలిగిఉన్నారని ఆయనలోని ఈ ప్రత్యేక లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలని జెన్‌కో ఛీఫ్ ఇంజనీర్ కె.సుధీర్‌బాబు సూచించారు. జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి కార్యక్రమం బాబూ జగ్జీవన్‌రామ్ చైర్‌లో



సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సుధీర్‌బాబు పాల్గొన్నారు. అధ్యక్షత వహించిన వీసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ సేవలు అమూల్యమన్నారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితచరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ వంటి పోటీలు నిర్వహించాలన్నారు. నాటి రోజుల్లో ఎన్‌టి.రామారావు, చంద్రబాబునాయుడు వంటి నాయకులు ఉండిఉంటే జగ్జీవన్‌రామ్ ప్రధాని అయ్యిఉండేవారని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పి.జె.రత్నాకర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చైర్ బలోపేతానికి వర్సిటీ ఉన్నతాధికారులు ప్రత్యేక సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంకు ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఓఎస్‌డి రవికుమార్, సిడిఇ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పూలే, అంబేద్కర్ అధ్యయన కేంద్రాల డైరెక్టర్‌లు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య వై.అశోక్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎన్.రత్నకిషోర్,ఉద్యోగులు వై.రాధాకృష్ణ, ఎన్.నాగేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వర్లు, కె.కోటేశ్వరరావు, కె.జేమ్స్, పరిశోధకులు పి.అభిషేక్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి కార్యక్రమం

మంగళగిరి, జూలై 6, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావానికి మూలకారకుడైన ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు రెండు జెండాలు ఉండకూడదని నినదించి కేంద్ర మంత్రిగా రాజీనామా చేసి భారతీయ జనసంఘం అనే ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి దేశ నికి దశా దిశా చూపించిన గొప్ప మానవతావాది చిరస్మరణీయులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా మంగళగిరి పట్టణ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు బిట్రాశివన్నా రాయణ , ఒబిసి మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ కోవెల కారు రాకేష్, జి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తుళ్ళి మిల్లి శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జాతీయ హిందీ అభివృద్ధి బోర్డు



సభ్యులు కాండ్రు భాను కిషోర్, ,ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి పిల్లి నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బొక్క నరసింహారావు, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి పడమటి రాధాకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు బుద్ధంటి రవికిరణ్ ,పట్టణ ప్రధాన కార్యదర్శి కమల కృష్ణ కార్యదర్శి పడమటి సురేష్ , పోలిశెట్టి సోమశేఖర్, కొల్లి బాబురావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నందం యశోద కుమార బాబు, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు పి రామారావు, ఓ బి సి మోర్చా రూరల్ అధ్యక్షులు కర్ణ రోశయ్య, సీనియర్ నాయకులు మైల శ్రీనివాసరావు, ఎస్ ప్రసన్న, కేశవరావు తదితరులు పాల్గొన్నారు

## మంగళగిరిలో ఘనంగా ఆప్కో స్వర్ణోత్సవ వేడుకలు

మంగళగిరి, జూలై 6, ప్రభాతవార్త : ఆప్కో స్వర్ణోత్సవం సందర్భంగా నేతన్నలకు, చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వరాల జల్లు కురిపించారు. త్వరలోనే నేతన్న భరోసా పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ




పూర్తయిందన్నారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన రూ.4 కోట్లు, వచ్చే నెల మొదటివారంలో మరో రూ.2.50 కోట్లు బకాయిలు అందజేయనున్నామన్నారు. నేతన్నలకు పెట్టుబడి భారం తగ్గించేలా ఆప్కో ద్వారా నూలు అందజేసే ఆలోచన చేస్తున్నామన్నారు. రెండేళ్ల కూటమి పాలనలో ఆప్కో బలోపేతానికి చర్యలు తీసుకున్నామన్నారు. మంగళగిరిలోని ఆప్కో తోటలో ఆ సంస్థ స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత జ్యోతి ప్రజల్వన చేశారు.

**చేనేత బ్రాండ్ అంబాసిడర్లగా చంద్రబాబు, పవన్, లోకేశ్**

అందరూ చేనేత వస్త్రాలు ధరించాలంటూ చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. రాష్ట్రంలో చేనేత రంగానికి ఆ ముగ్గురూ బ్రాండ్ అంబాసిడర్లగా వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి మరోసారి స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. చేనేతలకు 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఏటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయించామన్నారు. 15 శాతం సబ్సిడీతో నూలు అందజేస్తున్నామన్నారు. నేతన్నలకు పెట్టుబడి భారం తగ్గించేలా ఆప్కో ద్వారా నూలు అందజేసే ఆలోచన కూడా చేస్తున్నామన్నారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన చేనేత సహకార సంఘాలు ముందుకొస్తే... టీటీడీకి అవసరమైన దుశ్శాలువాలు, చీరలు, జాకెట్లు, కండువాలు పంపిణీ చేసే ఆర్డర్ ఇస్తామని మంత్రి సవిత తెలిపారు. అనంతరం రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత సహకార సంఘలా ప్రతినిధులను మంత్రి సవిత సత్కరించారు. ఆప్కోలో పనిచేసే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.1.20 లక్షల విలువ చేసే బెనిఫిట్స్ ను చెక్ రూపంలో మంత్రి సవిత అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ప్రతినిధులు, పలు కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వర్, ఆకాశపు స్వామి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ధనుంజయ రావు, పెద్ద సంఖ్యలో నేతన్నలు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా వార్త



## కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేకే దుష్ప్రచార మోతాదు పెంచిన జగన్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 6, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి.. సంక్షేమం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లు రాష్ట్రాభివృద్ధికోసం చేస్తున్న కృషి ప్రజలు గుర్తించకూడదన్న ఓర్వలేని తనంతోనే గొడ్డలిపార్టీ, ఆ పార్టీ అధినేత జగన్ అవినీతి మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై విషప్రచార మోతాదు పెంచారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల్లో పర్యటించారు. గోవిందాపురంగోనెపూడి గ్రామాల మధ్య మార్గంలో రూ.40 లక్షలతో,



చందవరం సాతులూరు డొంకమార్గంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న హై లెవల్ వంతెనలకు ప్రత్తిపాటి స్థానిక నాయకులతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన గోవిందాపురంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఏజెంట్లే ఇంటింటికీ తిరిగి తమ పార్టీ సానుభూతిపరుల వివరాలు సేకరిస్తుంటే..ఓట్లు ఎవరు తొలగిస్తారు? జగన్ ఐదేళ్ల పాలన విధ్వంసం, అవినీతికి ప్రతిరూపమని, వైసీపీ గొడ్డలిపార్టీ అని ప్రజల్లో నాటుకుపోయిన నమ్మకాన్ని చెరిపేసేందుకు జగన్, కూటమి ప్రభుత్వంపై, సొంత మీడియా, సామాజిక మాధ్యమాల్లో విషప్రచారానికి తెరలేపాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు."సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై అవినీతి మీడియాలో జగన్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడన్న ప్రత్తిపాటి.. తన పార్టీ బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి వైసీపీ సానుభూతిపరుల సమాచారం సేకరించి, నేరుగా బీఎల్ఓలకు అందిస్తున్నారని, వారు పున: పరిశీలించి డిజిటలైజ్ చేస్తున్నారని, ఈ వ్యవహారంలో ఓట్ల తొలగింపునకు ఎక్కడ ఆస్కారముంటుందని ప్రత్తిపాటి నిలదీశారు. ఎంతసేపు ఏదోరకంగా తన అవినీతి మీడియాలో ప్రభుత్వంపై బురదజల్లడం తప్ప, జగన్ కు మరో ఆలోచన లేదని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రేపేందుకే... జగన్ సోషల్ మీడియా దుష్ప్రచారానికి శ్రీకారం చుట్టాడు ప్రజా విశ్వాసాన్ని పొందలేకనే జగన్ ప్రాంతీయ, కుల, మత విద్వేషాలు రేపుతున్నాడని, దానిలో భాగంగా సామాజిక మాధ్యమాలను సాధనంగా వినియోగించుకుంటున్నాడని ప్రత్తిపాట పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న జగన్ కుట్రలు ఎన్నటికీ నెరవేరవన్నారు. అలజడులు, ఆందోళనలు రేకెత్తించి, తద్వారా గతంలో తన పార్టీ సాగించిన విధ్వంస, అవినీతి విధానాలను కూటమిప్రభుత్వానికి ఆపాదించాలన్నదే జగన్ పన్నాగమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

4 ప్రధాన గ్రామాలను అనుసంధానించేలా హై లెవల్ వంతెనల నిర్మాణం గోవిందపురం గోనెపూడి, చందవరం - బుక్కాపురం గ్రామాల్ని అనుసంధానించే మార్గాల్లో రూ.55 లక్షలతో రెండు హైలెవల్ వంతెనల నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేసినట్టు ప్రత్తిపాటి చెప్పారు. వంతెనలు నిర్మించాక, వీబీ జీ రామ్ జీ నిధులతో సౌకర్యవంతంగా ఆయా గ్రామాలను అనుసంధానించే ప్రధాన రోడ్లను నిర్మిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. సరైన రవాణా సౌకర్యం ఏర్పడితే, రైతులకు మేలుజరగడంతో పాటు, భూముల ధరలు పెరుగుతాయని ఆయన తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, పిల్లి కోటేశ్వరరావు, బండారుపల్లి మస్తాన్ రావు, రమణ రెడ్డి, వెంకట రామి రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రకాశం, సిద్ధ రెడ్డి, చుండు అనిల్, రామ కోటయ్య, రాఘవయ్య, హనుమంతరావు, సాంబశివరావు టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 59 ఏళ్ల తర్వాత ఒకేచోట చేరిన 1967 ఎస్ఎస్ఎల్సీ పూర్వ విద్యార్థులు
## పసుమర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం

కపసుమర్రు, చిలకలూరిపేట, జూలై 6, ప్రభాతవార్త: శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, పసుమర్రులో హైస్కూల్ ప్రారంభమైన అనంతరం 1961-1967 మధ్య విద్యనభ్యసించి, 1967లో తొలి ఎస్ఎస్ఎల్సీ బ్యాచ్‌గా ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులు ఆదివారం తొలిసారిగా ఆత్మీయంగా కలుసుకుని పునర్మిళన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాచ్‌లో మొత్తం 24



మంది విద్యార్థులు ఉండగా, వారిలో 10 మంది ఇప్పటికే స్వర్గస్తులయ్యారు. ఈ సమావేశానికి ఇద్దరు మహిళలు, 11 మంది పురుషులు సహా మొత్తం 13 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ప్రస్తుతం వీరందరి వయస్సు సుమారు 77-78 సంవత్సరాలు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ బాల్యస్మృతులను గుర్తుచేసుకుంటూ ఆనాటి పాఠశాల జీవితం, స్నేహబంధాలు, సరదా సంఘటనలు, జీవితంలో వచ్చిన మార్పులు, కుటుంబ పరిస్థితులు తదితర అంశాలపై ఎంతో ఆత్మీయంగా చర్చించుకున్నారు. చిన్ననాటి అల్లరిని తలుచుకుంటూ నవ్వులు పూయగా, అలనాటి రోజులు తిరిగి రావని భావోద్వేగానికి లోనైన క్షణాలు కూడా చోటుచేసుకున్నాయి. దాదాపు 59 సంవత్సరాల తర్వాత మళ్లీ ఒకేచోట కలుసుకోవడం తమకు నమ్మశక్యంగా లేదని వారు పేర్కొన్నారు. తమ పిల్లలు జీవితంలో స్థిరపడటంతో పాటు మనవలు, మనవరాళ్లతో ఆనందంగా గడుపుతున్న విషయాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ పునర్మిళన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరుకాగా, డాక్టర్ బెల్లంకొండ దక్షిణామూర్తి గారు ప్రత్యేకంగా మస్కట్ నుంచి విచ్చేయడం విశేషంగా నిలిచింది. ఈ ఆత్మీయ కలయికలో శ్రీ గద్దె హరిబాబు, మద్ది రామ సుబ్బారావు, వాడల సుబ్బారావు, సిరీల్ కుమార్, గడిపూడి శ్రీహరి, కొల్లూర రామారావు, కొల్లూర వెంకటరమణారావు, జాలాది హనుమంతరావు, జాలాది వీర కోటేశ్వరరావు, పెద్ది హరినాథ్ బాబు, డాక్టర్ బెల్లంకొండ దక్షిణామూర్తి, జాలాది సీతా మహాలక్ష్మమ్మ, ఉమాదేవి, కొత్తకోట విశ్వనాథం పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శ్రీ కోట సుదర్శన్‌రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీ వై. హనుమంతరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీ బూదాటి రామకోటేశ్వరరావు, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది 1967 ఎస్ఎస్ఎల్సీ బ్యాచ్‌కు చెందిన 14 మంది పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ పునర్మిళన కార్యక్రమం పాత జ్ఞాపకాలను సజీవం చేయడంతో పాటు స్నేహబంధాల విలువను మరోసారి చాటిచెప్పిన అపూర్వ సందర్భంగా నిలిచింది.

## టిడిపి నేత శ్రీనివాసరావుకు ప్రత్తిపాటి పరామర్శ



నాదెండ్ల (చిలకలూరిపేట), జూలై 6, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం చందవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కానుగంటి శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆయన్ని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## శ్రీసాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేట, జూలై 6, ప్రభాతవార్త: విడదల సేవారత ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలలో భాగంగా సోమవారం చిలకలూరిపేట శ్రీ సాయి ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విడదల సాంబశివరావు మరియు తోట శేషాద్రి నాయుడు. స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## బిజెపి కార్యాలయంలో ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి

చిలకలూరిపేట, జూలై 6, ప్రభాతవార్త: నర్సరావుపేట బిజెపి పార్టీ ఆఫీస్ లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి లో. మరియు నూతన పల్నాడు జిల్లా ఇంచార్జ్ మరియు కొ ఇంచార్జ్ ల పరిచయ కార్యక్రమం లో చిలకలూరిపేటభారతీయ జనతా పార్టీ (బిజెపి) చిలకలూరిపేట నియోజకవర్గ కార్యాలయం ఆధ్వర్యంలో మహోన్నత దేశభక్తుడు, భారతీయ జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు ఘనంగా వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మొదటగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి



పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు."భారత్ మాతా కీ జై,"శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అమర్ రహే అనే నినాదాలతో కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. చిలకలూరిపేట బిజెపి ముఖ్య నాయకులు, జిల్లా కార్యదర్శి గట్టా హేమ కుమార్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు పూర్వ చంద్ర రావు ,పట్టణ ఉపాధ్యక్షులు చంద్ర , కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకురాలు తుబాటి రాజ్యలక్ష్మి ,ఎడ్లపాడు టౌన్ సభ్యులు శ్రీనివాసరావు ,బాలకృష్ణ , రాయుడు,కుప్పం కళ్యాణ్ మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి
### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట టౌన్, జులై 6 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏపీ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్ పోర్టల్ ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలోని భూముల యజమానులు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్య భవనాల యజమానులు, గిడ్డంగులు, షెడ్లు, కార్యాలయ స్థలాల యజమానులు తమ ఆస్తుల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సోమవారం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ పోర్టల్‌లో నమోదైన వివరాలను దేశీయ, అంతర్జాతీయ సంస్థలు



పరిశీలించి తమ అవసరాలకు అనుగుణంగా స్థలాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనివల్ల స్థానికంగా పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని కావున, ఈ అవకాశాన్ని [illegible] పోర్టల్‌లో నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సూచించారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి ...

నరసరావుపేట, జూలై 6 ప్రభాతవార్త: బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. సోమవారం గుంటూరు రోడ్ లోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే స్వాతంత్ర్య సమరయోధుడు, రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేసిన గొప్ప ప్రజానాయకుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని చంద్వా గ్రామంలో జన్మించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సామాజిక సమానత్వం కోసం జీవితాంతం



పోరాడిన మహోన్నత నాయకుడని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని అనంతరం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కొట్టా కిరణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించారు.

## ఆత్మహత్య కేసులో నిందితులను శిక్షించాలి :: ఎమ్మార్పీఎస్

నరసరావుపేట టౌన్, జులై 6 ప్రభాతవార్త :: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు వారి కుమారుడు క్రాంతి కుమార్ కృష్ణలంక సీఐ వేధింపులకు గురయ్యారని ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతరాల మీరయ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. క్రాంతి కుమార్ మరణానికి కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో



ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ ను వారికి అందించాలన్నారు. క్రాంతి కుమార్ ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిని గుర్తించి దోషులకు శిక్ష పడే విధంగా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎమ్మార్పీఎస్ ఒక కారణమని తెలియజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కూటమి ప్రభుత్వానికి సంఘం జిల్లా అధ్యక్షులు చింతరాల మీరయ్య కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.

## తిరుమల..లో జాతీయస్థాయి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

నరసరావుపేట, జులై 6, ప్రభాతవార్త: స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులపాటు జాతీయస్థాయి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వైవి నారాయణ సోమవారం తెలిపారు. ఐదు రోజుల సదస్సు ను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ కాకినాడ జేఎన్టీయూ సౌజన్యంతో కార్యక్రమాన్ని 6 తేదీ నుండి 10 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ ఇమేజింగ్ మరియు డ్రగ్ డిస్కవరీ లో ఏఐ వినియోగం అనే అంశంపై కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ తెలియజేశారు. జూలై 6 నుండి



ప్రారంభమవుతున్న తరగతులు 10 వరకు కొనసాగుతాయన్నారు విద్య మరియు వైద్య రంగాలలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక అంశాలను( మెడికల్ ఇమేజింగ్ మరియు డ్రగ్ డిస్కవరీ కొరకు డి ఫ్యూజన్స్ మోడల్స్ మరియు జనరేటివ్ ఏఐ వినియోగం ( కృత్రిమ మేధాసంపత్తి ) అనే అంశంపై అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ వివరించారు. కార్యక్రమంలో జేఎన్టీయూ కోఆర్డినేటర్ డాక్టర్ జి మాధవి, డాక్టర్ ఎం అపర్ణ, వివిధ కళాశాలల నుండి వచ్చిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట టౌన్, జులై 6 ప్రభాతవార్త : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న "అమరావతి ఛాంపియన్‌షిప్-2026" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సోమవారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా స్పోర్ట్స్ అధికారి పి. నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని యువతీ యువకులు, క్రీడాకారులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ ఒక మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ




ఛాంపియన్‌షిప్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా పాఠశాలలు, కళాశాలలు, క్రీడా సంఘాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అమరావతి ఛాంపియన్‌షిప్-2026 పోటీలు జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు మూడు దశల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు.జిల్లా అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు . అండర్-17, అండర్-23 విభాగాలకు చెందిన బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.91.90 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు నరసింహారెడ్డి వివరించారు.

## జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న గుండాల రాకేష్

నరసరావుపేట టౌన్, జూలై 6 ప్రభాతవార్త : తెలుగు సాహిత్య రంగంలో తన రచనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నరసరావుపేటకు చెందిన కవి, రచయిత గుండాల రాకేష్ ప్రతిష్ఠాత్మకమైన అక్షరరత్న జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గివితి), గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో ఈ




పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.తెలుగు భాషా వికాసానికి, సాంప్రదాయ కళల అభ్యున్నతికి గుండాల రాకేష్ అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఈశ్వరి భూషణం, శ్రీనాథుడు వంశీయులు కావూరి శ్రీనివాస శర్మ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## వాల్మీకి/బోయల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కు వినతి

నరసరావుపేట, జూలై 6 ప్రభాతవార్త: : వాల్మీకి / బోయ సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి సంక్షేమ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నరసరావుపేట నియోజకవర్గం వాల్మీకి బోయ సంఘం బొల్లారావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అధ్యక్షులు ఓంకార్, కార్యదర్శి మల్ల వెంకటేష్ తో కలిసి జిల్లా కలెక్టరేట్ కృత్తికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్



వాల్మీకి/బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి నాయుడు ఆదేశాలతో మేరకు తాము జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా పునరుద్ధరణ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకి/బోయ జనాభా మొత్తం 24లక్షల 87 వేల మందికిపైగా వున్నారని, వాల్మీకి యువతకు ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి బోయలు కోల్పోయిన రాజ్యాంగ హక్కులు, సంక్షేమ, అభివృద్ధి, సాధికారత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకులు రాజామోహన్, మినిగా బాబు,బాలు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు వసతి గృహ సౌకర్యం వినియోగించుకోవాలి..

నకరికల్లు, జూలై 6 ప్రభాతవార్త : గుంటూరు కాపు హాస్టల్ వసతి సౌకర్యాల్ని 202627 విద్యా సంవత్సరానికి ఇతర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రతినిధులు బొలిశెట్టి విజయకుమార్ రాయల శ్రీనివాస్ రావు, సిరిగిరి నరేంద్ర, రామాంజనేయులు మిరియాల అజయ్ తెలియజేసారు. గుంటూరులో ఏపీ,తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కాపు విద్యార్థులు విద్యను అభ్యసిస్తేవారికి ఈసౌకర్యంకల్పిస్తున్నామన్నారు. ఇంటర్,డిగ్రీ,బీటెక్,పిజి, రెండు పిహెచ్డి కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు హాస్టల్లో ఉండేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఎంబీఏ,



ఎంసీఏ, సీఏ తదితర వృత్తి విద్యా కోసం చదువుతున్న విద్యార్థులకు కూడా అవకాశం ఉంటుందన్నారు. సౌకర్యవం తమైన వసతి తో పాటు నాణ్యమైన భోజన సౌకర్యం ఉందన్నారు. 24 గంటల పాటు గ్రంథాలయ సౌకర్యం, క్రమబద్ధమైన స్టడీ అవర్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు కాపు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## రాజుపాలెం మండలం నూతన పురిపాలన అధికారిగా మహబు సుభాని

రాజుపాలెం, జూలై 6, ప్రభాతవార్త: రాజుపాలెం మండలం ,నూతన పరిపాలన అధికారిగా,డి మహబు సుభాని బాధ్యతలు స్వీకరించారు, వీరు ప్రత్తిపాడు మండలం, సీనియర్ అసిస్టెంట్ నుంచి, ప్రమోషన్ మీద రాజుపాలెం మండలం పరిపాలన అధికారిగా వచ్చి ఉన్నారు.



## వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం

రాజుపాలెం, జూలై 6, ప్రభాతవార్త: రాజుపాలెం గ్రామంలో మార్కెట్ యార్డు ఆవరణ నందు రాజుపాలెం మండల వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ,లావు శ్రీకృష్ణదేవరాయలు, నూతనంగా నియమించబడిన చైర్మన్కు వైస్ చైర్మన్ కు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు వీరు తెలియజేసినారు, ఈ కార్యక్రమంలో భాగంగా లావు కన్నా మాట్లాడుతూ వైసీపీ ప్రతి అంశాన్ని వివాదాస్పదంగా చేస్తుంది కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుంది వైసిపి రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేసిన జగన్ వైసిపి హయాంలో కుల వ్యవస్థను నాశనం చేసిన జగన్ ప్రజలకు జగన్ రెడ్డి ద్రోహం చూస్తున్నారు. కూటమి పాలనలో సంక్షేమం అభివృద్ధి జరుగుతున్నాయి. సభ అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న (మార్కెట్ యార్డ్ చైర్మన్



విజయ భాయ్, గోవింద నాయక్ ), వైస్ చైర్మన్ భవనాసి కిషోర్ మార్కెట్ యాడ్ డైరెక్టర్స్ జూలకంటి మోలాబి ఆరుద్ర నాగమణి ఆకుల వెంకటరమ ణ,. బొమ్మిశెట్టి సీత ,లింగాల దీనమ్మ , ముప్పాళ్ళ పుష్పావతి , దేశవతు చిలకమ్మ బాయ్ , అసుకోళ్ల వెంకటేశ్వర్లు, సరికొండ పెద బ్రహ్మరాజు ,జూవల్లి లక్ష్మయ్య, బత్తిన శ్రీనివాసరావు , తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు , మార్ల గడ్డ నరసింహారావు ,రావుట్ల సాంబశివరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో దరువూరి నాగేశ్వరరావు, సెక్రెటరీ శంకర్ రెడ్డి, అంచుల నరసింహారావు, తోట నరసయ్య, బత్తుల హనుమంతరావు శనగపూల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పావలా వడ్డీ పేరుతో అదనపు భారం..

సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: పావలా వడ్డీ పేరుతో అదనపు భారం.. డ్వాక్రా మహిళలపై బ్యాంకుల చార్జీల మోపావలా వడ్డీ రుణాలా.. లేక చార్జీల భారమా? "డ్వాక్రా మహిళల గోడు.. పథకం ఒకటి, అమలు మరోటి?" చెప్పేది పావలా వడ్డీ.. చేసేది అదనపు చార్జీల వసూళ్లు అంటూ సత్తెనపల్లి నియోజకవర్గంలోని డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారత కోసం పావలా వడ్డీకే రుణాలు అందించాలని ప్రకటించినా, బ్యాంకులు మాత్రం వివిధ పేర్లతో అదనపు చార్జీలు వసూలు చేస్తూ తమపై భారం



మోపుతున్నాయని బాధితులు వాపోతున్నారు.రుణం మంజూరు చేసే సమయంలో జీఎస్టీ చార్జీలు, ఆడిట్ చార్జీలు, ప్రాసెసింగ్ ఫీజు, పెనాల్టీ చార్జీలు వంటి పేర్లతో వేల రూపాయలు మినహాయిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు..దీంతో ప్రభుత్వం చెప్పిన పావలా వడ్డీ ప్రయోజనం తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకోవైపు, పొదుపు సంఘాల సభ్యులు ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పొదుపు చేసిన లక్షల రూపాయలు బ్యాంకుల్లో జమగా ఉన్నప్పటికీ, వాటికి తగిన వడ్డీ ప్రయోజనం కల్పించడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. అయితే అదే సమయంలో రుణాలపై మాత్రం వడ్డీతో పాటు వివిధ చార్జీలు విధించడం అన్యాయమని అంటున్నారు. సత్తెనపల్లి పట్టణంలో సుమారు 1000 వరకు డ్వాక్రా పొదుపు సంఘాలు ఉన్నట్లు సమాచారం.ఒక్కో గ్రూపుపై వేల రూపాయల అదనపు భారం పడటంతో రుణాల వడ్డీలు చెల్లించలేక ఇప్పటికే పలువురు మహిళలు తమ గ్రూపులను మూసివేసే పరిస్థితి నెలకొందని పొదుపు సంఘాల బాధితులు చెబుతున్నారు. గ్రూపులో సభ్యురాలు ఎన్నో సంవత్సరాలుగా రుణాన్ని సక్రమంగా చెల్లిస్తూ వచ్చినప్పటికీ, అనారోగ్యం, కుటుంబ సమస్యలు లేదా మరణం వంటి కారణాలతో కొంతకాలం వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడితే, బకాయిపై వడ్డీతో పాటు అదనపు వడ్డీలు కూడా విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, ఒక సభ్యురాలు రుణ బకాయిని చెల్లించలేకపోతే, ఆ సభ్యురాలిపై పడే ఆర్థిక భారాన్ని కూడా మిగిలిన గ్రూపు సభ్యులపైనే మోపుతూ వసూళ్లు చేస్తున్నారని మహిళలు వాపోతున్నారు.... దీంతో మిగిలిన సభ్యులు కూడా అదనపు వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు.పేద మహిళలకు అండగా నిలవాల్సిన బ్యాంకులు, వివిధ రకాల చార్జీలతో వారిని మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించి బ్యాంకుల వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి, నిజంగా పావలా వడ్డీ రుణాల ప్రయోజనం మహిళలకు అందేలా చర్యలు తీసుకోవాలని డ్వాక్రా సభ్యులు కోరుతున్నారు.ప్రభుత్వం ప్రకటించిన పావలా వడ్డీ పథకం నిజమైన లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో చేరాలంటే, బ్యాంకుల వ్యవహారశైలిపై సమీక్ష నిర్వహించిసంస్కరణలు చేపట్టాలని డ్వాక్రా మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు..

## అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు.


సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి పంచాయతీ పరిధిలోని వావాలాలనగర్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులను కంకణాలపల్లి రైతులు అడ్డుకున్నారు..ఎల్ సి నెంబర్ 41 వద్ద రైల్వే అధికారులు యు ఆకారంలో అండర్ గ్రౌండ్



బ్రిడ్జిని నిర్మిస్తున్నారు...అండర్ పాస్ బ్రిడ్జి ని వంపు లేకుండా నేరుగా నిర్మించాలని డిమాండ్ చేశారు..యు ఆకారం లో నిర్మిస్తే వ్యవసాయ ఉత్పత్తులు యార్డుకు తీసుకెళ్ళేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు ..నేరుగా నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## సత్తెనపల్లి-నరసరావుపేట రోడ్డు మార్గం..
## ప్రయాణికుల పాలిట నరకయాతన

సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనాలు రోడ్డు గుంతలుమయంగా ఉన్న పట్టించుకోవటం లేదు అంటున్న స్థానిక ప్రజలుకనీసం మరమ్మత్తులైనా చేయండి అని అక్కడి స్థానికులు కోరుతున్నారు. సత్తెనపల్లి పట్టణంలో సత్తెనపల్లి నుండి నరసరావుపేట దారిలో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి. పట్టణంలోని చెక్ పోస్ట్ వద్దనుండి పరివర్తన వరకు రోడ్డు గుంతలు గా ఏర్పడి అధ్వానంగా ఉండటంతో నిత్యం ఎవరో ఒకరు గుంతలను తప్పించబోయే సమయంలో ద్విచక్ర



వాహనదారులు కిందపడి గాయాలు పాలవుతున్నారు.ఇప్పటికే ద్విచక్ర వాహన దారులు ప్రమాద బారిన పడిన సందర్భాలు స్థానికులు చూస్తున్నారు ఒపక్క బైపాస్ పనులు జరుగుతున్న కారణంగా లారీలు అధిక సంఖ్యలో తిరుగుతూ ఉండటమే దీనికి కారణమని అక్కడ స్థానికులు వాపోతున్నారు. ప్రాణ నష్టం జరగక ముందే స్పందించి గుంతలు గా ఏర్పడిన రోడ్డుకు. కనీస నాయకులను కోరుకుంటున్నారు .

బాపట్ల జిల్లా వార్త



## పాఠశాలల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

### పెండింగ్‌లపై అధికారులకు చురకలు

బాపట్ల, జులై 6, ప్రభాతవార్త, ప్రతినిధి: జిల్లాలో విద్యాశాఖ అధికారుల పనితీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్‌వి. వినోద్‌కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో పలువురు మండల స్థాయి అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ, స్వర్ణగ్రామ-స్వర్ణవార్డు సచివాలయాల పనితీరును సమీక్షిస్తూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు, ఉపాధ్యాయులహాజరు, అపార్



ఐడీలు, మధ్యాహ్న భోజన వివరాలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ తదితర అంశాల్లో తీవ్ర నిరక్ష్యం బయటపడిందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వారం సమీక్షలు జరుగుతున్నప్పటికీ ఆశించిన పురోగతి కనిపించకపోవడం బాధాకరమన్నారు.

**చుండూరులో ఇంకా 17 శాతం నమోదు పెండింగ్:** ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పూర్తి చేయాల్సి ఉండగాచుండూరు మండలంలో ఇంకా 17 శాతం నమోదు పెండింగ్‌లో ఉండడాన్ని కలెక్టర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి తప్పనిసరిగా బడిలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఉపాధ్యాయులహాజరుపై ప్రశ్నల వర్షం:** అమర్తలూరు మండలంలో ఉపాధ్యాయుల హాజరు కేవలం 85 శాతానికే పరిమితం కావడంపై సంబంధిత ఎంఈఓను కలెక్టర్ నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా విధుల్లో అలసత్వం సహించబోమని స్పష్టం చేశారు.

**విద్యార్థుల హాజరు కూడా ఆందోళనకరం:** వేటపాలెం మండలంలోవిద్యార్థుల హాజరు కేవలం 82 శాతమే నమోదవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

**ఎంటీయూలో సున్నా... కారణమేంటి?** :అమర్తలూరు మండలంలో ఎంటీయూ నమోదు సున్నాగా ఉండడంపైఅసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు గల కారణాలను సంబంధిత అధికారిని నేరుగా ప్రశ్నించి వెంటనే లోపాలు సరిదిద్దాలని ఆదేశించారు.

**రేపల్లెలో ఒక్క అపార్ ఐడీ కూడా లేదు:** వారం రోజుల వ్యవధిలో రేపల్లె మండలంలో ఒక్క అపార్ ఐడీ కూడా నమోదు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇది అధికారుల నిరక్ష్యానికి నిదర్శనమని, లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**చీరాల అర్బన్‌లో ఎండీఎం వివరాలు పెండింగ్** : రోజువారీ మధ్యాహ్న భోజన వివరాల నమోదులో చీరాల అర్బన్ మండలం వెనుకబడిందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలోనూ సాకులు చెప్పడం మానేసి పనిలో పురోగతి చూపించాలని సంబంధిత ఎంఈఓకు స్పష్టం చేశారు.

**వెల్ఫేర్ అసిస్టెంట్ల తనిఖీల్లోనూ నిరక్ష్యం:** :చిన్నగంజాం మండలంలో వెల్ఫేర్ అసిస్టెంట్ల వారాంతపు తనిఖీలు కేవలం 34 శాతానికే పరిమితం కావడం, పీవీ పాలెం మండలంలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ 49 శాతం మాత్రమే ఉండడాన్ని కారణమేమిటని ప్రశ్నించారు. ప్రతి వారం లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

**పనితీరు మెరుగుపరచకపోతే చర్యలు:** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల అమలులో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని, నిరక్ష్యానికి ఎలాంటి అవకాశం ఉండదని హెచ్చరించారు. పనితీరు మెరుగుపరచని అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**సచివాలయ సేవలు మెరుగుపడాలి:** స్వర్ణగ్రామ-స్వర్ణవార్డు సచివాలయాల ద్వారా బాపట్ల మండలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. అదే సమయంలో సేవల నాణ్యతను మరింత పెంచాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేస్తున్న బీఎల్ఓలకు అదనపు బాధ్యతలు అప్పగించవద్దని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణగ్రామ-స్వర్ణవార్డు సచివాలయాల అధికారి రాజేష్, జిల్లా కోఆర్డినేటర్ పి. యశ్వంత్‌తో పాటు వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

## అర్జీదారులు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరం చేయాలి

బాపట్ల, జులై 6, ప్రభాతవార్త, ప్రతినిధి: పిజిఆర్ఎస్ లో అర్జీదారులు అందజేసే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. ఇంధన వనరులను పొదుపు చేయాలని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ ఎలక్ట్రిక్ బైక్ పై కలెక్టరేట్ కు చేరుకున్నారు. అధికారిక వాహనాన్ని విడిచిపెట్టి సాధారణ పౌరుడు మాదిరిగా పర్యావరణానికి ఎలాంటి హాని లేని ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంపై కలెక్టర్ హెల్మెట్ ధరించి కలెక్టరేట్ కు వచ్చారు. స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కు 162 మంది అర్జీదారులు తమ



సమస్యలు విన్నవించుకు నేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాల ద్వారా కలెక్టర్ కు విన్నవించారు. తన పరిధిలో ఉన్న వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిశీలించి పరిష్కరం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు తీరకముందే పీజీఆర్ఎస్ లో నమోదైన అర్జీలను పరిష్కరించాలన్నారు. ఆన్ లైన్ లో నమోదైన అర్జీలను ఐదు రోజులు, వారం రోజులుగా చూడకపోవడంపై ఆయా శాఖల అధికారులను ఆరా తీశారు. కొన్ని శాఖల అధికారుల వద్ద అర్జీలు పెండింగ్ లో ఉండడంపై ప్రశ్నించారు. గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మార్గ నిర్దేశం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో సానుకూలంగా ప్రజల స్పందించే స్థాయిలో అధికారుల పనితీరు ఉండాలన్నారు. సర్ నిర్వహణ లో బి యల్ ఓ లు క్రమశిక్షణతో పని చేయాలన్నారు, సర్ నిర్వహణ వేగవంతంగా చేయాలని బి యల్ ఓ లను ఆదేశించారు. సర్ నిర్వహణ పై మండలాల వారిగా సమీక్ష నిర్వహించారు. ఈనెల 10న రేపల్లెలో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో అన్ని విభాగాలలో మెరుగుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డి ఆర్ ఓ జి. గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా అన్ని మండలాల అన్ని శాఖల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జూనోటిక్ వ్యాధుల దినోత్సవం


బాపట్ల, జులై6, ప్రభాతవార్త, ప్రతినిధి: జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌పేర్కొన్నారు. సోమవారం పి జి ఆర్ ఎస్ హాల్ నందు ప్రపంచ జూనోటిక్ వ్యాధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ, సంయుక్తంగా ప్రపంచ జూనోటిక్ వ్యాధుల దినోత్సవం బ్యానర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా




జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అని పేర్కొంటూ, ప్రజలు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు పాటించాలని సూచించారు. వన్‌హెల్త్ భావన ప్రకారం మనుషుల ఆరోగ్యం, జంతువుల ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయన్నారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, డి ఆర్ ఓ. జి. గంగాధర్ గౌడ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్యాకు లింకేజి పథకాలను ప్రతి లబ్దిదారునికి అందే విధంగా చర్యలు

బాపట్ల, జులై6, ప్రభాతవార్త, ప్రతినిధి: బ్యాంకు లింకేజీ పథకాలను ప్రతి లబ్దిదారునికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ వీక్ష సమావేశం మందిరంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మాట్లాడుతూప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు



అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు శ్రీనిధి, ఉన్నతి వంటి పథకాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు.. బ్యాంకుల ద్వారా ప్రభుత్వ పథకాల రుణాలను ప్రతి లబ్దిదారునికి చేరువ చేయాలన్నారు. బ్యాంకు లింకేజీ లోని శ్రీనిధి, ఉన్నతి పథకాలకు సంబంధించి మండల వారిగా నివేదిక ఆధారంగా ఆయన సంబంధిత అధికారులను ఆరా తీశారు. లబ్దిదారులకు పథకాల చేరువలో వెనుకబడిన మండల ఏపీఎంలను వ్యక్తిగతంగా సమావేశాలకు హాజరుకావాలనిఆదేశించారు. లబ్దిదారులకు బ్యాంకు రుణాలు అందజేయటలో ఏమైనా ఇబ్బందులు ఉన్న ఎడల సంబంధిత మండల ఎంపీడీవోలు, ఏపీఎంలు బ్యాంకు అధికారులను సంప్రదించి లబ్దిదారులకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి సింగయ్య, వీక్షణ సమావేశం ద్వారా అన్ని మండల ఎంపీడీవోలు, ఏపీఎంలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు, జూలై 6, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు సూచించారు. జీడీసి ఎమ్మెస్ ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు



మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరవేయాలనే లక్ష్యంతో ఈ ఉచిత మెగా వైద్య శిబిరాలను జీడీసిఎమ్మెస్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు కూడా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలక నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో జీడీసిఎమ్మెస్ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు, వృద్ధులు, మహిళలు, యువతతోపాటు గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకొని అవసరమైన వైద్య సూచనలు అందించారు. అదేవిధంగా అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ సామాజిక శక్తిగా రాణించిన జగ్జీవన్ రామ్

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:భారత దేశంలో రాజకీయ సామాజిక శక్తిగా జగ్జీవన్ రామ్ రాణించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీనివాసరావు



మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయ వేత్తగా భారత పార్లమెంటులో 40 సంవత్సరాలు మంత్రి పదవులు నిర్వహించి ఉప ప్రధానిగా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ స్థాపనలో జగ్జీవన్ రామ్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. వైకాపా నాయకులు బేతపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జగజ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:స్వాతంత్ర సమరయోధులు, దళిత తొలి ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ సంఘసంస్కర్తగా అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ అన్నారు. సోమవారం జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 18వ వార్డు అరుంధతి నగర్, ఆర్అండ్‌బి అతిథి గృహం ఎదుట ఉన్న జగజ్జీవన్ రామ్ విగ్రహాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, రాష్ట్ర జాయింట్



సెక్రటరీ చిమటా బాలాజీ, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, వార్డుల ఇన్‌ఛార్జిలు డి. రాంబాబు, ఖాదర్ బాషా, గౌస్ బాషా, కుద్దూస్, ప్రదీప్, నీలా కోటేశ్వరరావు, రమేష్, సైకం ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభం

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:రేపల్లె నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారములను పంపిణీ చేస్తున్నారు. ఓటర్ల నుండి పూర్తి చేసిన ఫారాలను స్వీకరించి ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు రేపల్లె రూరల్ మండలంలో 48 వేల 900 ఓటర్లు ఉంటే 32 వేల 549 ఓటర్లకు సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. రేపల్లె పట్టణంలో 37 వేల 58 ఓటర్లు ఉంటే 20 వేల 733 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తియింది. నిజాంపట్నం మండలంలో 50 వేల 415 మంది ఓటర్లలో 28 వేల 890 ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. నగరం మండలంలో 42 వేల 568 మంది ఓటర్లు ఉండగా 25 వేల 787 మంది ఓటర్ల డిజటలైజేషన్, చెరుకుపల్లి మండలంలో 49 వేల 220 ఓటర్లు ఉంటే 29 వేల 309 ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సరిచూసుకుని పూర్తిచేసి బిఎల్‌వోలకు అందజేయాలని ఎటువంటి పొరపాట్లకు తావివ్వని విధంగా ఓటర్ల జాబితా తయారీకి ప్రజలు సహకరించాలని ఎన్నికల అధికారి, రేపల్లె ఆర్డీవో బి. శ్రీదేవి కోరారు. పూర్తి వివరాలకు హెల్ప్ డెస్క్ నంబర్లు 8125585255, 9494185053, బూత్ లెవల్ అధికారుల ఫోన్ నెంబర్లు 9346410186(రేపల్లె మున్సిపాలిటీ), 8328281083 నిజాంపట్నం), 9398666831 (నగరం), 8309104829(చెరుకుపల్లి), 8019498070(రేపల్లె ఆర్డీవో కార్యాలయం) ద్వారా సమాచారం తెలుసుకోవాలని ఆమె సూచించారు.

## సమస్యల పరిష్కారానికి 15 అర్జీలు

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ 15 మంది అర్జీలు అందజేశారు. రేపల్లె, నగరం, భట్టి ప్రోలు, నిజాంపట్నం మండలాల్లోని ప్రజలు అర్జీలను సమర్పించారు. అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని రేపల్లె డివిజనల్ పరిపాలన అధికారి తెలిపారు.

## సకాలంలో సర్ ప్రక్రియను పూర్తిచేయాలి-కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను క్రమశిణతో పూర్తి చేయాల్సిన బాధ్యత బిఎల్‌వోలపై ఉందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ స్పష్టం



చేశారు. సోమవారం రాత్రి భట్టి ప్రోలు మండలంలోని రాచూరులో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న బిఎల్‌వో పనితీరును స్వయంగా పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారం ఇంటికి వచ్చి ఇచ్చినదీలేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఫారాన్ని ఏ విధంగా నింపాలో పూర్తి వివరాలు తెలియజేశారా, అవసరమైన పత్రాల గురించి వివరించారా అని ఓటర్లను కలెక్టర్ ప్రశ్నించారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సర్ ప్రక్రియను పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని బిఎల్‌వోను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బిఎల్‌వోకు అదనంగా సహాయకులను ఏర్పాటు చేసినందున నిరంతరం పర్యవేక్షణ బాధ్యత సూపర్‌వైజర్‌దేనని చెప్పారు. రాచూరు గ్రామానికి కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ వచ్చిన సందర్భంగా ప్రజలు రహదారి సమస్య గురించి తెలిపారు. బాపట్ల డిఆర్‌వో గంగాధర్ గౌడ్, రేపల్లె ఆర్డీవో బి. శ్రీదేవి, భట్టిప్రోలు తహశీల్దార్ నాగరాజు, ఆర్ఐ, సూపర్‌వైజర్, బిఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రూ.75 వేల నగదు బహుమతి

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:ఆప్తమిత్ర సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు రూ.75 వేలు నగదు బహుమతిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అందజేశారు. రేపల్లె మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులకు రూ.10 వేలు వంతున, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన 11 మందికి రూ.5 వేలు వంతున



నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, ఉపాధ్యాయులు, ఆప్తమిత్ర సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

రేపల్లె, జూలై 6, ప్రభాతవార్త:అపరిష్కృతంగా నిలిచిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు రేపల్లె ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. బాపట్ల జిల్లా ఏఐటియుసి అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, ఏఐటియుసి బాపట్ల జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు పడమటి బిక్షాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

బాపట్ల, జులై6, ప్రభాతవార్త, ప్రతినిధి: పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీనిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి, వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. తక్షణం సంబంధిత పోలీస్



అధికారులకు ఫోన్ చేసి, చట్టపరిదిలో విచారించి, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు మరలా మరలా పునరావృతం కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో నిరక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ బాధితులకు అండగా ఉంటుందనే భరోసానుఅర్జీదారులకు కల్పించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు భూవివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, ఇతర పలు సమస్యలపై మొత్తం 64 అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి. జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కర్లపాలెం మండలంలో 59శాతం ఎస్. ఐ.ఆర్.పూర్తి.

కర్లపాలెం, జులై6, ప్రభాతవార్త: కర్లపాలెం మండలంలో ఇప్పటివరకు 59ఎస్ఐఆర్ పూర్తయిందని కర్లపాలెం తహసిల్దార్ రవీంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్ఐఆర్



జరుగుతున్న ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగా ప్రతి ఒక్కరిది సర్వే పూర్తి చేయాలన్నారు, ఎట్టి పరిస్థితుల్లో ఎవ్వరి ఓటుకు కోల్పోకూడదు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు .ప్రభుత్వం విధించిన నిబంధనల అనుగుణంగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు, .మండల పరిధిలోని తుమ్మలపల్లి, పేరలి గణపవరం కర్లపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే జరుగుతున్న విధానం సర్వే పై ప్రజలకు ఉన్న పలు అపోహలను ఈ సందర్భంగా ఆయన నివృత్తి చేశారు అనంతరం సర్వే పత్రాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు వీఆర్వో యశ్వంతి తదితరులు పాల్గొన్నారు

## నేషనల్ స్థాయిలో సైక్లింగ్‌లో పాల్గొన్న భావానిశంకర్‌రెడ్డికి ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే

కర్లపాలెం, జులై6, ప్రభాతవార్త, రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడలిస్ట్ మరియు నేషనల్ స్థాయిలో సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న కుంచాల భవాని శంకర్ రెడ్డి కి 50000 ఆర్థిక సాయం చేసిన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, పాత నందాయపాలెంకి సంబందించిన కుంచాల భవాని శంకర్ రెడ్డికీ సైకిల్ కొనుగోలు కి యాభై వేలు ఆర్థిక సాయం చేసిన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ,ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు షేక్ బాజీ, క్లస్టర్ ఇంచార్జ్ నక్కల వెంకటస్వామి, నాయకులు మద్దాల ముసలయ్య, పిట్ల వసంత రెడ్డి, పిట్ల వేణుగోపాల్ రెడ్డి, మాడ శ్రీనివాస రావు, చీరాల శ్రీనివాస రెడ్డి, యేట్ర రెడంకా రెడ్డి, కుంచాల వెంకట శివ నాగిరెడ్డి, ఆట్ల బాల శంకర్ రెడ్డి,



మద్దిబోయిన బుల్లియ్య, మహిళా మండలి సభ్యులు పల్లం సరోజినీ, కూచిపూడి ఝాన్సీ, బోద్దుకురి విజయ్య, కట్టా సుజాత, పిట్ల ఉర్లమ్మ, గ్రామ పెద్దలు రావి శివ రెడ్డి, మారుప్రోలు గోపి రెడ్డి, రావి గోవిందా రెడ్డి, రావి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బాపట్లకు అమృత్ జలాలు

### రూ.23.38 కోట్లతో తాగునీటి పనులకు శంకుస్థాపన

బాపట్ల, జులై6, ప్రభాతవార్త, ప్రతినిధి: బాపట్ల పట్టణ ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో అమలవుతున్న అమృత్ 2.0 పథకం కింద పట్టణానికి మంజూరైన రూ. 23.38 కోట్ల విలువైన తాగునీటి ఆధునీకరణ పనులకు సోమవారం ఉదయం ఘనంగా శంకుస్థాపన జరిగింది. బాపట్ల బైపాస్ రోడ్డులోని ప్యాడిసిన్ పేట ఎన్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల



పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ ముఖ్య అతిథులుగా హాజరై, వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూబాపట్ల పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. అమృత్ 2.0 ప్రాజెక్టు ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మెరుగైన ఒత్తిడి తో, నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటి పంపిణీ వ్యవస్థను మరింత ఆధునీకరించడంతో పాటు, నిర్వహణ లోపాలను సరిదిద్దేలా పనులు చేపడుతున్నట్లు పురపాలక అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ పనులు పూర్తయితే భవిష్యత్తులో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండవని, సమర్థవంతమైన పంపిణీ వ్యవస్థ నగర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

**నేతల కోలాహలం:** ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం. హాసిని, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మందపాటి అంద్రెయ, పలువురు ప్రజాప్రతినిధులు, పురపాలక, ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడిగా కారుమూరి శ్రీనివాస్

పొన్నూరు, జూలై 6, ప్రభాతవార్త: స్థానిక రోటరీక్లబ్‌లో రోటరీక్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కారుమూరి శ్రీనివాస్, కార్యదర్శిగా జానీబేగ్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యదర్శి జానీబేగ్‌లను రోటరీక్లబ్ సభ్యులు దుశ్శాలువాలతో, మెమెంటోలతో, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాజీ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గుప్తా, యాసం వీరయ్య, మాజీ అధ్యక్షుడు బందారుపల్లి



శ్రీనివాసరావు, అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, చిలకలూరిపేట టిడిపి మైనార్టీ నాయకులు సయ్యద్ మహబ్, మైనార్టీ నాయకుడు అబ్దుల్ ఖదీర్, గౌస్ తదితరులున్నారు.


## అణగారిన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన నాయకుడు జగజ్జీవన్‌రామ్

పొన్నూరు, జూలై 6, ప్రభాతవార్త: సమాజంలోని అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన కృషీవలుడు, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు భారత మాజీ ఉపప్రధాని



డాక్టర్ బాబూజగజ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఉపప్రధానిగా, నిరంతర పార్లమెంట్ సభ్యులుగా అనేక సేవలందించిన ఘనత జగజ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. జగజ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత రేపల్లె బస్టాండ్‌లోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి కారుమూరి అంకమ్మరావు, మాజీ సర్పంచి సుధాకర్, నాయకులు డక్కుమళ్ళ రవి, చింతలపూడి మురళీకృష్ణ, గేరా సంజీవ్, షేక్ మౌలాలి, సొపాటి శ్రీధర్, బొల్లెద్దు డేవిడ్, మరియరాణి, నవకుమార్, దాసరి శ్రీను, ఆరెమండ కామేశ్వరరావు, మొద్దు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రహీంసాహెబ్‌కు ఘన సన్మానం



పొన్నూరు, జూలై 6, ప్రభాతవార్త: విశ్వ సాహితీ కళావేదిక జాతీయ సాహిత్య సాంస్కృతిక సమాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో పొన్నూరుకు చెందిన ఆర్టీసి కండక్టర్ షేక్ రహీంసాహెబ్‌ను ఘనంగ సత్కరించారు. రహీంసాహెబ్ రచించి ఆలపించిన కవులు...కళాకారులకు....అనే కవితాగానం చేసి సభికులను అలకరించారు. ఈ కవి సమ్మేళనంలో తాను సత్కారాన్ని పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పినాకిని సాహిఇ వాహిని అధ్యక్షుడు నన్నం బ్రహ్మయ్య, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి తదితరులు రహీంసాహెబ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా రహీంసాహెబ్‌కు డిపో మేనేజర్ గురవారెడ్డి, తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఎమ్మెల్యే 'కన్నా' ఘననివాళి



సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత తొలి ఉపప్రధాని, సమసమాజ స్థాపనకై కృషి చేసిన కృషివలుడు డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నేతలు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## 2,43,013..మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫామ్‌లు పంపిణీ : ఆర్డీఓ

సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 98సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో మ్యాపింగ్ ఎన్యూమరేషన్ జరుగుతుండగా నియోజకవర్గ పరిధిలో 2,43,048 మంది ఓటర్లు గా నమోదు కాబడియుండగా.. 2,43,013..మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫామ్ లు పంపిణీ చేయబడి ..1,60,232 మంది ఓటర్ల వివరములు డిజిటలైజేషన్ చేయబడినట్టు ఓటర్ల నమోదు అధికారి, సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## సత్తెనపల్లిలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 41వ వర్ధంతి వేడుకలు

సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ దళిత నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సత్తెనపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో,మరియు అమరావతి బస్టాండ్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో



విశిష్టమైన నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, పల్నాడు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, ముప్పాళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట ఆనంద్, సేవాదళ్ నాయకుడు సిద్దెల మోహన్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షేక్ చాంద్ భాషాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'స్త్రీశక్తి' ఏడాది పూర్తయిన సందర్భంగా ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన 'కన్నా'

సత్తెనపల్లి, జూలై 6, ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన టువంటి స్త్రీ శక్తి పథకం సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా మరియు స్వచ్ఛ సత్తెనపల్లి లో భాగంగా బస్ డిపో నందు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసన సభ్యులు



కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంకెన్నాళ్లు సమస్యకు ముసుగేస్తారు

నాదెండ్ల (చిలకలూరిపేట) , జూలై 6, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం కనపర్రు పశువైద్యశాల సమీపంలోని ప్రధాన రహదారి పక్కన రోటరీ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన



చేతి పంపు గత నాలుగేళ్లుగా పనిచేయడం లేదు. స్థానికుల విన్నపంతో అధికారులు రెండేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు. అయితే బోరింగ్ పైపులు మాత్రం బిగించి హెడ్, హ్యాండ్ రాడ్ ఏర్పాటు చేయకుండా అలాగే వదిలివేశారు. గోనె సంచితో ముసుగేసి నిర్లక్ష్యం వహించారు. దీనిపై పంచాయతీ అధికారులకు గ్రామస్తులు పలుమార్లు మొర్ర పెట్టుకున్నా.. వారు ఆలకించడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించి , తమ నీటి ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసిన ఫైర్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి



చిలకలూరిపేట, జూలై 6, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గా నియమితులు అయిన అన్వేష్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాజీ మంత్రివర్యులు, చిలకలూరిపేట నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు, ఈ సందర్భంగా అన్వేష్ కుమార్ రెడ్డిని పుల్లారావు అభినందించారు..

## ఓటర్ సమగ్ర వివరాల నమోదు కార్యక్రమం

చిలకలూరిపేట, జూలై 6, ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఓటర్ వివరాల నమోదు కార్యక్రమంలో భాగంగా మాజీమంత్రివర్యులు స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఓటర్ కు తమ ఓటు కోల్పోకుండా ఎన్నికల సంఘం బి ఎల్ ఓ ల ద్వారా పంపిణీ చేసిన ఓటర్ ఫారాలు వివరాలు నమోదు చేసే ప్రక్రియను 18వ వార్డు పరిధిలోని సచివాలయం వద్ద18వ వార్డు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టినారు... ఈ కార్యక్రమంలో 18వ వార్డు పార్టీ అధ్యక్షులు ఆరెకట్ల కోటేశ్వరావు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎస్ సుభాని, సెక్రటరీ ఫర్హాన్ కరిముల్లా, పార్టీ ముఖ్య నాయకులు మేకతోటి సాంబశివరావు, షేక్ మౌలాలి, కొండా శ్రీను, మద్ది బోయిన శేఖర్, తాళ్లూరు సాంబయ్య, తంగెళ్ల రామ్మోహన్, గంతా నాగు, సయ్యద్ హుస్సేన్, షేక్ ఖాదర్ వలి, చిరంజీవి పాల్గొన్నారు

## వైభవంగా డా॥ కె.నరసింహమూర్తి స్మారక సన్మానోత్సవం

మాచర్ల, జూలై 6 (ప్రభాతవార్త): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక వైభవ్ రెసిడెన్సీ అండ్ ఫంక్షన్ హాలులో మాచర్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ కె నరసింహమూర్తి స్మారక సన్మానోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో 25 సంవత్సరాలుగా వైద్యసేవలందిస్తూ పల్నాడు ప్రాంతంలో విశేష కృషి చేస్తూ, ప్రాణదాతలుగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్లు మోహనరావు, మురహరిరావు, కొండవీటి రామకోటయ్య, కమలాసనరావు, రామచంద్రారెడ్డి, మురళీకృష్ణ, ఉషారాణి, రాజశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, హరికృష్ణ, రమణమూర్తి, డీవీఎల్ నరసింహారావు, కల్పన, జయప్రకాష్, విజయకుమారిలను డాక్టర్ నరసింహమూర్తి కుటుంబం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు నరసింహమూర్తితో కలిసి పనిచేసిన అనుభవాలను, సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువేనని, డబ్బులు కంటే కూడా ప్రజల అవసరాలను, వారి ఆరోగ్యాల గురించి మాత్రమే పరితపించేవారని కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు పఠాన్ నాగూర్‌వలి మాట్లాడుతూ వైద్యం అనేది కేవలం ఒక వృత్తి కాదని, అది మానవత్వంతో ముడిపడిన ప్రాణం పోసే వరంగా చూస్తూ, కేవలం భరోసాతోనే సగం రోగాన్ని నయం చేస్తుందని తెలిపారు. రోటరీ ప్రతినిధి, ప్రోగ్రాం కన్వీనర్ మాదిరెడ్డి లక్ష్మీనారాయణ,



సీనియర్ డాక్టర్లు రోటరీ కార్యదర్శి మూఢావత్ దశరథ్ చౌహాన్, ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు పాల్గొన్నారు. తిర్లిక శ్రీనివాసరావు, ఇప్పుడు శంకర్, ట్రెజరర్ విజయకుమార్ ఈ కార్యక్రమాన్ని ఆసక్తికరంగా నడిపించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ సూపరింటెండెంట్ కేవీ రావు, పట్టణంలో ప్రముఖ ప్రైవేటు, గవర్నమెంటు వైద్యులు పాల్గొని డాక్టర్ నరసింహమూర్తి సేవలను స్మరించుకున్నారు.

## డాక్టరేట్ అందుకున్న ఉమామహేశ్వర శర్మ

పెదకూరపాడు జులై6(ప్రభాతవార్త): శ్రీ జ్ఞాన సరస్వతి విద్యాపీఠం అధినేత, ప్రముఖ జ్యోతిష్యులు పెదకూరపాడు గ్రామానికి చెందిన నుదురుపాటి ఉమామహేశ్వర శర్మ ( ఉమా స్వామి ) యునైటెడ్



అమెరికన్ యూనివర్సిటీ లో జ్యోతిష్య విభాగంలో ప్రతిభ చాటినందుకుగాను గౌరవ డాక్టరేట్ ను ఢిల్లీలో జరిగిన సెమినార్ లో అందుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు నుదురుపాటి హనుమంతరావు శర్మ కుమారుడు ఉమామహేశ్వరావు శర్మ కు ఘనత సాధించడం గర్వకారణం అని పలువురు రాజకీయ నాయకులు, విద్యావేత్తలు ఉమామహేశ్వర శర్మను అభినందించారు.

## మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా లక్ష్మీకాంతమ్మ

నిజాంపట్నం, జూలై 6, ప్రభాతవార్త: స్థానిక మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా టి లక్ష్మీకాంతమ్మ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఆమె ప్రమోషన్ పొంది ఎఓగా బాధ్యతలు లక్ష్మీకాంతమ్మను ఎంపిడిఒ నాగలక్ష్మి అభినందించారు.



## ఆలివ్ ఫిజియోథెరపీ హాస్పిటల్ ప్రారంభించిన డిఎస్పి జనార్ధనరావు

తెనాలి మున్సిపాలిటీ జులై6(ప్రభాతవార్త): తెనాలి పట్టణంలోని చెంచుపేట లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలివ్ ఫిజియోథెరపీ హాస్పిటల్ ను తెనాలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బి.జనార్ధన రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ తెనాలి పట్టణంలో



మారుతున్న కాలానికి అనుగుణంగా తమ వంతు సేవలు అందించేందుకు ఆలివ్ ఫిజియోథెరపీ హాస్పిటల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో ప్రత్యేకంగా పక్షవాతం, నడుము నొప్పి,మోకాళ్ళ నొప్పులకు వయసు రీత్యా వచ్చే సమస్యలకు ప్రత్యేక చికిత్స అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథి డిఎస్పి బి. జనార్ధన రావు మాట్లాడుతూ, తెనాలి ప్రాంతంలో ఆలీవ్ ఫిజియోథెరపీ హాస్పిటల్ ద్వారా తెనాలి ప్రాంతంలో వైద్య సేవలు ప్రారంభించడం సంతోషకరమని, పట్టణం మరియు పరిసర ప్రాంతాల వారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డాక్టర్ ఎన్ విజయ నాగరాజు మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో ఫిజియోథెరపీ హాస్పిటల్ ఉన్నప్పటికీ అత్యాధునిక సదుపాయాలతో ఆలివ్ ఫిజియోథెరపీ హాస్పిటల్ ప్రారంభించడం జరిగిందని ఈ వైద్యశాలలో అందరికీ అందుబాటులో వైద్య సేవలు అందించటం జరుగుతుందని పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు.

## బైండోవర్ అతిక్రమించినందుకు, నోటీసులు జారీచేసిన తహసీల్దార్ గోపాలకృష్ణ:

తెనాలి జులై6(ప్రభాతవార్త): తెనాలి పట్టణం సుల్తానాబాద్ నకు చెంది పలు కేసులతో సంబంధం కలిగిన సబావత్ అనిల్ అనే రౌడి షీట్ కలిగిన వ్యక్తిని,గతములో 2025 ఆగస్ట్ 22న తెనాలి మండల తహసీల్దార్ మరియు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కేవీ. గోపాలకృష్ణ వారి ముందు సత్ప్రవర్తన కొరకు బైండ్ ఓవర్ చేయగా,మరల అతను సంవత్సరం గడవక ముందే మరోక కేసు లో ఇన్వాల్వ్ అవడం వలన తెనాలి 3 టౌన్ పోలీస్ వారు సోమవారం తహసీల్దార్ మరియు



ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్ ముందు బైండ్ ఓవర్ చేయగా, అతనికి నోటీస్ ఇచ్చి బైండ్ ఓవర్ అతిక్రమించినందుకు వారం రోజులలో సంజాయిషీ ఇవ్వవలసినదిగానూ లేదా ఫైన్ అమోంట్ కట్టడం గానీ చేయవలసినదిగా ఆదేశించారు.

## డిజిటల్ చెల్లింపుల నిరాకరణపై ఆర్డిఓ కి ఫిర్యాదు

తెనాలి జులై6(ప్రభాతవార్త): తెనాలి పట్టణంలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు మరియు సినిమా హాళ్లలో డిజిటల్ చెల్లింపు (యూపీఐ, డెబిట్ /క్రెడిట్ కార్డు మొదలైనవి) సౌకర్యాలను నిరాకరిస్తూ నగదు మాత్రమే చెల్లించాలని ప్రజలను బలవంతపరుస్తున్న విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ కి ఫిర్యాదు చేశారు. తెనాలి పట్టణంలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు మరియు సినిమా హాళ్లలో డిజిటల్ చెల్లింపు సౌకర్యాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించనివ్వకుండా, లేదా అసలు ఆ సౌకర్యాలు కల్పించకుండా, నగదు (క్యాష్) మాత్రమే చెల్లించాలని వినియోగదారులను బలవంతపరుస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ విధానం వల్ల ప్రజలు, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు మరియు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రభుత్వం విస్తృతంగా ప్రోత్సహిస్తున్న ఈ సమయంలో, ఇలాంటి చర్యలు



ప్రజలకు అసౌకర్యం కలిగించడమే కాకుండా పారదర్శకతపై కూడా సందేహాలు కలిగిస్తున్నాయి.

వినియోగదారులకు అందుబాటులో ఉన్న చెల్లింపు విధానాలను అనవసరంగా నిరాకరించడం సేవల నాణ్యతను దెబ్బతీసే చర్యగా పరిగణించవచ్చు. అందువల్ల సంబంధిత అధికారుల ద్వారా తనిఖీలు నిర్వహించి, డిజిటల్ చెల్లింపు సౌకర్యాలను తప్పనిసరిగా అమలు చేసేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నాను. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకుని, తగిన పరిష్కారం చూపవలసిందిగా ప్రార్థిస్తున్నాను.ఈ కార్యక్రమంలో కారుమంచి.సునీల్ సంధీప్ బొనిగలప్రదీన్,పెనుమాక మధు,మట్లపూడి.రాజేశ్వరరావు, పిల్లి.సతీష్, తెనాలి.ఆనంద్, కొప్పుల.అనీల్,తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడి శతజయంతి ఉత్సవాలు ప్రారంభం

తెనాలి మున్సిపాలిటీ జులై6(ప్రభాతవార్త): దివంగత ప్రముఖ సినీ నటులు డాక్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావు శతజయంతి వేడుకలను పురస్కరించుకొని జూలై 9వ తేదీన తెనాలి పట్టణంలోని శ్రీ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శతజయంతి వేడుకలు ప్రారంభ సభను నిర్వహించనున్నట్లు శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని గౌతమ్ గ్రాండ్ హోటల్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన గుమ్మడి శతజయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ ఆర్ట్స్ గుడివాడ వారు ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ద్వారబంధాల చంద్రయ్య నాయుడు సాంఘిక నాటిక ప్రదర్శనతో సభ ప్రారంభమవుతుందని, అనంతరం



శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని,ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్,మాజీ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు,ప్రముఖ సినీ నటులు మాగంటి మురళి మోహన్ అదేవిధంగా రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి మరియు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి విశిష్ట అతిధులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథులుగా వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అలాగే తెనాలికి చెందిన ప్రముఖ సినీనటి దేవభక్తుని ప్రభా రమేష్ పాల్గొంటారని, అతిథులుగా నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు,సినీ పాత్రికేయులు డాక్టర్ రెంటాల జయదేవ్ పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా అజోవిభో కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు డాక్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావు విశిష్ట కళా పురస్కారం అందజేయబడుతుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో కళాకారులు,డాక్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావు అభిమానులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్విఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్,ప్రముఖ నాయకులు జొన్నాదుల మహేష్,ఎం.డి ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్

తెనాలి జులై6(ప్రభాతవార్త): ప్రతీ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ప్రధానంగా రెవెన్యూ సెక్షన్ కు సంబంధించి, గంగానమ్మపేటకు చెందిన,రావూరి బాబు,పెన్షన్ పెంపుదలకు చేయు వినతి. అలాగే మద్దుల భాస్కర రావు కు



సంబంధించి,పెన్షన్ ఇప్పించమని కోరుట గురించి, అదే విధంగా షేక్ షాహీన తన పెన్షన్ ఇప్పించమని కోరుట గురించి అర్జీలు అందుకోవటం జరిగిందని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి:

తెనాలి జులై6(ప్రభాతవార్త): ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఇందులో ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మాట్లాడుతూ సైబర్ నేరాలు గురించి పొదుపు సంఘాల మహిళలకు అవగాహనను కల్పించారు సదస్సులో మాట్లాడుతూ మనమంతా రోజూ పొదుపు చేసి, కష్టపడి డబ్బు కూడబెడు తున్నాం కదా. ఆ డబ్బు ఫోన్ పే , జీ పే , యూపీఐ లో పెట్టుకుంటున్నాం. కానీ ఈ మధ్య ఫోన్ ద్వారానే డబ్బులు కొట్టేసే కొత్త దొంగలు వచ్చారు. కత్తి పట్టుకోరు, కానీ మాటలతో మోసం చేస్తారు. వాళ్ల దగ్గర నుంచి జాగ్రత్త పడదాం. మన డ్వాక్రా డబ్బు అంటే మన పిల్లల చదువు, ఇంటి ఖర్చు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే"అనుమానం వస్తే ఆపు, ఆలోచించు, అడిగి తెలుసుకో" నిజమైన లాభం ఫోన్ లో రాదు. కష్టపడి సంపాదించిన రూపాయి రూపాయే. అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జై శ్రీ, ఎస్ జాగర్లమూడి మెడికల్ ఆఫీసర్ డా.హనీఫ్ ,సిసి యుగంధర్, మరియు డ్వాక్రా పొదుపు సంఘాల ప్రెసిడెంట్ పాల్గొనడం జరిగింది.

## మా ఊరికి రోడ్డు వేయించండి ఎమ్మెల్యే సారు

పెదకూరపాడు జులై6(ప్రభాతవార్త): మండలం 75 త్యాళ్లూరు నుంచి తమ్మవరం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రతీ రోజు స్కూల్ కి వెళ్ళడానికి ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. నాయకులు మారుతున్నా.. తమ గ్రామాలకు రోడ్లు వేయడం లేదని వాపోయారు. గతుకుల రోడ్లో ఉదయం సాయంకాలం స్కూలుకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని వారన్నారు. స్కూల్ విద్యార్థులంతా కలిసి గుంతలు ఉన్న రోడ్డు వద్ద నిరసన చేస్తూ మా ఊరికి రోడ్డు వేయించండి ఎమ్మెల్యే సారు, సీఎం సారు మా గ్రామాలపై దృష్టి చూడండి అంటూ వేడుకున్నారు. సోషల్ మీడియాలో చిన్నారుల గుంతల వద్ద తమ రోడ్డు సమస్య మాట్లాడుతూ తీసిన ఈ వీడియో వైరల్ కావడంతో పెదకూరపాడు ఎంపీడీవో సాయి లీల స్పందించారు. జీవో నెంబర్ 64 ప్రకారం రోడ్డు నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదన



పంపామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో టెండర్ల ప్రక్రియ జరుగుతుంది అని అన్నారు. ప్రతిపాదన పంపించామని అతి త్వరలో రోడ్డు నిర్మాణాలు చేపడతామని అందుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తగు సన్నాహాలు చేస్తున్నారన్నారు అన్నారు

## చర్లగుడిపాడులో కార్డెన్ సెర్చ్



గురజాల, జూలై 6 ప్రభాతవార్త : మండలంలోని చర్లగుడిపాడులో సోమవారం పోలీసు అధికారులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ వినోద్‌తోపాటు 50 మంది సిబ్బంది పాల్గొన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 20 మోటారు సైకిళ్లు, 7 కొడవళ్లు, 5 గొడ్డళ్లను, 3 గుణపాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే తమకు సమాచారం అందించాలన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

## శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షునిగా గోవర్ధన్

గురజాల, జూలై 6 ప్రభాతవార్త : ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా



పరమేశ్వరి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ఆలయ నూతన అధ్యక్షుని ఎన్నిక జరిగింది. పట్టణానికి చెందిన కట్టమూడి గోవర్ధన్‌ను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు మూర్తి శ్రీనివాసరావు ఈ బాధ్యతలు నిర్వహించారు. తన నియామానికి కృషి చేసిన ఆర్యవైశ్య పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ, కళ్యాణ మండపం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## సర్...పై బీఎల్‌ఓల నిర్లక్ష్యం!..

### సతమతమవుతున్న అధికారులు: పర్యవేక్షిస్తున్న తహశీల్దారు

కారంపూడి, జులై 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ సర్వేపై బీఎల్‌ఓలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని చిన్నగార్లపాడు, చింతపల్లి, గాదెవారిపల్లె, కారంపూడి సచివాలయంలో సర్‌పై సమీక్ష నిర్వహించారు. 46896 మంది ఇప్పటికే ఓటర్లుగా నమోదు కావడంతో ఇప్పటికి 25200 మంది ఓటర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. ఇది 54 శాతం మాత్రమే అని పేర్కొన్నారు. ఓటుహక్కును అర్హులైన వారికి కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంతో మండలంలోని బీఎల్‌ఓలు బిజీబిజీగా ఉన్నారు. మరికొన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలో తమ పేరు లేదంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ఓటు వేస్తే ఇప్పుడు తమ ఓట్లు ఎక్కడికి పోయాయని




ఓటర్లు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 14 లోపు ఓటరు జాబితా పూర్తి చేసి 21వ తేదీలోపు ఎన్నికల కమిషన్‌కు అందించాలని స్పష్టమైన ఆదేశాలు ఉండటంతో అధికారుల హడావుడి ఎక్కువైంది. ఇప్పటికే తమ ఓట్లు పోయాయంటూ ఓటర్లు లబోదిబోమంటున్నారు. తహశీల్దారు మండలంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి బీఎల్‌ఓలకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

## నిర్లక్ష్యం వద్దు..నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి-తహశీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర,జూలై 6 ప్రభాతవార్త: సర్ ప్రక్రియలో బిఎల్‌ఓలు నిర్లక్ష్యం వహించకుండా..నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తహశీల్ధార్ సిద్ధార్థ స్పష్టం చేసారు.సోమవారం మండల పరిధిలోని చక్రాయపాలెం,దావులూరు,తూములూరు,కొల్లిపర గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను తహశీల్దార్ సిద్దార్థ,ఎంపీడీవో విజయలక్ష్మి తనిఖీ చేసి బిఎల్‌ఓలకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ సర్ ప్రక్రియ నమోదులో పొరపాట్లు లేకుండా చూచుకుంటూ అర్హులందరినీ నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవోలు భార్గవ్,దానయ్య తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీలు జాగత్తలు తీసుకోండి -మండల వైద్యాధికారి నేహ

కొల్లిపర,జూలై 6 ప్రభాతవార్త: మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి నేహ అన్నారు.సోమవారం మండల పరిధిలోని పిడపర్రులో వైద్యాధికారులు సంచార చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నేహ మాట్లాడుతూ గర్భిణీలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌సీ సుబాషిణి,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## క్షయవ్యాధి ముందుగా గుర్తిస్తే నయం చేసుకోవచ్చు -తెనాలి యూనిట్ క్షయవ్యాధి సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్

కొల్లిపర,జూలై 6 ప్రభాతవార్త: క్షయవ్యాధి ముందుగా గుర్తిస్తే మందుల ద్వారా నయం చేసుకోవచ్చు తెనాలి యూనిట్ క్షయవ్యాధి సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్ అన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో జీసెస్ సేవ్స్ చర్చి ఆవరణలో క్షయవ్యాధిపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించి



నిర్ధారణ కోసం హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే నిర్వహించి తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి ప్రాణాంతకరమైన వ్యాధి కాదన్నారు.మండల వైద్యాధికారి నేహ మాట్లాడుతూ క్షయవ్యాధి అనేది బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధని తగిన జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చన్నారు.అనంతరం క్షయవ్యాధిగ్రస్తులకు ఫ్యూచర్ పౌండేషన్ చైర్మన్ డాక్టర్ మేఘనారెడ్డి అందజేసిన పౌష్టికాహారాన్ని వైద్యాధికారులు పంపిణీ చేసారు.కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ ప్రభుదాసు,ఎంపీహెచ్ఎస్ ప్రసాదరావు,ఎఎన్ఎం వేముల లక్ష్మీ,వైద్య సిబ్బంది,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొనర్నారు.

## సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

వేమూరు జులై 6 (ప్రభాతవార్త ) : ఓటర్ సమగ్ర సర్వేను త్వరిత గతిన పూర్తి చేయాలని తహశీల్దార్ పార్వతి బిఎల్‌వోలకు సూచించారు. సోమవారం సర్వే కార్యక్రమాన్ని వేమూరులో పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బిఎల్ఓలు ఓట్ల సమగ్ర సరిపోయిన తృతీయతను పూర్తి చేసే విధంగా పని చేయాలన్నారు. ప్రతి ఓటరును కలిసి



ఒక సమాచారాన్ని అప్లోడ్ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశానుసారం జులై 15వ తేదిలోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు. బిఎల్ఓలు అలసత్వం వీడి సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఆమెతో పటు మండల సర్వే కార్యక్రమం సూపర్‌వైజర్ శ్రీజ, బిఎల్వోలు ఉన్నారు.

## ప్రసంగ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం

క్రోసూరు( జూలై 6 ప్రభాతవార్త ): శ్రీ అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ప్రసంగ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.రాష్ట్ర స్థాయి ప్రసంగ పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థిని, విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.ప్రథమ బహుమతి విద్యార్థిని లక్ష్మి వాసంతి కి గుడివాడ వారికి 20,000 రూపాయలు బహుమతి అందించారు.ద్వితీయ బహుమతి గెలిచిన విద్యార్థిని అశ్రిత కి 15,000 రూపాయలు బహుమతి ని .తృతీయ బహుమతి షేక్. పహామతా భూసం విద్యార్థినికి 10, 000 రూపాయలు బహుమతి అందజేశారు. కమిటీ నిర్వాహకులు డాక్టర్ కడిమెళ్ళ నరసరాజు, కంటు సాయి, మార్కాపురపు నాగేశ్వరరావు, షేక్. మస్తాన్ మరియు స్విమ్స్ స్కూల్ యాజమాన్యం గోవర్ధనరావు పద్మావతి , స్విమ్స్ స్కూల్ హెచ్ ఎం. షేక్. సిలార్ షా,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతోత్సవాలు

తెనాలి జులై6(ప్రభాతవార్త): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని, సోమవారం కొత్తపేట వివేకా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో తెనాలి రైల్వే స్టేషన్ మేనేజర్ టి. వెంకట రమణ, పాఠశాల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఒకే దేశం ఒకే రాజ్యాంగం అనే నినాదంతో దేశ సమైక్యత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పాఠశాల డైరెక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ, జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉండాలని పోరాడిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆ లక్ష్యం కోసం తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. వివేకా విద్యార్థులతో కలిసి ఈ వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కె రామరాజు, బొల్లిముంత కృష్ణ మాస్టారు సంస్థ సభ్యులు మాదల పూర్ణ, బొమ్ము రామకృష్ణా రెడ్డి, ఒతుకోలు మార్కండేయులు, బోడ సుధాకర్, దేవరపల్లి నాగరాజు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని డాక్టర్ శ్యామ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

7-7Pg5_7-7Pg5.qxd 06/Jul/26 11:08 PM Page 1



# అయోధ్య ట్రస్ట్‌కు కొత్త జనరల్ సెక్రటరీ?

## చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం





**అయోధ్య,జులై 6:** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో నెలకొన్న వివాదం మధ్య ఆయన తన పదవికి రాజీనామా చేశారు. చంపత్ రాయ్ వారసుడిగా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బాగ్రా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా, ప్రభుత్వ రంగ సంస్థల్లో మాజీ అధిపతిగా పనిచేసిన బాగ్రాకు పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో విశేష అనుభవం ఉందని, ట్రస్ట్ కార్యకలాపాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు ఆయన సేవలు ఉపయోగపడతాయని వర్గాలు భావిస్తున్నాయి. ట్రస్ట్ తదుపరి దశలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో పరిపాలన, ఆర్థిక నిర్వహణ, సంస్థాగత పాలనపై పట్టు ఉన్న వ్యక్తిని బాధ్యతల్లోకి తీసుకురావాలన్న ఆలోచనతో ట్రస్ట్ ఉన్నట్లు సమాచారం. అయితే చంపత్ రాయ్ మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటే తప్ప ట్రస్టీగా కొనసాగనున్నారని తెలుస్తోంది. కొత్త జనరల్ సెక్రటరీ పేరును వెంటనే ప్రకటించే అవకాశం లేదని సమాచారం. ఈనెల 19, 20 తేదీల్లో ఢిల్లీలో జరిగే వీహెచ్‌పీ ద్వైవార్షిక జాతీయ కార్యవర్గ సమావేశంలో సంస్థాగత మార్పులు, బదిలీలతో పాటు ఈ అంశంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రామ మందిర విరాళాల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కఠిన వైఖరి అవలంబించగా, దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అనంతరం చంపత్ రాయ్‌తో పాటు ట్రస్టీ అనిల్ మిశ్రా తమ రాజీనామాలను సమర్పించారు. ఎస్ఐటీ ప్రాథమిక నివేదిక ప్రకారం, ఆలయానికి వచ్చిన నగదు విరాళాలను లెక్కించే బాధ్యతలో ఉన్న సిబ్బంది, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ఫుటేజీని క్రమం తప్పకుండా పరిశీలించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నగదును అపహరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనలో సుమారు రూ.7 నుంచి రూ.7.5 కోట్ల వరకు నగదు గల్లంతైనట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ రామ్ శంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ కూడా ఉన్నాడు. టిన్నూ యాదవ్ తనపై ఉంచిన నమ్మకాన్ని దుర్వినియోగం చేసి ఈ మోసానికి పాల్పడ్డాడని చంపత్ రాయ్ తన సన్నిహితులతో చెప్పినట్లు వర్గాలు వెల్లడించాయి. పట్టుబడే పరిస్థితి వచ్చినప్పుడు టిన్నూ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఓ నేతకు సమాచారం లీక్ చేశాడని కూడా సమాచారం. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ఇతర నిందితుల్లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ ఉన్నారు. ఇప్పటివరకు చంపత్ రాయ్, మిశ్రా, ప్రత్యేక ఆహ్వానితుడు గోపాల్ రావుపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయితే వీరిపైనా కేసు నమోదు చేయాలని కోరుతూ ఫైజాబాద్ బార్ అసోసియేషన్‌కు చెందిన అయోధ్య న్యాయవాదులు పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు.



## పహల్గామ్ ఉగ్రదాడి కేసు
## నిందితుడు హాఫీజ్ సయీదే!
### అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ
### నిందితుల జాబితాలో టీఆర్ఎఫ్ సంస్థ పేరు

**న్యూఢిల్లీ, జులై 6:** పహల్గామ్ ఉగ్రదాడి కేసులో తాజాగా, పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. సోమవారం జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఈ కొత్త ఛార్జిషీట్‌లో, సయీద్, అతని అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) పేర్లను చేర్చారు. ఈ టిఆర్ఎఫ్ సంస్థ కాశ్మీర్‌లో ఎల్ఇటికి కార్యాచరణ విభాగంగా పనిచేస్తోంది. జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో, ఉగ్రవాద నిరోధక సంస్థ హాఫిజ్ సయీద్‌పై అతని 'వ్యక్తిగత హోదాలో', లష్కరేతోయిబా (ఎల్ఇటి), టిఆర్ఎఫ్ అధిపతిగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. భారతదేశంపై యుద్ధం ప్రకటించడం, సరిహద్దు దాటి కుట్ర పన్నడం వంటి ఆరోపణలపై కూడా ఎన్ఐఏ తన ఛార్జిషీట్‌లో హాఫిజ్ సయీద్‌పై శిక్షాస్మృతి సెక్షన్‌ను ప్రయోగించింది. డిసెంబర్ 15, 2025న దాఖలు చేసిన తన మునుపటి ఛార్జిషీట్‌లో, ఎన్ఐఏ పాకిస్తానీ ఉగ్రవాది సారథి సాజిద్ జట్‌తో పాటు, జులై 2025లో ఆపరేషన్ మహాదేవ్ సమయంలో భద్రతా దళాల చేతిలో హతమైన ముగ్గురు ఉగ్రవాదులు, అలాగే అరెస్టు చేయబడిన ఇద్దరు నిందితులను నిందితుడిగా చేర్చింది. పహల్గామ్ ఉగ్రదాడిని ప్రణాళిక చేయడం, సులభతరం చేయడం, అమలు చేయడంలో నిషేధిత ఎల్ఇటి/టిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ పాత్రకు గాను, దానిని ఒక చట్టబద్ధమైన సంస్థగా కూడా పరిగణించి అభియోగాలు మోపింది.





# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

### ఆరుగురు ఉగ్రవాదులు అరెస్టు, తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలు స్వాధీనం

**న్యూఢిల్లీ, జులై 6:** పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు మాడ్యూళ్లను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల ఫలితంగా భట్టితో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఒక ఉగ్రవాద మాడ్యూల్‌తో పాటు అక్రమ ఆయుధాల రవాణా నెట్‌వర్క్‌ను కూడా ఛేదించారు. ఈ మూడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అనంతరం ఈ ఆపరేషన్ చేపట్టారు. అరెస్టు అయిన ఆరుగురు నిందితులు ఈ నెట్‌వర్క్‌లో భాగమని, కుట్ర పూర్తి స్థాయిని నిర్ధారించడానికి, ఈ ఆపరేషన్‌తో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించడానికి వారిని విచారిస్తున్నామని అధికారులు తెలిపారు. దాడుల సమయంలో, ఈ నెట్‌వర్క్‌లోని సభ్యులు ఉపయోగించినట్లు ఆరోపించబడిన అనేక తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రాంచీ ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై దాడిలో బాంబులు వాడారు:** రాంచీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై ఇటీవల జరిగిన దాడిలో పెట్రోల్ బాంబులను కూడా ఉపయోగించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆ ఘటనకు, షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపించబడిన నెట్‌వర్క్‌కు మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయేమో దర్యాప్తు అధికారులు పరిశీలిస్తారని పోలీసులు తెలిపారు. అయితే, అటువంటి సంబంధం ఉన్నట్లు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఢిల్లీ పోలీసుల ప్రకారం, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఆరోపించబడిన ఉగ్రవాద, ఆయుధ సరఫరా మాడ్యూళ్ల గురించి మరింత సమాచారం సేకరించడానికి నిందితులను విచారిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని అరెస్టులు, స్వాధీనాలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నీరవ్ మోడీ అప్పగింతకు లైన్‌క్లియర్

## అంతర్జాతీయ కోర్టులోనూ లభించని ఊరట



**లండన్, జులై 6:** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఇసిహెచ్ఆర్) నుండి ఉపశమనం పొందేందుకు చేసిన విఫల ప్రయత్నంతో సహా, యునైటెడ్ కింగ్‌డమ్‌లో తనకున్న అన్ని చట్టపరమైన మార్గాలను వినియోగించుకున్న తర్వాత, భారతదేశానికి అప్పగించబడే అవకాశం ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, యుకె కోర్టులలో అప్పీళ్లను వినియోగించుకున్న తర్వాత మోడీ ఏప్రిల్‌లో ఇసిహెచ్ఆర్‌ను ఆశ్రయించారు. యూరోపియన్ కోర్టు ఆయనకు ఉపశమనం కల్పించలేదని, దీంతో ఆయన అప్పగింతను సవాలు చేయడానికి తదుపరి చట్టపరమైన మార్గాలు ఏవీ మిగల్లేదని వర్గాలు తెలిపాయి. చట్టపరమైన ప్రక్రియ వాస్తవంగా పూర్తవడంతో, మోడీని భారత అధికారులకు అప్పగించడానికి అవసరమైన పరిపాలనా లాంఛనాలను యుకె ప్రభుత్వం ప్రారంభించినట్లు సమాచారం. ఈ అప్పగింత ఇప్పుడు ఎప్పుడైనా జరగవచ్చని దౌత్య వర్గాలు సూచించాయి. 2019 మార్చి నుంచి లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైల్లో నిర్బంధంలో ఉన్న నీరవ్ మోడీ, తనను భారత్‌కు అప్పగిస్తే అక్కడ తనకు హింస ఎదురవుతుందని వాదిస్తూ పలు అప్పీళ్లు దాఖలు చేశారు. అయితే ఈ వాదనలను భారత్ తరఫున సిబిఐ, ఇడి అధికారులు బలమైన ఆధారాలతో ఖండించినట్లు సమాచారం. పిఎన్‌బి మోసం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోడీని స్వదేశానికి తీసుకురావడం భారత్ దర్యాప్తు సంస్థలకు పెద్ద విజయంగా భావిస్తున్నారు. మోడీ భారతదేశంలో పిఎన్‌బి మోసం కేసు, మనీలాండరింగ్ దర్యాప్తు, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, సాక్షులను ప్రభావితం చేశారనే ఆరోపణలతో కూడిన మరో కేసుతో సహా మూడు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.

# అబార్షన్‌పై నిర్ణయం తల్లిదే

### విడిపోయిన భర్త అనుమతి అనవసరం

### మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు




**ఇండోర్, జులై 6:** వైద్యపరమైన గర్భవిచ్ఛిత్తి చట్టం, 1971 ప్రకారం, విడిపోయిన భర్త సమ్మతి లేకుండానే తన 13 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి ఒక మహిళకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. హైకోర్టు ఇండోర్ బెంచ్‌లోని జస్టిస్ సందీప్ ఎన్ భట్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ఆ మహిళ తన భర్త నుండి విడిగా నివసిస్తోందని, వైవాహిక సంబంధాన్ని కొనసాగించడానికి ఇష్టపడటం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆమెకు పునరుత్పత్తి స్వేచ్ఛ హక్కు ఉంది. అందువల్ల, ఆమెకు గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడానికి అనుమతివ్వాలని పేర్కొంది. గర్భంకొనసాగించాలా?లేదా అబార్షన్ చేయించుకోవాలా? అన్నది తల్లి నిర్ణయం ప్రధానమని వ్యాఖ్యానించింది. భర్తనుంచి దూరంగా ఉంటున్నందున అతని అనుమతి అవసరంలేదని పేర్కొంది. వారు మొదట విడాకుల విషయంలో ఒక అంగీకారానికి వచ్చినప్పటికీ, ఆ తర్వాత భర్త వెనక్కి తగ్గడంతో, స్థానిక కోర్టు అతనికి నోటీసు జారీ చేసింది. అయితే, అతను కోర్టు ముందు హాజరు కాలేదు. ఆ తర్వాత భార్య, తాను 13 వారాల గర్భవతి అని కోర్టుకు తెలియజేస్తూ, అబార్షన్‌కు అనుమతి కోరుతూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్‌ను ఆశ్రయించింది. అయితే, భర్త తరఫున కోర్టులో ఎవరూ హాజరు కాలేదు. ఆమె వాదనలన్నీ విన్న తర్వాత, కోర్టు అబార్షన్‌కు అనుమతి మంజూరు చేసింది.

# 11న భారత్ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మహేంద్రగిరి



**న్యూఢిల్లీ, జులై 6:** భారత నౌకాదళం మరో అత్యాధునిక యుద్ధ నౌకను తన బలగాల్లోకి చేర్చుకోనుంది. స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన ప్రాజెక్ట్17ఏకు చెందిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ మహేంద్రగిరిని ఈ నెల 11న విశాఖపట్నంలో అధికారికంగా కమిషన్ చేయనున్నారు. ఎఫ్38 పెన్నెంట్ నంబర్ కలిగిన ఈ యుద్ధ నౌకను భారత నౌకాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరును ఈ యుద్ధనౌకకు పెట్టారు. ఈ పేరుతో భారత నౌకాదళంలో చేరుతున్న తొలి యుద్ధనౌక ఇదే కావడం విశేషం. స్వదేశీ రూపకల్పన, స్వదేశీ నిర్మాణంతో ఆధునిక యుద్ధనౌకలను అభివృద్ధి చేసే భారత నౌకాదళ లక్ష్యంలో ఇది మరో మైలురాయిగా భావిస్తున్నారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి నీలగిరి క్లాస్ లేదా ప్రాజెక్ట్17ఏలో భాగంగా నిర్మితమైంది. ఇప్పటికే సేవలందిస్తున్న శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్‌లకు మరింత ఆధునిక రూపంగా వీటిని రూపొందించారు. రాడార్‌కు సులభంగా కనిపించకుండా ఉండే స్టెల్త్ సాంకేతికత, తక్కువ ఇన్‌ఫ్రారెడ్ ఉద్గారాలు వంటి ప్రత్యేకతలతో ఈ యుద్ధనౌకను అభివృద్ధి చేశారు. శత్రు రాడార్లు, క్షిపణుల గుర్తింపును తప్పించుకునే సామర్థ్యం మరింత పెరుగుతుంది.

# రాజ్యసభ మూడు స్థానాలకు నోటిఫికేషన్



**కోల్‌కత్తా,జులై 6:** పశ్చిమ బెంగాల్ లో అధికార మార్పిడి అనంతరం అనేక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీకి ముఖ్యమంత్రి సువేందు అధికారి సారథ్యంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంవరుస షాకులిస్తోంది. ఇప్పటికే ఈడీ, ఐటీ దాడులు జరుగుతున్నాయి. వ్యతిరేకంగా ప్రచారం చేసిన సెలెబ్రెటీలను కూడా వదలట్లేదు. కేసులు నమోదవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య పశ్చిమ బెంగాల్ లో మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అసెంబ్లీ ప్రాంగణంలో పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. రాత్రికి ఫలితాలు వెల్లడవుతాయి. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు సభ్యులు తమ పదవీ కాలం ముగియక ముందే రాజీనామాలు చేయడం వల్ల ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. కిందటి నెల 8న సుఖేందు శేఖర్ రాయ్, 10న సుస్మితా దేవ్, 11న ప్రకాష్ చిక్ బరాక్ తమ సభ్యత్వాలకు రాజీనామాలు సమర్పించారు. అవి ఆమోదం పొందాయి. ఈ ఎన్నికల ద్వారా నూతనంగా ఎంపికయ్యే ఎంపీలు 2029 ఆగస్టు, 2030 ఏప్రిల్ వరకు సభ్యులుగా కొనసాగుతారు. పశ్చిమ బెంగాల్ రాజ్యసభ ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7 మంగళవారం నోటిఫికేషన్ జారీ అవుతుంది. నామినేషన్లను దాఖలు చేయడానికి చివరి తేదీ 14. 15 నాటికి నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి 17వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. 24 పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కిస్తారు. 27వ తేదీ నాటికి ఉప ఎన్నికల ప్రక్రియ మొత్తం కూడా పూర్తవుతుంది. ఉప ఎన్నికలను ఎటువంటి వివాదాలు లేకుండా, అత్యంత పారదర్శక పద్ధతిలో నిర్వహించడానికి, పోలింగ్ పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక పర్యవేక్షక బృందాలను రంగంలోకి దించనుంది. నిష్పక్షపాత వాతావరణంలో ఈ కీలక ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా సరిపోవు భద్రతా సిబ్బంది, ప్రత్యేక పరిశీలకులను నియమిస్తున్నట్లు అండర్ సెక్రటరీ రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

# ఆర్మీ ట్రయల్స్‌పరీక్షల్లో ఉగ్రమ్ రైఫిల్ సక్సెస్

### హైదరాబాద్ స్టార్టప్ డ్విపా డిఫెన్స్ రైఫిల్‌కు రక్షణ కొనుగోళ్లు

**న్యూఢిల్లీ,జులై 6:** రక్షణ తయారీ సంస్థ డ్విపా డిఫెన్స్ దేశీయ రక్షణ తయారీలో కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ అభివృద్ధి చేసిన ఉగ్రం 7.6251 మి.మీ. బ్యాటిల్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కీలక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ రైఫిల్‌ను పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో కలిసి ఈ రైఫిల్‌ను అభివృద్ధి చేశారు. కేవలం 100రోజుల్లోనే దీని రూపకల్పన, తయారీ పూర్తి కావడం విశేషం. ఇది దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చేసిన స్వదేశీ ఆయుధ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. డ్విపా డిఫెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిబు జోసెఫ్ మాట్లాడుతూ 2021లోసంస్థకు తయారీ లైసెన్స్ లభించిందని, తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 13 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో హైదరాబాద్‌లో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2021లో ప్రారంభమైన తమ ప్రయాణంలో ఇప్పటివరకు 100కు పైగా స్వదేశీ ఆయుధ వ్యవస్థలు, వాటి వేరియంట్లు అభివృద్ధి చేశామని, అందులో ఉగ్రామ్‌తమ ప్రధాన ఉత్పత్తిగా నిలిచిందని సిబు జోసెఫ్ పేర్కొన్నారు. భారత భద్రతా బలగాల కోసం ప్రపంచ స్థాయి రక్షణ ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఉగ్రామ్ రైఫిల్ విశ్వసనీయత, మన్నికకు సంబంధించిన విస్తృత పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసింది. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ కోసం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది.

గ్యాస్ ఆపరేటెడ్ రొటేటింగ్ బోల్ట్ వ్యవస్థతో రూపొందించిన ఈ రైఫిల్ బరువు నాలుగు కిలోల కంటే తక్కువ. దీని ప్రభావవం తమైన కాల్పుల పరిధి 500 మీటర్లు.డ్విపా డిఫెన్స్ ప్రస్తుతం అసాల్ట్ రైఫిళ్లు, కార్బైన్లు, సబ్ మెషిన్ గన్స్, అల్ట్రా లైట్ మెషిన్ గన్స్, యాంటీ డ్రోన్ వ్యవస్థలతో కూడిన స్వదేశీ ఆయుధాల శ్రేణిని కూడా అభివృద్ధి చేస్తోంది. ఆర్మీ ట్రయల్స్ విజయవంతంగాపూర్తికావడం, కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కావడంతో స్వదేశీ రక్షణ తయారీ కేంద్రంగా హైదరాబాద్ మరింత బలోపేతం అవుతుందని సంస్థ భావిస్తోంది.

# 9న ఆఖరి కార్యాచరణ: పాకిస్థాన్‌కు పిఒకె నేతల తుది హెచ్చరిక




**ముజఫరాబాద్, జులై 6:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకాశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) పాక్ సర్కారుకు అల్టిమేటమ్ ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పిఒకె ప్రజలు, ప్రవాస కాశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పిఒకెలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్రమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాకిస్థాన్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జెఎఎసి అభ్యర్థించింది. నిరసనల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జెఎఎసి డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమ కు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది.

**భారత్ సహాయం కావాలి:** కాగా.. జెఎఎసి నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓవిడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.' మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరతఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్లుగా ఆవిడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్ ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిందని అందులో ఆరోపించారు.

## ఢిల్లీలో నవవధువు మృతి కలకలం..

# భర్త అరెస్ట్.. కట్న వేధింపుల కేసు నమోదు

**న్యూఢిల్లీ, జులై 6:** నవవధువు అనుమానాస్పద మృతి కేసు సంచలనంగా మారింది. పెళ్లై కేవలం 72 రోజులకే 28 ఏళ్ల అక్కృతి సుతార్ మృతి చెందడంతో పోలీసులు కట్న వేధింపుల కేసు నమోదు చేసి ఆమె భర్త అరస్తు సిక్కాను అరెస్ట్ చేశారు. ఈనెల 4న ఢిల్లీలోని లోధీ కాలనీ ప్రాంతంలోని పాలికా కుంజ్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ హత్య కలకలం రేపింది. అపార్ట్‌మెంట్ భవనం పై అంతస్తు నుంచి కిందపడిన స్థితిలో అక్కృతి తీవ్రగాయాలతో కనిపించింది. వెంటనే ఆమెను ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.అక్కృతి తల్లి అను సాయ్ సుతార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కుమార్తెను భర్త అరస్తు సిక్కా, అత్తింటి కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపించారు. అక్కృతి ఈ ఏడాది ఏప్రిల్ 24న తన చిన్ననాటి స్నేహితురాలు అగస్టికా సోదరుడు అరస్తు సిక్కాను ప్రేమపెళ్లి చేసుకుంది. ఛత్తర్‌పూర్‌లోని ఓ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న అక్కృతి, పెళ్లి తర్వాత కూడా ఉద్యోగం కొనసాగిస్తానని పెళ్లికి ముందే స్పష్టంగా చెప్పిందని ఆమె తల్లి తెలిపారు. ఆ షరతుకు అత్తింటి వారు అంగీకరించిన తర్వాతే వివాహానికి ఒప్పుకున్నామని వెల్లడించారు. పెళ్లి అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆమె ఆరోపించారు. ఉద్యోగం మానేయాలని, త్వరగా గర్భం దాల్చాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చారని, ఇంటి పనులతో ఇబ్బంది పెట్టి ఉద్యోగాన్ని వదిలేయాలనే పరిస్థితి సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లితో ఫోన్‌లో మాట్లాడినా, పుట్టింటికి వెళ్లినా అవ



మానించేవారని, మానసికంగా, శారీరకంగా వేధించేవారని ఆమె తెలిపారు.జూన్ 17న ఫోన్ సైలెంట్‌లో ఉండటంతో కాల్ అందుకోలేదనే కారణంగా భర్త బెల్ట్‌తో కొట్టాడని అక్కృతి తనకు చెప్పిందని తల్లి వెల్లడించారు. మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందంటూ భర్త తరచూ అనుమానాలు వ్యక్తం చేసేవాడని ఆరోపించారు. జూన్ 29న తనను చంపే అవకాశం ఉందని అక్కృతి భయపడుతూ ఫోన్‌లో చెప్పిందని తల్లి పేర్కొన్నారు. అదే రోజు తాను వండిన భోజనం వేడి చేయలేదనే కారణంతో మరోసారి భర్త దాడి చేశాడని ఆరోపించారు.ఆ తర్వాత అక్కృతి తన స్నేహితురాలు, మరదలు అయిన అగస్టికా ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పిందని, అక్కడికి వచ్చిన అరస్తు మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు సర్దిచెప్పి ఇద్దరినీ ఇంటికి పంపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## అణ్వస్త్రరహిత ప్రాంతంలో చైనా బాలిస్టిక్ క్షిపణి పరీక్ష



**బీజింగ్, జులై 6:** దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని అణ్వస్త్ర రహిత మండలంలో అణుశక్తి జలాంతర్గామి నుంచి చైనా దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని సోమవారం పరీక్షించింది. ఈ ప్రయోగం పలు ప్రాంతీయ దేశాల్లో ఆందోళనకు దారితీసింది. దీనిపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, ఈ ప్రయోగం సైనిక వార్షిక శిక్షణలో భాగమే నని చైనా తెలిపింది. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహించామని, ఏ దేశాన్ని లేదా లక్ష్యాన్ని ఉద్దేశించి చేయలేదని పేర్కొంది. అందులో నిజమైన అణు వార్‌హెడ్‌కు బదులుగా డమ్మీ వార్‌హెడ్‌ను ఉపయోగించినట్లు వెల్లడించింది. ఇదే తరహా పరీక్షను రెండేళ్ల కిందట కూడా నిర్వహించినట్లు చైనా తెలిపింది.

## కీవ్‌పై రష్యా భారీ డ్రోన్ దాడి



**కీవ్, జులై 6:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా భీకర దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో మాస్కో విరుచుకుపడటంతో అనేక భవనాలు ధ్వంసమయ్యాయని, 12 మంది ప్రాణాలు కోల్పోయారని కీవ్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నాటో శిఖరాగ్ర సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ కానున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. కీవ్‌లోని సైనిక-పారిశ్రామిక సౌకర్యాలు, ఇంధన, శక్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## తేజ్‌ప్రతాప్ పార్టీనుంచి వీణామాన్వీ బంకిపూర్ నుంచి పోటీ



**పాట్నా,జులై 6:** బీహార్‌లో బంకీపూర్ ఉప ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది. తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్ శక్తి జనతా దళ్ కూడా బరిలో దిగింది. సామాజిక కార్యకర్త వీణా మాన్వీని తమ అభ్యర్థిగా ప్రకటించింది. తేజ్ ప్రతాప్ యాదవ్ తన పార్టీ ఫారమ్‌ను ఆమెకు అధికారికంగా అందజేశారు. అనంతరం వీణా మాన్వీ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచినందుకు పార్టీకి ధన్యవాదాలు తెలియజేశారు. బంకిపూర్ ప్రజల గొంతుకగా నిలుస్తానని, పార్టీ అంచనాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## శ్రీలంక జైలులో రక్తపాతం..మృతుల సంఖ్య 25కు పెరుగుదల

**కొలంబో, జులై 6:** శ్రీలంక పశ్చిమ తీరంలోని నెగోంబో జైలులో జరిగిన ఘర్షణలు తీవ్ర విషాదానికి దారితీశాయి. ఖైదీల మధ్య చెలరేగిన హింసలో మృతుల సంఖ్య 25కు చేరింది. ఈ విషయాన్ని సోమవారం అక్కడి అధికారులు అధికారికంగా వెల్లడించారు. రెండు ప్రత్యర్థి ఖైదీ వర్గాల మధ్య ప్రారంభమైన ఘర్షణలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. సోమవారం కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగింది. కొందరు ఖైదీలు జైల్లోని ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో భద్రతా పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 19 మంది మృతి చెందగా, వంద మందికిపైగా గాయపడ్డారు.

## మోహన్‌లాల్‌ను వెంటాడుతున్న ఏనుగుదంతాల కేసు



**తిరువనంతపురం,జులై 6:** మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగుదంతాల అక్రమనిల్వ కేసు కేరళ హైకోర్టులో కొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది.ఆ పత్రాల ప్రకారం మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతోపాటు దంతాలతో చేసిన మరో 1 కళాఖండాలు ఉన్నాయి. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి.

## దలైలామాకు ప్రధాని మోడీ జన్మదిన శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 6:** ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా 91వ పుట్టిన రోజును పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రపంచ శ్రేయస్సు పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు.

7-7Pg6exHMNWJQE_7-7Pg6exHMNWJQE.qxd 06/Jul/26 10:41 PM Page 1






# ఎమ్మెల్సీ సీటుపై తమ్ముళ్ల గంపెడాశలు!

● త్వరలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో 2 స్థానాలు భర్తీ ● పార్టీ అధిష్టానానికి దరఖాస్తు ● అగ్రనేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసన మండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ సీట్ల కోసం టిడిపి నేతలు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో వివిధ పదవులకు పోటీ భంగపడిన నేతలు ఈ పర్యాయం అధిష్టానం తమను కరుణిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. శాసనమండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలోని 2 స్థానాలు ఈ నెల 28తో ఖాళీ అవుతున్నాయి. మండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం, వైసిపి ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుంది. ఇందులో ఒకటి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యకు ఇస్తారని అంటున్నారు. ఇటీవల జరిగిన రాజ్య సభ ఎన్నికల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. దీనితో సీనియర్ అయిన ఆయనకు కనీసం ఎమ్మెల్సీ పదవి అయినా ఇవ్వడం ధర్మం అని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిసింది. 2027 జూన్ నెలలో మరో 23 స్థానాలు ఖాళీ అవుతాయి. అప్పుడు రామయ్యకు శాసన మండలి చైర్మన్ పదవి ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. లేదా మంత్రి వర్గంలోకి తీసుకునే అవకాశం ఉందంటున్నారు. 4 రాజ్యసభ స్థానాల్లో రెండు కమ్మ, బలిజ, బిసి వర్గాలకు ఒక్కోటి ఇచ్చారు. రెడ్డి, ఎస్సీలకు ఒక అవకాశం ఇవ్వలేదు. అలాగే రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించలేదు. ఈ నేపథ్యంలో ఎస్సీ నుంచి రామయ్యకు, రాయలసీమ నుంచి ఒక రెడ్డికి అవకాశం కల్పించవచ్చు అనుకుంటున్నారు. తిరుపతికి చెందిన టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌వి సుధాకర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారని తెలిసింది. సైకాలజిస్టుగా పేరున్న ఆయన 2020 నుంచి గత ఏప్రిల్ వరకు అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, కె.నారాయణస్వామి తదితరులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ కూడా అయిన తనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కడప నుంచి మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి కూడా రేసులో ఉన్నారు. ఆయన రాజ్యసభ సీటు ఆశించి విఫలం అయ్యారు. ఆయన భార్య మాధవి రెడ్డి కడప ఎమ్మెల్యేగా ఉన్నారు. పార్టీలో సీనియర్ నేతలు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వారికి, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో చాలా మంది నాయకులు పోటీ పడుతున్నారు. దేవినేని ఉమామహేశ్వర రావు, టిడి జనార్దన్, పీతల సుజాత, జవహర్, కెఇ ప్రభాకర్. పిఠాపురం నుంచి ఎస్‌విఎస్‌ఎన్ వర్మ, పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు, వంగవీటి రాధా, బుద్ధా వెంకన్న, కొమ్మాలపాటి శ్రీధర్ దువ్వారపు రామారావు, మోపిదేవి వెంకటరమణ రేసులో ఉన్నారు.

## విద్యుత్ బస్సులు ఆర్‌టిసినే కొనుగోలు చేపట్టాలి


● ఆర్‌టిసి ఉద్యోగుల ఐకాస డిమాండ్



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ బస్సులు కొనుగోలు ఆర్‌టిసి ద్వారానే చేపట్టాలని ప్రధాన డిమాండ్‌తో ఈ సంస్థ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి (జెఎసి) డిమాండ్ చేసింది. ఆర్‌టిసి సిబ్బందితోనే ఈబస్సుల నిర్వహణ చేయాలని కోరింది. ప్రైవేట్ ఆపరేటర్లతో బస్సులు నడుపుతామంటే అంగీకరించబోమని ఉద్యోగ సంఘాలు తేల్చిచెప్పాయి. ఉద్యోగుల సమస్యలపై ఆర్‌టిసి జెఎసి నేతలతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఇడిలు బ్రహ్మానందరెడ్డి, వర్మతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఉద్యోగసంఘాల నేతలతో ఇడి ఆపరేషన్స్ నాగేశ్వరరావు పలు కీలక అంశాల గురించి చర్చలు జరిపారు. అనంతరం స్పెషల్ సిఎస్, ఎండీలకు ఇడిలు వివరాలను తెలిపారు. మరోవైపు 'స్త్రీ శక్తి' పథకానికి అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేసింది. స్త్రీ శక్తి పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగిందని, ఆర్‌టిసికి రావాల్సిన బకాయిలు వసూలు చేసి బస్సులు కొనాలని సూచించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయటం సహా 30 డిమాండ్లను ఆర్‌టిసి ఐకాస అధికారుల ముందుంచారు. ప్రతిపాదించిన కార్యాచరణ ప్రకారం నిరసన కార్యక్రమాలు ఉంటాయని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. తమ అజెండాపై ఇంకా స్పష్టత రాలేదని ఉద్యోగ సంఘాల కన్వీనర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఆర్‌టిసి ద్వారానే విద్యుత్ బస్సులు కొనాలని చెప్పగా దానిపై వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఆపరేటర్లతో విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్‌టిసిని ప్రైవేటీకరణ చేయడమేనని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశం ముగ్గిందినా జరిగిందని ఉద్యోగ సంఘాల కన్వీనర్ దామోదరరావు వివరించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇడిలు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులతో విద్యుత్ బస్సుల కొనుగోలు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. మూసివేసిన డిపోలు పునరుద్ధరించాలి. పరిష్కారంకాల్సిన సమస్యలపై 10 రోజుల్లో సమావేశం పెడతామన్నారు. మా పోరాటం వ్యక్తిగతం కాదు, ఆర్‌టిసిని రక్షించుకోవడమే అని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

# త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడే విద్యుత్ తీగలు, లోఓల్టేజ్ తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది జిల్లాల నుండి 52 మంది తమ సమస్యలు తెలిపారు. డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్‌కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, లత, పిఆర్‌ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.




# చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నానిని అరెస్టు చేయాలి

**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రోత పనులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి ర్యాలీగా వచ్చారు. ప్రజాస్వామ్యంగా ఫిర్యాదు చేయడానికి వస్తున్న వారిని పోలీసులు అడ్డుకుని ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ముందుకు వెళ్లనీయలేదు. పోలీసుల అడ్డంకులను దాటుకుని ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్న తర్వాత కూడా ప్రధాన గేట్లు మూసివేసి లోపలికి వెళ్లకుండా నిలువరించారు. దీంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రధాన ద్వారం ఎదుటే రోడ్డుపై బైఠాయించడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఫిర్యాదు చేసే హక్కును కూడా కాలరాస్తున్నారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఆయనతో పాటు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు గేటు ఎదుటే నిరసనకు దిగగా, పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బైఠాయింపును విరమింపజేసేందుకు పోలీసులు బలవంతంగా ప్రయత్నించగా పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు యత్నించడంతో చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, శివశంకర్‌రాజుతో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను అడ్డుకునేందుకు పార్టీ కార్యకర్తలు పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు ఎస్పీని కలవనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు.

## ఏపి సిఆర్‌డిఏ అధికారిక వెబ్‌సైట్‌లో యూనిట్ ఆఫీసుల వద్ద వార్షిక కౌలు వివరాలు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణానికి భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సౌకర్యం కోసం, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపి సిఆర్‌డిఏ) కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులకు అందించే వార్షిక కౌలు చెల్లింపుల స్థితిగతులను పారదర్శకంగా తెలియజేసే ఉద్దేశంతో పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అలాగే రాజధాని గ్రామాలలోని క్యాపిటల్ అథారిటీ కార్యాలయాలవద్ద కౌలు చెల్లింపు వివరాలను ప్రదర్శించారు. రైతుల సౌకర్యం ప్రతి యూనిట్ ఆఫీస్ వద్ద హెల్ప్ డెస్కుల ఏర్పాటు చేసి రైతులకు వార్షిక కౌలు చెల్లింపుపై తలెత్తిన సందేహాలను సిఆర్‌డిఏ అధికారులు, సిబ్బంది వివరించడం జరుగుతోంది. ఆ విధంగా సోమవారం రాయపూడిలోని ప్రధాన కార్యాలయంలో రైతుల ఎన్‌పిసిఐ, బ్యాంక్ లింకేజీ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకుగాను హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా సిఆర్‌డిఏ సిబ్బంది పలువురు రైతులకు లింకేజ్ ప్రక్రియ పూర్తి చేశారు. వెబ్‌సైట్‌లో పొందుపర్చబడిన సమాచారంలో వార్షిక కౌలు జమ అయిన రైతుల వివరాలతో పాటు, ఇంకా కౌలు జమ కాని రైతుల వివరాలు, చెల్లింపులు నిలిచిపోవడానికి గల కారణాలను సైతం వెల్లడించారు. ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలను కలిగిన రైతుల జాబితాను సైతం అందుబాటులో ఉంచారు. గ్రామాల రైతులకు కౌలు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతున్న నేపథ్యంలో, ఎన్‌పిసిఐ లింకేజీ సక్రమంగా లేకపోవడం లేదా బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా ఉండటం వంటి కారణాల వల్ల కొందరి ఖాతాలకు చెల్లింపులు జమ కావడం లేదు. అలాంటి రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని ఏపి సిఆర్‌డిఏ సూచించింది.

**క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా వివరాలు:** రైతులు తమ వార్షిక కౌలు చెల్లింపు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు సిఆర్‌డిఏ నుంచి క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసింది. ఈ కోడ్‌ను స్కాన్ చేసి సంబంధిత వెబ్‌పేజీలో రాజధాని రైతులు తమ వివరాలను చెక్ చేసుకోవచ్చు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుండే కౌలు లబ్ది సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించింది. కౌలు లబ్ది పొందని రైతులు తమ పేర్లు, ఖాతా వివరాలు, ఏ కారణం చేత కౌలు జమ కాలేదోనన్న అంశాలను సైతం చెక్ చేసుకోవచ్చు. ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలలో కౌలు నగదు జమ చేయుట సాధ్యపడదు కనుక ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలు కలిగిన రైతులు వెంటనే ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని కోరింది.

## ఏపి సచివాలయంలో ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరం

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్ధం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రారంభించారు. ఏపి సచివాలయం మూడవ భవనం అప్సా (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించి ఉద్యోగుల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సూచించారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్‌లైన్ సబ్మిషన్, కొత్త ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫోటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో వచ్చి వారి ఓటరు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అనంతరం ఈ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు వివరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సిఇఒ వివేక్ యాదవ్ ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలక్టర్ సాయికాంత్ వర్మ, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జాయింట్ సిఇఒ ఇ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలి కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో 'లెనిన్' చిత్రబృందం



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సినీనటుడు అక్కినేని నాగార్జున, అక్కినేని అఖిల్, అమల కుటుంబంతో సహా "లెనిన్" చిత్రం బృందం సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈనెల 10వ తేదీ విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి ఆదివారం తిరుపతిలో ప్రి రిలీజ్ వేడుకలు జరిగాయి. అనంతరం సోమవారం తిరుమలకు చేరుకున్న చిత్ర బృందం నాగార్జున, అఖిల్‌తోబాటు సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, నటి భాగ్యశ్రీ, కమెడియన్ సునీల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి వెళ్ళారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయం చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన నటుడు నాగార్జున, అఖిల్‌ను చూసి అభిమానులు కరచాలనం, సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో సినీనటుడు మాధవన్, తెలంగాణ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధ్యప్రదేశ్ మంత్రి గోవింద్ సింగ్ రాజ్‌పుత్, ఉత్తరప్రదేశ్ ఎంపి గణేష్ సింగ్ కుటుంబసభ్యులతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# దేశ విదేశాల నుండి 'శ్రీవారి వైద్యసేవ'కు ముందుకొస్తున్న వైద్యులు



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సేవ ప్రతి భక్తుడి జీవితంలో లభించే మహాభాగ్యమని, అదే స్ఫూర్తితో టిటిడి ప్రారంభించిన "శ్రీవారి వైద్యసేవ" కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా, విదేశాల్లోని నిపుణ వైద్యుల నుంచి విశేష స్పందన లభిస్తోందని టిటిడి జెఇఒ ఎ.శరత్ తెలిపారు. భక్తుల సేవలో విజయవంతంగా కొనసాగుతున్న శ్రీవారి సేవ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు వైద్య, పశువైద్య, ఇతర వృత్తి నిపుణులను స్వచ్ఛంద సేవలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో శ్రీవారి వైద్యసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మార్గదర్శకత్వంలో స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద కళాశాల, గోశాల, వైద్య విభాగం తదితర సంస్థల అధిపతులతో పలు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించిన అనంతరం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మూడు నెలల ట్రయల్ రన్‌గా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఎస్వీ గోసంరక్షణ శాలలో జరుగుతున్న వైద్యసేవలను ఆయన నిపుణ వైద్యులతో కలిసి పరిశీలించారు. జూన్ 20 నుండి స్లాట్ బుకింగ్ ప్రారంభం కాగా ఇప్పటికే 488 మంది స్పెషలిస్టు వైద్యులు, వివిధ విభాగాల నిపుణులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు మూడు రోజుల సేవా అవకాశం, ఇతర వైద్యులకు ఏడు రోజుల సేవా వ్యవధిని కల్పించామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు నెల రోజులు, ఆరు నెలలు లేదా ఏడాది పాటు కూడా సేవలం దించే అవకాశాన్ని కల్పించామని తెలిపారు. ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా ఆయా విభాగాధిపతుల ద్వారా సేవా స్లాట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

**గోసేవకు అపూర్వ స్పందన:** శ్రీవారి వైద్యసేవలో భాగంగా ప్రారంభించిన గోసేవ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని జెఇఒ శరత్ తెలిపారు. ఇప్పటివరకు మూడు బ్యాచ్‌ల సేవా స్లాట్లు పూర్తిగా భర్తీ కావడం ఈ కార్యక్రమానికి లభిస్తున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. వారం రోజుల పాటు సేవలందించిన డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ జి.పద్మ నాభన్ తదితరులు ఈ సేవ తమ జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, ఈ అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చెప్పినట్లు తెలిపారు.

గోశాలను రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పి.వి. లక్ష్మయ్య సందర్శించి గోవులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. గోసేవలో పాల్గొంటున్న నిపుణ వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులకు టిటిడి కల్పిస్తున్న వసతి, భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీయగా, వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్

## ఎస్వీ గోసంరక్షణశాలకు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ-టెండర్ల ఆహ్వానం

తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్.వి. గోసంరక్షణశాల డెయిరీ ఫామ్ అవసరాల కోసం రెండు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ టెండర్లను టిటిడి ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల సంస్థలు, సరఫరాదారులు హెచ్‌టిటిపిఎస్://టెండర్. ఎపిఇప్రొక్యూర్‌మెంట్. జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కరెంట్ టెండర్స్ విభాగంలో ఎస్వీ గోసంరక్షణ శాల డైరీ ఫామ్‌ను సర్కిల్/ డివిజన్‌గా ఎంపిక చేసి టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. టెండర్ పత్రాల డౌన్‌లోడ్ ప్రక్రియ సోమవారం సాయంత్రం 5గంటల నుండి ప్రారంభమైంది. టెండర్ పత్రాలను జులై 21 సాయంత్రం 5.05 గంటల లోపు సమర్పించాలి. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం 92814 13626 నంబర్‌లో సంప్రదించాలని టిటిడి కోరింది.

## తిరుమలలో గోగుల కుటుంబ సభ్యులపై పిడి యాక్ట్ ఇద్దరిని కడప సెంట్రల్ జైలుకు తరలింపు

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, భక్తులను, స్థానిక వ్యాపారులను, విధుల్లో ఉన్న పోలీసు భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న గోగుల కుటుంబానికి చెందిన నేరస్థులపై తిరుపతి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సాధారణ చట్టాల ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు ప్రివెంటివ్ డిటెన్షన్(పిడి) యాక్ట్ అమలు చేశారు. గోగుల కోటయ్య(22), గోగుల శ్రీనివాసులు(20)లను అరెస్ట్ చేసి, శ్రీకాళహస్తి సబ్ జైలు నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గోగుల శ్రీకాంత్ (25) ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అతనిపై కూడా పిడి యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. గోగుల నాగేష్ (44)తో కలిసి గత కొంతకాలంగా తిరుమలలో వివిధ నేరకార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. తిరుమలలో అక్రమ హాకింగ్ నిర్వహించడం, భక్తులకు నామాలు పెట్టే పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడడం, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయించడం, తోటి వ్యాపారులను బెదిరించడం, ఎదిరించిన వారిపై దాడులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పోలీసులు భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసిన సమయంలో బ్లేడ్లతో తమను తాము గాయపరుచుకోవడం, గోడలకు తలలు బాదుకుని స్వీయ గాయాలు చేసుకోవడం ద్వారా పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేసే విధానాన్ని అనుసరిస్తూ విధుల్లో ఉన్న సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం వీరి నేరశైలిగా గుర్తించారు.

గత రెండేళ్లలో తిరుమల వన్ టౌన్, టూ టౌన్, రేణిగుంట, యెర్పేడు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దొంగతనం, దౌర్జన్యం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై విడుదలైన ప్రతిసారి తిరిగి నేరాలకు పాల్పడుతూ, పోలీసు అధికారులను ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో వీరిపై పిడి యాక్ట్ అమలు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

## ఎర్రచందనం ముద్దాయి నాసర్ బాయ్‌పై పిడియాక్ట్



**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేసిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళకు చెందిన నాసర్ బాయ్(53)పై టాస్క్‌ఫోర్స్ అధికారులు పిడి యాక్ట్ అమలు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె.కులశేఖర్ ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్‌లు అమలు చేస్తున్నారు. తాజాగా కేరళకు చెందిన నాసర్ కెవన్ అనే నాసర్ బాయ్ తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాలయంలో ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇతనిపై పిడి యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిపై ఆరు ఎర్రచందనం కేసులు ఉన్నాయి. ఇతనిపై పిడి యాక్ట్ అమలులో భాగంగా నిందితుడ్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.



## తిరుమలలో శ్రీవారి భక్తజనం

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలలో మోస్తరుగా భక్తులు ఉన్నారు. వారాంతం సెలవులు ముగియడంతో సోమవారం ఉదయానికి వైకుంఠమ్-2లో 27 కంపార్టుమెంట్లలో భక్తులు నిరీక్షిస్తుండగా సాయంత్రానికి 23 కంపార్టుమెంట్లలో ఉన్నారు. సర్వదర్శనం కోసం 16గంటలు సమయం పడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.31 లక్షలు విరాళం

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలకు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం టిటిడికి చెందిన వివిధ పథకాలకు రూ.31 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లయన్ సాయివెంకట్ వేంకటేశ్వర సర్వ శ్రేయస్ ట్రస్ట్‌కు స్వర్ణ విహార్ ఇన్ ఫ్రా ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున రూ.10 లక్షలు, జయహో రామానుజ సినిమా ఆగస్టు 15న విడుదల సందర్భంగా మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. అలాగే గుంటూరుకు చెందిన జి.లావణ్య వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.11,11,111 లక్షలు విరాళంగా అందించారు. ఈవిరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## దలైలామా శతాధిక కాలం జీవించాలి

జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సిఎం చంద్రబాబు



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** బౌద్ధమత గురువు దలైలామాకు ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఎక్స్" వేదికగా ఆయన ట్వీట్ చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి, కరుణ, మానవత్వాన్ని పెంపొందించే తన పవిత్రమైన ఆశయ సాధనలో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు చేకూరాలని, శతాధిక కాలం జీవించాలని ప్రార్థిస్తున్నా. అని సిఎం అన్నారు.

7-7Pg7exHMNWJQE_7-7Pg7exHMNWJQE.qxd 06/Jul/26 10:46 PM Page 1



# ఉదయగిరి అభివృద్ధికి పరిశ్రమలే పునాది

● కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి ● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



**ఉదయగిరి, (నెల్లూరు) జులై 6 ప్రభాతవార్త:** ఉదయగిరి ప్రాంత సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గత రెండేళ్లలో ఉదయగిరి సంక్షేమం కోసం రూ.1,098.79 కోట్లు కేటాయించామని, ఇప్పటికే నాలుగు పరిశ్రమలకు ఆమోదం లభించగా వాటి ద్వారా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సోమవారం ఉదయగిరికి చేరుకున్న మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, యువనేత నారా లోకేష్ కృషితో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం ఆంధ్రప్రదేశ్‌కు రప్పించగలిగామని పేర్కొన్నారు. ఉదయగిరి ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని, పరిశ్రమలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్ర పరిస్థితులు క్రమంగా మెరుగు పడుతున్నాయని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రికొనియాడారు. తాను కూడా నారాయణ నేత్ర జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ రాకతో ఉదయగిరి అభివృద్ధికి మరింత వేగం వస్తుందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఉదయగిరి రూపు రేఖలు మారిపోతాయని ముఖ్యమంత్రి చంద్ర బాబు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్య కర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరిలో అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, యువ నేత లోకేష్ కృషితో పరిశ్రమలు ప్రారంభం కానున్నాయని, ఉదయగిరి- సీతారాంపురం మండలాలకు తాగు, సాగునీటి శాశ్వత పరిష్కారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నందవరం- ఉదయ గిరి రోడ్డుకు నిధుల కేటాయింపు, బనగాని పల్లి రోడ్డుకు అటవీశాఖ అనుమతుల సమస్య పరిష్కారం, ఉదయగిరిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతమ్మ, టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, చిరంజీవిరెడ్డి, బాబు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు అభివృద్ధే నా ధ్యేయం

● రూ.2 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం ● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు (నెల్లూరు), జులై 6 ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహిస్తూ జేజేలు చేస్తూ పూలవర్షం, హారతులతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. ప్రజల ఆశీర్వాదమే తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈసందర్భంగా సుమారు 2కోట్ల వ్యయంతో పూర్తయిన నూతన జడ్పీ హైస్కూల్ భవనం, సిసిరోడ్లు, పశువుల షెడ్లు ప్రారంభించడంతోపాటు శ్రీకోందడరామ స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆత్మకూరు మండలంలోని ఈగ్రామానికి రాలేకపోయినా తనను రెండోసారి ఎమ్మెల్యేగా రాష్ట్ర మంత్రిగా ఆశీర్వదించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు శాశ్వత ప్రయోజనం:** రైతాంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సోమశిల ఉత్తరకాలువ పొడిగింపు, 42 ఆర్ కాలువ పనులు ఎన్నో అడ్డంకులు ఎదురైనా పూర్తిచేసే దిశగా ముందుకు తీసుకెళ్తామన్నారు. గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. మిగిలిన పంటకాలువల పనులను కూడా దశల వారీగా పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

**పరిశ్రమలు, యువతకు ఉపాధే లక్ష్యం:** ఆత్మకూరును వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగంలోను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం తెలిపారు. రూ.67 కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కును పూర్తిచేశామని, పరిశ్రమలకు అవసరమైన నీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 23 పరిశ్రమలు స్థలాలు కేటాయించుకున్నాయని, మరిన్ని భారీ పరిశ్రమలు వచ్చేదశలో ఉన్నాయన్నారు. భూముల ఆక్రమణలను తొలగించి కొత్త పరిశ్రమలకు భూములు అందజేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

**స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం:** యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు ఆత్మకూరులో ప్రభుత్వ- ప్రవేటు భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు. గతంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలతోపాటు ఈ కేంద్రం ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామీణాభివృద్ధి, సాగునీరు, విద్య, ఆలయాల పునరుద్ధరణ, పరిశ్రమల ఏర్పాటు వంటి అనినన రంగాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం ఎన్‌డిఎ కూటమి రెండేళ్ళపాలన విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి ఆనం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును లబ్ధిదారులకు మంత్రి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తుల ఆభరణాలు నిజాయితీగా అప్పగింత



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తులు పోగొట్టుకున్న విలువైన బంగారు ఆభరణాలను టిటిడి సిబ్బంది నిజాయితీతో తిరిగి అప్పగించిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. తిరుమలలో భక్తులు పోగొట్టుకున్న విలువైన బ్యాగ్‌ను గుర్తించి సిసిటివి పర్యవేక్షణతో వేగంగా స్పందించారు. టిటిడి కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి అందులోని నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను యథాతథంగా భక్తులకు భద్రంగా అప్పగించారు. తెలంగాణకు చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులు మేదరమిట్ట నుండి గోగర్భ డ్యాం సమీపంలోని మఠాలకు మహేంద్ర టాక్సీ జీప్‌లో ప్రయాణిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌ను వాహనంలోనే మరిచిపోయారు. విషయం గుర్తించిన వెంటనే టిటిడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు సిసిటివి ప్లేబ్యాక్ ఫుటేజీలను పరిశీలించి ప్రయాణించిన జీప్‌ను గుర్తించారు. అప్పటికే తిరుపతికి చేరుకున్న డ్రైవర్‌ను సంప్రదించి బ్యాగ్‌ను భద్రంగా స్వాధీనం చేసుకుని, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భక్తుల సమక్షంలో బ్యాగ్‌ను తెరిచి అందులోని విలువైన వస్తువులను ధృవీకరించి యథాతథంగా అప్పగించారు. టిటిడి భద్రతా విధానంపై భక్తుల ప్రశంసించారు.

## హాకర్లపై దాడులు... 30 మంది బైండోవర్



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో అనధికారికంగా భక్తులకు తిరునామం దరింపజేసి అందినకాడికి వసూలుచేస్తున్న అనధికార హాకర్లపై పోలీసులు దాడులు చేశారు. అనుమతులు, లైసెన్సు లేకుండా భక్తులకు నామాలు పెడుతూ, వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న 30 మందిని గుర్తించారు. వారిని తిరుమల నుంచి తిరుపతికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేసినట్లు తిరుమల పోలీసులు తెలిపారు. తిరుమలలో అనుమతులు లేకుండా నామాలు పెట్టడం, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అత్యవసర సేవల కోసం 112కు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

● ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ స్కాన్ పంపి డబ్బులు చెల్లించాలని ఫోన్లు చేస్తారు

● చిత్తూరు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక



**చిత్తూరు, జులై 6 ప్రభాతవార్త:** దోచుకోవడానికి కాదేది అనర్హం కావడంతో సైబర్ నేరగాళ్ళ దృష్టి ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించే వారిపై పడింది. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ మేరకు ఆస్తి, ట్రేడ్ లైసెన్స్ పన్నులను మీరు చెల్లించాల్సివుందని, తాము ఫోన్ ద్వారా ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపుతున్నామని, తాము పంపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలని ఇందుకు సంబంధించి రసీదును డబ్బులు చెల్లించిన వెంటనే ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురికి సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఫోన్ చేసి పన్నులు చెల్లించాల్సిందిగా కోరడం ఏమిటని ఒకరిద్దరు ఈ విషయంను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో కమీషనర్ అప్రమత్తం అయ్యారు. సైబర్ నేరగాళ్ళు మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల పేరిట చిత్తూరు నగర ప్రజల నుండి దోపిడి చేయడానికి పక్కా ప్రణాళికతో ఈ విధంగా పన్ను చెల్లింపుదారులకు ఫోన్లు చేస్తున్నారని కమీషనర్ గుర్తించారు. పన్నులు చెల్లించాలని ఫోన్ చేసే సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా వుండాలని మున్సిపల్ కమీషనర్ ప్రజలను హెచ్చరించారు. ఇంటి, ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సుల పన్నులు చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తుల నుండి పలువురికి ఫోన్‌కాల్స్ వస్తున్నాయనే విషయం తమ దృష్టికి వచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నుల మొత్తంను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తాము పంపే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలని సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. పన్నులు చెల్లించమని కమీషనర్ గాని, ఇతర అధికారులు కాని ఎవరికి నేరుగా ఫోన్ చేయరని, అలాగే ఫోన్‌పే, గూగుల్‌పే స్కానర్‌కు డబ్బులు పంపమనే చెప్పే అవకాశం లేదన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంతమంది ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సైబర్ నేరగాళ్ళు 919440 219722 నెంబర్ నుండి ఫోన్ చేసి తాము మున్సిపల్ కార్యాలయం నుండి మాట్లాడుతున్నామని, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పన్నులు చెల్లించాలని అడుతున్నారన్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై ప్రజలు స్పందించవద్దని, డబ్బులు చెల్లించవద్దని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ ఫోన్ కాల్స్‌పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, పన్ను చెల్లింపుదారులకు ఎదైనా సందేహాలు వుంటే నేరుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్వహణ ప్రైవేటుకు!

● అర్హత కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నాం ● రూ.306.29 కోట్లతో అత్యాధునిక మౌలిక సదుపాయాలు ● హార్బర్ ద్వారా 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్ష ప్రయోజనం ● వేలాది మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ● మంత్రి బిసి జనార్దన్ రెడ్డి



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి మెరుగుదలతో పాటు, వారి ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నెల్లూరు జిల్లాలో నిర్మితమవుతున్న జువ్వలదిన్నె మత్స్యకార హార్బర్ ఇందుకు ప్రత్యేక నిదర్శనమని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఫిషింగ్ హార్బర్‌కు సంబంధించి కీలకమైన నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు అర్హత కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, పరిశుభ్రత, భద్రత, మానవ వనరుల వినియోగం, మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత మెరుగుపరచడం కోసం ఆపరేషన్స్ మెయింటెనెన్స్ కింద ప్రతిపాదనలు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రధానంగా కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు వంటి వాటి నిర్వహణ ప్రస్తుతం ప్రభుత్వాల తలకు మించిన భారంగా మారుతున్న క్రమంలో, ఈ అంశంపై దేశంలో ఇతర రాష్ట్రాల్లో కూడా జరుగుతున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రవేట్ ఆపరేటర్లు అత్యంత సమర్థవంతంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లను నిర్వహిస్తున్న ఉదంతాలు మనకు కనిపిస్తున్నాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం మత్స్యకారులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ అందించేందుకు ఆపరేషన్స్ మెయింటెనెన్స్ కింద ప్రవేట్ సంస్థల నుంచి టెండర్లు పిలవాలని నిర్ణయించడమైందని తెలిపారు. ఇందులో భాగంగా అత్యధిక వార్షిక లైసెన్స్ ఫీజు కోట్ చేసిన సంస్థను ఆపరేషన్స్ మెయింటెనెన్స్ కోసం ఎంపిక చేయడం జరుగుతుందని, అదే సమయంలో హార్బర్ భూమిపై ఎంపికైన సంస్థకు ఎటువంటి యాజమాన్య బదిలీ లేదా లీజు హక్కులు కల్పించబడవని మంత్రి స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆపరేటర్ ద్వారా హార్బర్‌లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, భద్రత అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించబడుతుందని మంత్రి తెలిపారు. బోట్ల నిలుపుదల నుంచి ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ వరకు అన్ని సదుపాయాలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా నిర్వహణ చేపట్టబడుతుందన్నారు. పారదర్శకమైన వేలం విధానం అమలు చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రభావం తగ్గి, మత్స్యకారులకు వారి చేపలకు పోటీ ధరలు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు.. ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ సమర్థవంతంగా నిర్వహించడం వల్ల చేపల వేట అనంతర నష్టాలు గణనీయంగా తగ్గి, చేపల నాణ్యత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా విశ్రాంతి గదులు, నెట్ మెండింగ్ షెడ్లు, ఇతర సౌకర్యాలన్నీ నిరంతరం నిర్వహించబడటం వల్ల మత్స్యకారులు మరింత సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన వాతావరణంలో తమ వృత్తిని కొనసాగించగలుగుతారని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ఆధునిక ఫిషింగ్ సెంటర్‌గా అభివృద్ధి చేసి, మత్స్యకారుల ఆదాయం, జీవన ప్రమాణాలు, ఎగుమతి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ముఖ్యంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఇప్పటివరకు రూ. 306.29 కోట్ల వ్యయంతో 95.51శాతం భౌతిక పురోగతి సాధించిందన్నారు. హార్బర్‌లో మొత్తం 1,250 మత్స్యకార బోట్లకు నిలుపుదల సౌకర్యం కల్పించగా, ఇందులో 1,000 మోటరైజ్డ్ బోట్లు, 200 మెకనైజ్డ్ బోట్లు, 50 ట్యూనా లాంగ్‌లైనర్ బోట్లకు వసతి కల్పించే విధంగా రూపకల్పన చేశామన్నారు.

**6100 మంది మత్స్యకారులకు ప్రయోజనం:** ఈ హార్బర్ ద్వారా సుమారు 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుండగా, చేపల వ్యాపారులు, ఐస్ పరిశ్రమ కార్మికులు, రవాణా రంగం, అనుబంధ సేవల ద్వారా వేలాది మందికి పరోక్ష ఉపాధి లభించనున్నట్లు మంత్రి తెలిపారు. హార్బర్‌లో 835 మీటర్ల ఉత్తర బ్రేక్‌వాటర్, 620 మీటర్ల దక్షిణ బ్రేక్‌వాటర్, 10.50 లక్షల క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్, 909 మీటర్ల క్వేలు పూర్తయ్యాయి. అలాగే ఆధునిక ఆక్షన్ హాల్స్, ట్యూనా ప్యాకింగ్ హాల్, చేపల ఎండబెట్టే యార్డ్, 500 రీలీ సామర్థ్యంతో ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఐస్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజ్ వంటి సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 9 గేర్ షెడ్లు, 4 నెట్ మెండింగ్ షెడ్లు, 3 విశ్రాంతి గదులు, కమ్యూనిటీ హాల్, రెస్టారెంట్‌డార్మిటరీ, గెస్ట్ హౌస్ నిర్మించారు. అదనంగా 53,695 చ.మీ. అంతర్గత రహదారులు, 33,938.73 చ.మీ. పార్కింగ్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, రేడియో కమ్యూనికేషన్ టవర్, కోస్టల్ పోలీస్ స్టేషన్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది.

## సూపరింటెండెంట్ నుంచి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా జెకె కృష్ణశ్రీకి పదోన్నతి

● నూతన బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆర్‌జెడి పి. తిమ్మప్ప ఆకాంక్ష



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జేకే కృష్ణ శ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో)గా పదోన్నతి పొందిన సందర్భంగా జోన్2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) పి. తిమ్మప్ప ఆమెను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సమాచార పౌరసంబంధాల సంచాలకుల కార్యాలయంలో కృష్ణశ్రీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జేడీ పి. తిమ్మప్ప మాట్లాడుతూ.. సూపరింటెండెంట్‌గా ఆమె ఇప్పటివరకు అందించిన సేవలను ప్రశంసించిన ఆర్జేడీ పి. తిమ్మప్ప, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా నూతన బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, సమర్థతతో పనిచేసి శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తన ఉద్యోగ బాధ్యతల్లో సూపరిండెంట్ గా కృష్ణశ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందడం సంతోషకరం. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆర్జేడీ పి. తిమ్మప్ప అన్నారు. అభినందించిన వారిలో సీనియర్ అసిస్టెంట్లు డీవి సుబ్రహ్మణ్యం, ఉమర్ ఫరూక్, జూనియర్ అసిస్టెంట్లు వి. సునీత, రికార్డు అసిస్టెంట్ కృష్ణారావు, ఆఫీసు సబార్డినేట్లు చిన వెంకటేశ్వర రావు, భానుమతి, తదితర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నారి పెళ్లి కూతురు

- టెన్త్ విద్యార్థినికి వివాహం
- మెడలో తాళి, కాళ్లలో మెట్టెలతో స్కూల్ కు హాజరు
- వారం కిందట పెళ్లి
- ఆలస్యంగా వెలుగులోకి
- అయినా స్పందించని జిల్లా విద్యా, ఐసిడిఎస్ అధికారులు

**అనంతపురం (క్రైమ్), జులై 6 ప్రభాతవార్త:** పట్టుమని పదిహేనేళ్లు లేవు. చదువుకునేందుకు పదో తరగతిలోకి అడుగుపెట్టిందో.. లేదో.. అప్పుడే పెళ్లి పీటలెక్కింది ఓ పదో తరగతి విద్యార్థిని. మెడలో తాళిబొట్టు, కాళ్ళల్లో మెట్టెలతో తరగతులకు హాజరు కావడం సంచలనంగా మారింది. ఈ ఘటన అనంతపురం జిల్లా కర్ణాటక సరిహద్దుల్లోని ఓ రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థిని కావడం గమనార్హం. వారం రోజుల కిందట పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. పెళ్ళయ్యాక బాలిక చదువుపై మక్కువతో మళ్ళీ తరగతులకు హాజరవుతుండడంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. అయితే ఈ విషయం ఇంతవరకు జిల్లా విద్యాశాఖ ఇంచార్జ్ అధికారి, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీసు అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

## దుర్గమ్మ హుండీల ద్వారా రూ.3.39కోట్ల ఆదాయం



**ఇంద్రకీలాద్రి, జులై 6 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో సోమవారం జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రు.3కోట్ల 39లక్షల 53వేల 599ల నగదు, 576 యుఎస్ఎ డాలర్స్, 100 ఆస్ట్రేలియన్ డాలర్స్, 22 మలేషియన్ రింగేట్స్, యుఎఇ దిర్హమ్స్ 295, సింగపూర్ డాలర్లు 13, యూరోలు 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, సౌదీ రియాల్స్ 20, కెనడా డాలర్లు 75, నైజీరియా నైరాలు 1500, సౌతాఫ్రికా ర్యాండ్స్ 70, ఒమన్ రియాల్స్ 50, కంబోడియన్ రియాల్స్ 800, కతార్ రియాల్స్ 7, దారుసలేం డాలర్స్ 2, టాంజానియా షిల్లాంగ్స్ 30,000, కెన్యా షిల్లాంగ్స్ 200, కొరియన్ వన్ 850, భూటాన్ న్యూల్ట్రుం 1, హాంకాంగ్ డాలర్స్ 160, బంగ్లాదేశ్ టాకాలు 20, కువైట్ దినార్లు 0.5, కొలంబియన్ మిల్ పెసోస్ 2, టర్కి లిరాలు 10 ఫిలిప్పైన్స్ పిసోలు 100, థాయ్‌లాండ్ బాత్‌లు 80, చైనా యువాన్లు 51, పాకిస్తాన్ రుపిలు 500, యుగోస్లోవియా దినార్లు 500 లతో పాటు పాత ఇండియన్ కరెన్సీ నగదు 2వేల నోట్లు 5, వెయ్యి నోట్లు 9, 500 నోట్లు 74 లభించాయని ఇఒ శీనా నాయక్ తెలిపారు.

**దుర్గమ్మ భక్తుల విరాళాలు:** నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన అదృష్టార్ రత్నాలయం జ్యులరీస్ యాజమాని గుడివాడ రమణలాల్ రు.1,00,016ల విరాళం అందించారు. అదేదాత రు.1,00,016లను ఉచిత ప్రసాద పంపిణీ పథకానికి రుచర్మ పేరిట అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# మామిడి రైతును ఆదుకోవడానికి పటిష్ట చర్యలు

● ఉనికి కోసం వైకాపా విమర్శలు ● ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు ధ్వజం



**చిత్తూరు, జులై 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మామిడి రైతును ఆదుకోవడానికి పటిష్ట చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా మామిడి రైతుకు కేజీకి రూ.4 సబ్సిడీ ప్రకటించి దన్నుగా నిలిచి చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. చిత్తూరులోని ఎంపి కార్యాలయంలో సోమ వారం దగ్గుమళ్ళ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. రైతు సంక్షేమం కోసం పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా తన ఉనికిని కాపాడుకోవడం కోసం విమర్శలు చేస్తోందన్నారు. మామిడి రైతుల కష్టాలను గుర్తించి ముందు చూపుతో కేజీకి రూ.4 సబ్సిడీ ప్రకటించి మామిడి రైతుకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కూటమి సర్కార్ అన్నారు. రైతు పక్షపాతిగా మరోసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరూపించారని, ఇది సిఎం పాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనను చూడలేక వైకాపా నేతలు నిరసనల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వం రూ.281 కోట్ల ఆర్థిక సహాయంను అందించాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారని ఎంపి గుర్తు చేశారు. దీనికి కేంద్ర వ్యవసాయ శాఖ స్పందించి తోతాపురి మామిడి ధరలు పడిపోవడానికి గల కారణాలను గుర్తించి, ఆదాయంను పెంచే మార్గాలను అన్వేషించడానికి కేంద్ర ప్రభుత్వం ఐసిఏఆర్ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింద న్నారు. ఈ పరిస్థితుల్లో గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేయడం విడ్డూరంగా వుందన్నారు. మామిడి రైతును వైకాపా ప్రభుత్వం గతంలో ఐదేళ్ళ పాటు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు దేశం కార్యదర్శి అశోక్‌కుమార్, ఎపి మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

07-07pg10_07-07pg10.qxd 06/Jul/26 11:21 PM Page 1



## జింబాబ్వే టి20 సిరీస్‌కు సంజూ ఔట్, ప్రభ్‌సిమ్రన్ ఇన్
## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన శివమ్ దూబే



**ముంబై, జులై 6:** ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు, జింబాబ్వేతో జరిగేటీ 20 సిరీస్‌లకు టీమిండియా జట్లను బీసీసీఐ ప్రకటించింది. శివమ్ దూబే దాదాపు రెండేళ్ల తర్వాత భారత వన్డే జట్టులోకి వచ్చాడు. గాయంతో దూరమైన నితీశ్ కుమార్ స్థానాన్ని దూబేతో బీసీసీఐ సెలక్షన్ కమిటీ భర్తీ చేసింది. టీ20 జట్టులో కీలక సభ్యునిగా ఉన్న దూబే.. చివరివన్డే 2024 ఆగస్టులో ఆడాడు. ఇదొక్క మార్పుతోనే సరిపెట్టింది.

జూలై 23నుంచి ప్రారంభం కాబోయే జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. సంజూ శాంసన్‌పై సెలక్టర్లు వేటు వేశారు. అతడి స్థానంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను ఎంపిక చేశారు. అలాగే వైభవ్ సూర్యవంశీని కొనసాగించారు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడుతున్న అక్షర్ పటేల్, వాషింగ్టన్ , రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు విశ్రాంతినిచ్చారు. అశోక్ శర్మ, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్‌లు జట్టులోకి రాగా, ఫినిషర్ రింకూ సింగ్ తిరిగి జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు.

**ఇంగ్లండ్‌తో వన్డేలకు భారత్ జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ , కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్,అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే.

**జింబాబ్వేతో టీ20లకు భారత్ జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, ప్రభ్‌సిమ్రన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

## గుండె పగిలిన బ్రెజిల్ స్టార్ నేమార్
# సాకర్‌కు అల్విదా

**న్యూజెర్సీ, జులై 6:** బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో కొత్త తరానికి స్ఫూర్తిగా నిలిచిన నేమార్ జూనియర్ వీడ్కోలు పలికాడు. పీలే, రొనాల్డో, రొనాల్డిన్హో వంటి దిగ్గజాల వారసత్వాన్ని కొనసాగించి, షో మ్యాన్‌గా ఓ వెలుగు వెలిగిన నేమార్ అనూహ్యంగా సాకర్‌కు బైబై చెప్పేశాడు. ఫిఫా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లో నార్వే చేతిలో ఓటమితో కుంగిపోయిన బ్రెజిల్ స్టార్ నేమార్.. ఈ తీవ్ర నిర్ణయానికి వచ్చాడు. ఆ సమయంలో తీవ్ర ఉద్వేగానికి గురై, కన్నీరు పెట్టుకున్నాడు. తన కెరీర్ ఎక్కడ మొద లైందో అక్కడే ముగిసిందని వెల్లడించాడు. తన ప్రాణానికి ప్రాణమైన ఆటకు నేమార్ విచార వదనంతో అల్విదా చెప్పడం కోట్లాదిమందిని కలచివేసింది. ఈ నిర్ణయంతో నేమార్ 16 ఏళ్ల కెరీర్ ముగిసింది.

నేమార్... బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఈ పేరు ఓ సంచలనం. బ్రెజిల్ తరపున ఆడిన దిగ్గజ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్రెజిల్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలవడంతో పాటు.. జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 130 మ్యాచ్‌లలో 80గోల్స్ సాధించాడు. 2010లో అరంగేట్రం చేసిన న్యూజెర్సీలోని మెల్‌లైఫ్ స్టేడియంలోనే యాదృచ్ఛికంగా చివరి మ్యాచ్ ఆడేశాడు.

రెండో అర్ధభాగంలో మైదానంలోకి వచ్చిన నేమార్.. పెనాల్టీని గోల్‌గా మలిచినా, బ్రెజిల్‌ను టోర్నీ నుండి నిష్క్రమించకుండా ఆపలేకపోయాడు. ఫైనల్ విజిల్ తర్వాత అతను ఏకధాటిగా ఏడుస్తున్న దృశ్యాలు అభిమానుల హృదయాలను కలచివేశాయి. అతని బ్రెజిల్ సహచరులు చాలామంది అతన్ని ఓదార్చడానికి ప్రయత్నించారు, కానీ బార్సిలోనా మాజీ ఆటగాడైన అతను పూర్తిగా కుంగిపోయాడు. "నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇప్పుడు అంతా ముగిసింది" అని నేమార్ అన్నాడు.




*నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇపుడు అది ముగిసింది... నార్వే చేతిలో ఓటమితో బ్రెజిల్ నిష్క్రమించిన తర్వాత గుండె పగిలిన ఆవేదనతో ఫుట్‌బాల్ దిగ్గజం నేమార్ పలికిన మాటలు. సాకర్ ప్రపంచకప్ అందించాలన్న కలలు కల్లలయిన వేళ కన్నీళ్లతో తన ఫుట్‌బాల్ కెరీర్‌కు అల్విదా పలికాడు.*

# మెక్సికోకు ఇంగ్లండ్, బ్రెజిల్‌కు నార్వే షాక్




**న్యూజెర్సీ, జులై 6:** నార్వే సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలిసారి ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో హాట్ ఫేవరెట్ బ్రెజిల్‌పై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. నార్వే స్టార్ ఫార్వర్డ్, మాంచెస్టర్ సిటీ సంచలనం ఎర్లింగ్ హాలాండ్ రెండు గోల్స్‌తో నార్వేకు అద్భుత విజయాన్ని అందించాడు. ప్రారంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అయితే బ్రెజిల్‌కు లభించిన గోల్డెన్ ఛాయిస్‌ను చేజార్చుకుంది. ఆట ప్రారంభంలోనే పెనాల్టీ లభించగా గిమారెస్ దాన్ని గోల్‌గా మలచడంలో తడబడ్డాడు. నార్వేగోల్‌కీపర్ నైలాండ్ అడ్డుకున్నాడు. దీంతో తొలి హాఫ్ ముగిసేసరికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

### చెలరేగిన హాలాండ్

ద్వితీయార్థంలో నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ దూసుకుపోయాడు. ఆట 79వ నిమిషంలో నార్వే ఆటగాడు షెల్డెరప్ అద్భుతమైన క్రాస్‌ను అందించగా దాన్ని హాలాండ్ అత్యంత ఎత్తుకు లేచి బ్రెజిల్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ ఇచ్చిన షాక్ నుంచి బ్రెజిల్ కోలుకోకముందే, హాలాండ్ మరోసారి తన ప్రతాపం చూపించాడు. బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను అనుకూలంగా మార్చుకుంటూ మ్యాచ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు హాలండ్ రెండో గోల్ సాధించి నార్వే ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఇది ఈ సాకర్ వరల్డ్ కప్‌లో హాలాండ్‌కు ఏడో గోల్. మెస్సీ,కిలియన్ ఎంబాపేల సరసన నిలిచిన హాలాండ్... గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు.

### ఇంజ్యూరీ టైమ్‌లో బ్రెజిల్ గోల్

ఇకమ్యాచ్ ఇంజ్యూరీ టైమ్ 10వ నిమిషంలో బ్రెజిల్ ఆటగాడు కాసెమిరోను నార్వే డిఫెండర్ ఓస్టిగార్డ్ ప్రమాదకరంగా అడ్డుకోవడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. ఈ పెనాల్టీని నేమార్ గోల్‌గా మలిచి నార్వే ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. ఈ ప్రపంచ కప్‌లో నేమార్‌కు ఇదే మొదటి గోల్.అప్పటికే సమయం మించిపోవడంతో బ్రెజిల్ 2-1తో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

### బెల్లింగ్‌హామ్ డబుల్.. మెక్సికోపై విజయం

సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అసాధారణ ఆటతీరు కొనసాగుతోంది. మెక్సికోను దాని సొంతగడ్డపై 3-2తో ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ రెండు నిమిషాల వ్యవధిలో (36, 38) రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. కెప్టెన్ హ్యారీ కేన్ పెనాల్టీ ద్వారా మరో గోల్ (60వ నిమిషం) సాధించాడు. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో బెల్లింగ్‌హామ్ తొలి గోల్‌తో ఇంగ్లండ్‌కు ఆధిక్యం అందించాడు. ఆ గోల్‌కు కేవలం 98 సెకన్ల వ్యవధిలోనే మరోసారి గోల్ చేసి స్కోరును 2-0కు చేర్చాడు. అతని వేగవంతమైన డబుల్‌తో మెక్సికో ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది.అయినా పుంజుకుని 42వ నిమిషంలో జూలియన్ క్విన్యోనెస్ గోల్ చేసి ఇంగ్లండ్ ఆధికాన్ని 2-1కు తగ్గించాడు.

### కేన్ గోల్.. క్యాన్సా రెడ్ కార్డ్

రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్దిసేపటికే ఇంగ్లండ్‌కు పెనాల్టీ లభించింది. 60వ నిమిషంలో హ్యారీ కేన్ దాన్ని గోల్‌గా మలిచి జట్టుకు 3-1 ఆధిక్యంఅందించాడు.అయిదే జారెల్ క్వాన్సా రెడ్ కార్డ్ గురై మైదానం వీడడంతో ... దీన్ని అవకాశంగా మార్చుకుని మెక్సికో వరుస దాడులు చేసింది. రౌల్ జి మెనెజ్ మరో గోల్ చేసి 3-2కు తీసుకువచ్చాడు. చివరి నిమిషాల్లో మెక్సికో సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.








## క్వార్టర్ ఫైనల్లో సినర్, కోకో గాఫ్

**లండన్, జులై 6:** ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్.. వరుసగా ఐదో వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. జపనీస్ క్వాలిఫయర్ షింటారో మోచిజుకిపై 6-3, 7-6, 6-3 తేడాతో గెలుపొందాడు. డిఫెండింగ్ ఛాంపియన్ సినర్..తొలి సెట్‌ను అలవోకగానే నెగ్గాడు. అయితే రెండో సెట్‌లో షింటారో నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. ఎవరి సర్వీసులు వారు నిలుపుకోవడంతో సెట్ టైబ్రేక్‌కు సాగింది. చివరకు అనుభవజ్ఞుడైన సినర్‌దే విజయం అయింది. మూడో సెట్‌ను మరింత ఈజీగా నెగ్గి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఏడుసార్లు వింబుల్డన్ విజేత నోవాక్ జొకోవిచ్ ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా సినర్ నిలిచాడు. పురుషుల సింగిల్స్ మిగతా నాలుగో రౌండ్‌లో కొబొలి 7-4, 7-6, 6-3తో మినార్‌పై అతికష్టంపై గెలుపొందగా...స్టఫ్ 3-6,6-7, 7-6, 7-5, 4-2తో హుర్కాజ్‌పై గెలుపొందాడు. చివరి సెట్‌లో హుర్కాజ్ తొడకండరాల గాయంతో రిటైర్ అయ్యాడు.

కాగా అమెరికా సంచలనం కోకో గాఫ్... మహిళల సింగిల్స్‌లో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్ చేరింది. నాలుగో రౌండ్‌లో బెలిండా బెన్సిక్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. తొలి సెట్‌లో గాఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కోకో గాఫ్ సర్వీసును బెలిండా బ్రేక్ చేసి తొలి సెట్‌ను 6-4తో నెగ్గింది. అయితే వెంటనే పుంజుకున్న కోకో గాఫ్ రెండో సెట్‌ను 6-3తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌ను కూడా ఈజీగా కైవసం చేసుకుని కోకో గాఫ్ ముందంజ వేసింది. మిగతా నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో నొస్కోవా 6-4, 7-6తో చెమటోడ్చి 26వ సీడ్ కీస్‌పై గెలుపొందగా... మూడు సెట్ల పోరులో పావోలిని 6-4, 4-6, 6-3తో ఇలాపై, మెర్టెన్స్ 6-4, 6-4తో బౌజ్కోవాపై, కోస్ట్యుక్ 6-4, 6-4తో క్రుయేగర్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరారు.

## ఆటో, మెటల్ షేర్ల మద్దతు




## లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. తొలి త్రైమాసిక వ్యాపార అప్‌డేట్లు ఆశాజనకంగా ఉండటం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, నైరుతి రుతుపవనాల పురోగతి మెరుగుపడటం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడం వంటి అంశాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగగా.. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడి 78 వేల 285 వద్ద ముగిసింది. నిఫ్టీ 159 పాయింట్లు ఎగిసి 24 వేల 430 వద్ద స్థిరపడింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ దాదాపు 2.36 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచాయి.

మరోవైపు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.679 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడి 95 రూపాయల 40 పైసల వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్పంగా తగ్గగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల 91 సెంట్ల వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లలో యూరప్ సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవగా ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణితో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈనెల వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు పెరగడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఫెడ్ సమావేశపు మినిట్స్‌పై కేంద్రీకృతమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 3.36 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.76, కరూర్ వైశ్యా బ్యాంక్ 4.87, బంధన్ బ్యాంక్ 4.06 శాతం లాభపడ్డాయి. డిక్సన్ టెక్నాలజీస్ దాదాపు 7 శాతం ఎగసింది. ఫెర్మెంటా బయోటెక్ 13.78 శాతం జంప్ చేసింది. మరోవైపు సుప్రియా లైఫ్‌సైన్స్ షేరు 11 శాతానికి పైగా పతనమైంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర షేరు 2.29 శాతం తగ్గింది. కొత్తగా లిస్టైన ఆస్త్రా స్పింటెక్స్ షేరు ఇష్యూ ధర కంటే స్వల్ప ప్రీమియంతో 136 రూపాయల 45 పైసల వద్ద ముగిసింది. ఫాల్కాన్ కాన్సెప్ట్స్‌కు 101 కోట్ల 93 లక్షల రూపాయల విలువైన వర్క్ ఆర్డర్ లభించడంతో ఆ కంపెనీ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

## భారత్ మార్కెట్ల నుంచి 580 మిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా



**ముంబయి,జులై 6:** భారత్ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో విత్‌డ్రా అయ్యాయి.గతవారం భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకున్నారు. ఎలారా సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు మొత్తం580 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇందులో భారత్‌కే ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టే ఫండ్ల నుంచి 250 మిలియన్ డాలర్లు వెనక్కి వెళ్లగా మిగిలిన నిధులు గ్లోబల్ ఎమర్జింగ్ మార్కెట్స్, ఆసియా ఎక్స్ జపాన్ ఫండ్ల ద్వారా ఉపసంహరణకు గురయ్యాయి.

అంతకుముందు వారంలో 94 మిలియన్ డాలర్లుగా ఉన్న ఉపసంహరణలు ఇప్పుడు మరింత పెరిగాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన భారీ విక్రయాలతో పోలిస్తే ప్రస్తుత ఉపసంహరణలు తక్కువగానే ఉన్నాయి. అమెరికా ఈక్విటీ ఫండ్ల నుంచి ఒక్క వారంలోనే 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. అంతకుముందు వారంలో ఈ మొత్తం 8 బిలియన్ డాలర్లుగా ఉండగా మూడు వారాల క్రితం మాత్రం రికార్డు స్థాయిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి.

మార్చి తర్వాత తొలిసారిగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో కూడా 9 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత పెట్టుబడుల ప్రభావంతో పెరిగిన ఎమర్జింగ్ మార్కెట్ పెట్టుబడుల జోరు తగ్గుముఖం పట్టిందని ఎలారా వెల్లడించింది. ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో తైవాన్ నుంచి 766మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. ఇది గత 11 ఏళ్లలో అత్యధికం. దక్షిణ కొరియా నుంచి 283 మిలియన్ డాలర్లు బయటకు వెళ్లగా బ్రెజిల్ నుంచి గత ఏడు వారాల్లో దాదాపు 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా అయ్యాయి. కమోడిటీ ఫండ్ల నుంచి వరుసగా ఎనిమిదో వారంలో 1.5 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఎనర్జీ ఫండ్ల నుంచి రికార్డు స్థాయిలో 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. బంగారం ఫండ్ల నుంచి 14 వారాల్లో అత్యధికంగా 3.1 బిలియన్ డాలర్లు ఉపసంహరించుకోగా వెండి ఫండ్లలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు.

## స్వల్పకాలిక రుణాలతో రూ.2.53 లక్షలకోట్ల సేకరణ

**ముంబయి,జులై 6:** దేశీయ కార్పొరేట్ సంస్థలు కమర్షియల్ పేపర్లు సీపీల ద్వారా నిధుల సమీకరణలో భారీ వృద్ధికనిపిస్తోంది. అనుకూలమైన వడ్డీ రేట్లు, సీజనల్ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇప్పటికే ఉన్న రుణాల రీఫైనాన్సింగ్ కారణంగా జూన్ నెలలో సీపీల ద్వారా నిధుల సమీకరణ దాదాపు ఐదేళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. జూన్ నెలలో కంపెనీలు కమర్షియల్ పేపర్ల ద్వారా రూ.2 లక్షల 53 వేల కోట్లను సమీకరించాయి. మే నెలతో పోలిస్తే ఇది 84.6 శాతం అధికం. గత ఏడాది జూన్‌తో పోలిస్తే 59.4 శాతం వృద్ధి నమోదైంది.

2021 జూలైలో రూ.2 లక్షల 69 వేల కోట్ల సమీకరణ తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం విశేషం. కరూర్ వైశ్యా బ్యాంక్ ట్రెజరీ విభాగాధిపతి వి. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణాలతో పోలిస్తే కమర్షియల్ పేపర్ల ద్వారా నిధుల సమీకరణ తక్కువ వ్యయంతో ఉండటం



తో కార్పొరేట్లు ఈమార్గాన్ని ఎక్కువగా ఎంచుకున్నారని తెలిపారు.వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు, మార్కెట్లో తగినంత నగదులభ్యత కూడా ఇందుకు దోహదపడిందని చెప్పారు. ధనలక్ష్మీ బ్యాంక్ ట్రెజరీ హెడ్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ అధిక వడ్డీతో కూడిన బ్యాంకు రుణాలకు బదులుగా తక్కువ వ్యయంతో లభించే స్వల్పకాలిక మార్కెట్ ఫండింగ్ వైపు కార్పొరేట్లు, ఎన్‌బీఎఫ్‌సీలు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల నుంచి మంచి డిమాండ్, స్థిరమైన క్రెడిట్ పరిస్థితులు కూడా ఈ ధోరణికి బలం చేకూర్చాయని వివరించారు.

కమర్షియల్ పేపర్లు అంటే కంపెనీలు 7 రోజుల నుంచి ఏడాది వరకు స్వల్పకాలిక నిధులు సమీకరించేందుకు ఉపయోగించే రుణ పత్రాలు. జూన్ తొలి భాగంలో కమర్షియల్ పేపర్లపై రిటర్నులు అధికంగా ఉన్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన భారీ లిక్విడిటీ ఇన్ఫ్యూజన్ చర్యలతో అవి తగ్గుముఖం పట్టాయి.ఆర్బీఐ వివిధ వేరియబుల్ రేట్ రెపో వేలాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.6 లక్షల కోట్లకు పైగా తాత్కాలిక లిక్విడిటీని అందించింది. ప్రస్తుతం జూలై 5 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.1 లక్షా 85 వేల కోట్ల అదనపు లిక్విడిటీ ఉన్నట్లు ఆర్బీఐడేటా చెపుతోంది.

## ఎన్‌ఎస్‌ఈ భారీ ఐపీవోకు రంగం సిద్ధం
## సెప్టెంబర్‌లో రూ.30 వేల కోట్ల పబ్లిక్ ఇష్యూ

**ముంబయి,జులై 6:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తన భారీ ఐపీవోను ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఐపీవో పరిమాణం సుమారు రూ.30వేల కోట్లు ఉండేఛాన్స్ ఉంది. ఈఇష్యూ విజయవంతమైతే,భారత కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా నిలవనుంది. ఈ ఐపీవో ద్వారా ఎన్‌ఎస్‌ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు పైగా చేరే అవకాశముందని అంచనా. ఇప్పటికే ఇష్యూకు సంబంధించిన రోడ్‌షోలను ప్రారంభించేందుకు ఎన్‌ఎస్‌ఈ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఐపీవో విజయవంతమైతే, 2024 అక్టోబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా చేపట్టిన రూ.27,870 కోట్ల ఐపీవో రికార్డును అధిగమించనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే జరుగుతుంది. ఇందులో మొత్తం 14 కోట్ల 89 లక్షల ఈక్విటీ షేర్లు విక్రయానికి రానుండగా, ప్రస్తుత వాటాదారులు కలిపి సంస్థలోని సుమారు 6 శాతం వాటాను విక్రయించనున్నారు.

ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఈకి దాదాపు 1.8 లక్షల మంది షేర్‌హోల్డర్లు ఉన్నారు. వాటా విక్రయిస్తున్న ప్రధాన వాటాదారుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధికంగా 2.48కోట్ల షేర్లు విక్రయించనుండగా,ఎంఎస్ స్ట్రాటజిక్ 1.60 కోట్ల షేర్లు విక్రయించనుంది. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్,




బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ది న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ తదితర సంస్థలు కూడా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయించనున్నాయి. అయితే ఎన్‌ఎస్‌ఈలో 10.72శాతం వాటాతో అతిపెద్ద వాటాదారైన ఎల్‌ఐసీ ఈ షేర్ విక్రయంలో పాల్గొనబోవడం లేదని స్పష్టం చేసింది. సెబీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) లభించిన అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్‌ఎస్‌ఈ బోర్డు ఐపీవో ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఐపీవో నిర్వహణ కోసం ఎన్‌ఎస్‌ఈ ఇప్పటికే 20 మంది మర్చంట్ బ్యాంకర్లను, న్యాయ సలహాదారులు, ఇతర మధ్యవర్తులను నియమించింది. ఎన్‌ఎస్‌ఈ ఐపీవో ప్రకటన అనంతరం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్‌లు కూడా సెబీకి తమ డ్రాఫ్ట్ పత్రాలను సమర్పించింది. జియో ప్లాట్‌ఫామ్‌ల ఐపీవో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్రం వాటాల విక్రయం



**కొచ్చిన్,జులై 6:** ప్రభుత్వ రంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం తన వాటాలను విక్రయిస్తోంది. ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా గరిష్ఠంగా5.04 శాతం వాటాను విక్రయించనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.1,400ను ఇష్యూ ధరగా నిర్ణయించారు. తొలి దశలో 2.52 శాతం వాటాను విక్రయించనుండగా పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభిస్తే గ్రీన్‌షూ ఆప్షన్ కింద మరో 2.52 శాతం వాటాను కూడా విక్రయించే అవకాశం ఉందని దీపమ్‌తెలిపింది. ఈఆఫర్‌లో జూలై 7న నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లు, జూలై 8న రిటైల్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలో భారీ వాటాల విక్రయానికి కేంద్రం సిద్ధమవుతోందన్న వార్తలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల ఖండించిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. మార్కెట్ అంచనాల ప్రకారం ఈ లావాదేవీ ద్వారా కేంద్రానికి రూ.16 వేల కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉందనిఅంచనా. తాజా షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రమోటర్ అయిన కేంద్రానికి 67.91 శాతం వాటా ఉంది. ఎల్‌ఐసీ సంస్థకు 3.34 శాతం వాటా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో తన వాటాను తగ్గించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం సాధారణంగా ఆఫర్ ఫర్ సేల్ విధానాన్ని అనుసరిస్తుంది. డిస్‌ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా పెరుగుతున్న ఆదాయంప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా కేంద్రం ఇప్పటికే దాదాపు రూ.14 వేల కోట్లు సమీకరించింది.

## మైక్రోసాఫ్ట్‌లో భారీ ఉద్యోగాల కోత
## 4,800 మందికి ఉద్వాసన

**శాన్‌ఫ్రాన్సిస్కో,జులై 6:** ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు శ్రీకారంచుట్టింది. సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 2.1 శాతం,అంటే దాదాపు 4,800 మందిని తొలగించనున్నట్లు ప్రకటించింది. కృత్రిమమేధ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వ్యాపార కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐ వినియోగాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బిగ్ టెక్ కంపెనీలు ఏఐమౌలిక సదుపాయాలపై 700 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయని అంచనా. ఇప్పటికే అమెజాన్, మెటా వంటి సంస్థలు కూడా వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి. 2026 తొలి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేర్ ధర దాదాపు 23 శాతం పడిపోవడం 2022 తర్వాత కంపెనీకి ఇదే అత్యంత బలహీనమైన తొలి అర్ధవార్షిక ప్రదర్శనగా నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14